అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

బుధవారం 30-8-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 | సంచిక : 240 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

ప్రమాదంలో పత్రికా స్వేచ్ఛ

న్యూస్‌క్లిక్ ఉదంతంపై ఎన్ రామ్



న్యూఢిల్లీ : దేశంలో పత్రికా స్వేచ్ఛ ప్రమాదంలో పడిందని ప్రముఖ పాత్రికేయుడు, హిందూ దినపత్రిక మాజీ సంపాదకుడు ఎన్.రామ్ ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిటన్ పత్రిక 'ప్రాస్పెక్ట్'కు ఆయన ఓ వ్యాసం రాస్తూ భారత రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటనా స్వేచ్ఛ దాడికి గురువుతోందని తెలిపారు.

న్యూస్‌క్లిక్‌కు చైనా నుండి నిధులు అందుతున్నాయని ఆరోపిస్తూ న్యూయార్క్ టైమ్స్‌లో కథనం ప్రచురితమైన తర్వాత ఆ సంస్థపై బీజేపీ, ఆ పార్టీ నాయకులు, మంత్రులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు ముప్పేట దాడి చేసిన విషయం విదితమే. ప్రజలను తప్పుదోవ పట్టించేలా తమపై వచ్చిన నిరాధార ఆరోపణలను న్యూస్‌క్లిక్ ఎడిటర్-ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ తోసిపుచ్చారు.

న్యూస్‌క్లిక్‌పై వచ్చిన ఆరోపణలను రామ్ ఆ వ్యాసంలో ప్రస్తావించారు. న్యూస్‌క్లిక్‌పై ప్రభుత్వ ప్రోత్సాహంతో తప్పుడు ప్రచారం సాగించారని, భయాందోళనలు రేకెత్తించారని, దూషణల పర్వం సాగించారని ఆయన తెలిపారు. ఆ సంస్థ వ్యవస్థాపకుడిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బెదిరింపులకు సైతం దిగారని వివరించారు.

కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడు పునరుద్ధరిస్తారు?

కేంద్రాన్ని ప్రశ్నించిన న్యాయస్థానం

- రాష్ట్ర హోదాపై రేపు ప్రకటన : సుప్రీంకు తెలిపిన కేంద్రం



న్యూఢిల్లీ : జమ్మూకాశ్మీర్, లఢక్‌లలో ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు నిలదీసింది. దేశ భద్రతను దృష్టిలో ఉంచుకొని నిర్దిష్ట కాలపరిమితికి లోబడి జమ్మూకాశ్మీర్‌ను కేంద్ర పాలిత ప్రాంతంగా మార్చి ఉండవచ్చునని అంటూ... తిరిగి ఆ ప్రాంతాన్ని పూర్తి స్థాయి రాష్ట్రంగా ఎప్పుడు మారుస్తారని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ ప్రశ్నించారు. దీనిపై కేంద్రం నుంచి సూచనలు పొందాలని అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి, తుషార్ మెహతాలను ఆదేశించారు. ప్రజాస్వామ్య పునరుద్ధరణ అనేది మన దేశానికి కీలకమని గుర్తు చేశారు. కాగా, జమ్మూకాశ్మీర్‌పై ఈ నెల 31న సవివరంగా ప్రకటన చేస్తానని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు మంగళవారం నివేదించింది. జమ్మూకాశ్మీర్‌కు కల్పించిన కేంద్ర పాలిత హోదా శాశ్వతం కాదని తెలిపింది. లఢక్ మాత్రం కేంద్ర పాలిత ప్రాంతంగానే ఉంటుందని స్పష్టం చేసింది. లఢక్‌లో సెప్టెంబర్‌లో ఎన్నికలు జరుగుతాయని తెలియజేసింది. ఆర్టికల్ 370 రద్దును వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ల విచారణ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ సమాచారం అందజేశారు. దీనిపై న్యాయస్థానం జోక్యం చేసుకుంటూ జమ్మూకాశ్మీర్‌లో సుదీర్ఘ కాలం ఎన్నికలు జరపకుండా ఉండడాన్ని

...13లో

తెలంగాణలో శాశ్వత నివాసులైన విద్యార్థులందరూ స్థానికులే



- మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియలో అదే విధానం అమలుచేయాలి : కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి హైకోర్టు ఆదేశం

7లో..

ఎలక్షన్ స్టంట్

వంటగ్యాస్ ధర రూ.200 తగ్గింపు.. కేంద్ర మంత్రి వర్గం నిర్ణయం



మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం శాసనసభలకు త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో వంట గ్యాస్ ధరను సిలిండర్‌పై 200రూపాయలు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కొంత కాలంగా గ్యాస్ సిలిండర్ ధర పెరుగుతూనే ఉన్న సంగతి తెలిసిందే. ఇంతకాలం ప్రజల నుంచి ఆందోళన వ్యక్తమైనప్పటికీ పట్టించుకోని కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు ఎన్నికల ముంగిట ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

న్యూఢిల్లీ : త్వరలో జరగనున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా గ్యాస్ ధరల తగ్గింపు నిర్ణయాన్ని నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రకటించిందన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. మంగళ వారం జరిగిన క్యాబినెట్ సమావేశం అనంతరం... నేషనల్ మీడియా సెంటర్ (ఎన్ఎంసీ)లో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ.. కేంద్ర మంత్రివర్గ నిర్ణయాలను వెల్లడించారు. విలేకరులతో మట్లాడిన మంత్రి ఓనం, రక్షా బంధన్ కానుకగా గ్యాస్ ధరలను తగ్గించినట్టు తెలిపారు. ప్రధానమంత్రి ఉజ్వల

...13లో

మోడీ మోసం!

నానో ఎరువు పేరుతో నకిలీ పరిష్కారం

- నిరూపణకాని ఫలితాలు
- దిగుబడి క్షీణత
- ఆహార భద్రతకు ముప్పు



నానో యూరియా ప్రాజెక్టును ప్రారంభిస్తున్న మోడీ (ఫైల్)

న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తున్న నానో యూరియా ప్రాజెక్టు పెద్ద మోసమని అంతర్జాతీయ, జాతీయ పరిశోధనల్లో నిర్ధారణవుతోంది. సంప్రదాయ యూరియాకు బదులు నానో యూరియాను రైతులు ఉపయోగించాలని, ఖర్చు తక్కువ, పంట దిగుబడులు ఎక్కువొస్తాయని మోడీ సర్కారు మీడియాలో అమిత ప్రచారం చేస్తోంది. కాగా ప్రతిష్టాత్మక కొపెన్ హగెన్ యూనివర్సిటీకి చెందిన మాక్స్ ఫ్రాంక్, సోరెన్ హూస్టెడ్‌లు

...13లో

జీవవైవిధ్యం ప్రశ్నార్థకం



నానో ఎరువుల పనితనం ఇఫ్కో చెప్పినట్టు లేదని అంతర్జాతీయ శాస్త్రవేత్తలతో పాటు దేశీయ శాస్త్రవేత్తలు సైతం ఢంకా భజాయించి చెపుతున్నారు. నానో ఎరువుల వాడకం వలన మొక్కలకు కావాల్సిన పోషకాలు సమపాళ్లలో అందుతాయనికానీ, దిగుబడి పెరుగుతుందనికానీ, భూసారంలో సమతుల్యత స్థిరంగా ఉంటుందని కానీ పరిశోధనల్లో నిరూపితం కాలేదు. ఒక సీజన్‌కే ఒక ప్రాంతంలోనే పరిశోధనలు జరిగాయి. అనేక సీజన్లలో అనేక ప్రాంతాల్లోని వ్యవసాయ క్షేత్రాల్లో పరిశోధనలు జరగాలి. జీవవైవిధ్యం సంగతేంటో తేల్లేదు. పైగా నానో యూరియా వలన భూమిలో నత్రజని నిల్వలు తగ్గిపోతు న్నాయి. దాంతో ఇంకా ఎక్కువ యూరియా అవసరమవు తుంది. దిగుబడి పెరగడమేమో ఉత్పాదకతలో క్షీణత కనిపిస్తోంది. దీనివలన ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. అనియత వాతావరణ, ఖరీదైన ఎరువులు, అధిక ఆహార ద్రవ్యోల్బణం సమస్యల నుంచి బయట పడటానికి మోడీ ప్రభుత్వం నానో పేరిట నకిలీ పరిష్కారమార్గాన్ని కనుగొంది. ఈ చర్య అసలు సమస్యల నుంచి రైతులను, ప్రజలను తప్పుదారి పట్టిస్తోంది.

పారామెడికల్ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

వైద్యారోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో- హైదరాబాద్

ఆర్థికంగా వెనకబడిన తరగతులకు (ఈడబ్ల్యూఎస్) కల్పించే 10 శాతం రిజర్వేషన్‌ను పారామెడికల్ కోర్సులకు వర్తింపచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. బీపీటీ, ఎంపీటీ, ఎంఎస్సీ (నర్సింగ్), పీ.బీ.బీయస్సీ (నర్సింగ్) కోర్సుల్లో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయానికి మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. తాజా నిర్ణయంతో బీపీటీలో 69 సీట్లు, ఎంపీటీలో 6 సీట్లు, ఎంఎస్సీ (నర్సింగ్)లో 25 సీట్లు, పీబీ బీయస్సీలో 23 సీట్లు రిజర్వ్ కానున్నాయి.

వంద పడకలకు పెంపు

కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌లో కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను అప్‌గ్రేడ్ చేయనున్నారు. ప్రస్తుతమున్న 30 పడకల నుంచి వంద పడకలకు పెంచనున్నారు. ఇందు కోసం రూ.26 కోట్లకు పరిపాలనా అనుమతినిస్తూ మంగళవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీ ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల వద్ద రూ.10.70 కోట్లతో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు అనుమతించారు.

సింగరేణికి హైకోర్టు షాక్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సింగరేణి కాలరీస్ కంపెనీలో ఖాళీగాఉన్న 177 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ నిమిత్తం సింగరేణి యాజమాన్యం 2022లో ఇచ్చిన నోటీఫికేషన్‌ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది. ఈ మేరకు సోమవారం జస్టిస్ మాధవీదేవి తీర్పునిచ్చారు. తిరిగి పరీక్షలను నిర్వహించాలనీ, అక్రమాలకు తావులేకుండా చేయాలని యాజమాన్యానికి ఉత్తర్వులు జారీ చేశారు. పరీక్షల నిర్వహణలో అక్రమాలు జరిగాయంటూ రామగుండం పట్టణానికి చెందిన అభిలాష్ ఇతర అభ్యర్థులు హైకోర్టులో వేసిన పిటిసన్‌ను న్యాయమూర్తి ఆమోదించారు. గతంలో పరీక్షల ఫలితాల్ని వెల్లడించొద్దన్న స్టే ఉత్తర్వులను రద్దు చేయాలన్న ప్రభుత్వ వినతిని తోసిపుచ్చారు. సింగరేణి యాజమాన్యం 2022 సంవత్సరంలో నోటిఫికేషన్‌ను జారీ చేసింది.

దాదాపు 98,882 మంది అప్లికేష న్లు పెట్టుకున్నారు. 90,928 మంది హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకున్నారు. 2022, సెప్టెంబర్ 4 వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 187 సెంటర్స్‌లో పరీక్షలు నిర్వహించిన పరీక్షలకు 77,907 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తర్వాత మాస్ కాపీయింగ్ జరిగిందంటూ అభిలాష్ ఇతరులు హైకోర్టులో రిట్ దాఖలు చేశారు. కోర్తు తీర్పు వచ్చేంత వరకు ఫలితాల్ని వెల్లడించొద్దని గతంలోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. సుదీర్ఘ వాదనల తర్వాత నియర్ అసిస్టెంట్ పోస్టు భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తున్నట్టు తీర్పునిచ్చింది. తిరిగి నోటిఫికేషన్ ఇచ్చి ఈ సారి చట్ట నిబంధనలకు అనుగుణంగా సక్రమంగా ఎగ్జామ్‌ను నిర్వహించాలని సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించింది.



కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న కేంద్రం

- ప్రభుత్వ రంగాల ప్రయివేటీకరణ ఆపాలి
- కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి : ఐఎఫ్టీయూ జాతీయ అధ్యక్షులు డా.అపర్ణ, ప్రొ.హరగోపాల్

నవతెలంగాణ-ముషీరాబాద్

కేంద్ర ప్రభుత్వం అంబానీ, అదానీలాంటి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తోందని ఐఎఫ్టీయూ జాతీయ అధ్యక్షులు డాక్టర్ అపర్ణ, ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ, అమ్మకాలను ఆపాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, స్కీం వర్కర్‌లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్‌ను రద్దు చేయాలన్నారు. ఐఎఫ్‌టీయు ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ.. కార్మికుల జీవన ప్రమాణాలు తగ్గిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్లను అందంగా తీర్చిదిద్దే సఫాయి కార్మికుల జీవితాలు అందహీనంగా తయారవుతు న్నాయన్నారు. కాంట్రాక్టు, అవుట్సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని వాగ్దానం చేసిన కేసీఆర్.. అధికారంలోకి వచ్చిన తర్వాత మోసం చేశారన్నారు. పెట్టుబడిదారుల చెప్పుచేతల్లో పాలన సాగిస్తున్న దేశ పాలకులు.. కార్మికుల కనీస వేతనాలు పెంచడం లేదన్నారు. మహిళా కార్మికుల శక్తి సామర్థ్యాలు గొప్పవని, వారి సమస్యల పరిష్కారం కోసం, హక్కుల కోసం పెద్దఎత్తున పోరాడాలని పిలుపునిచ్చారు. కొట్లాడే కార్మిక సంఘాలు భారత కార్మిక సంఘాల సమాఖ్య జెండా కింద నిర్మాణం అవ్వాలని కోరారు. డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ.. దేశంలో ఆకలి అసమానతలు పెరుగుతున్నా యన్నారు. దేశ సంపద కొద్ది మంది పెట్టుబడిదారుల చేతుల్లో మాత్రమే పోగైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటాన్ని ఆదర్శంగా తీసుకొని మోడీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం సంఘటితంగా ఉద్యమాలు నిర్మించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ జాతీయ ఉపాధ్యక్షులు బి.ప్రదీప్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.భూమన్న, అరుణ, ఎస్.దాసు, సీహెచ్.భీమేశ్వర్, ఐ.కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఘటన
- మహిళపై లైంగికదాడి చేసి, హత్య చేసినట్టు అనుమానం?

నవతెలంగాణ-మియాపూర్

ఓ మహిళా దారుణ హత్యకు గురైన ఘటన రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. గుర్తు తెలియని దుండగులు మహిళపై లైంగికదాడి చేసి అనంతరం బండరాయితో మోది హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. గచ్చిబౌలి సీఐ జేమ్స్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. గౌలిదొడ్డి కేశవనగర్ వడ్డెర బస్తీకి చెందిన కాశమ్మ (38) కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ నెల 26వ తేదీ నుంచి ఆమె కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు అదే రోజు గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని ఓ నిర్మాణ సంస్థలో మహిళ మృతదేహం ఉన్నట్టు స్థానికులు గుర్తించారు. వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. క్లూస్ టీమ్‌లు ఆధారాలు సేకరించారు. గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన మహిళ మిస్సింగ్ కేసును విచారించి హత్యకు గురైన మహిళ కాశమ్మగా గుర్తించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కాగా, నిర్మాణంలో ఉన్న ఈ భవనంలోకి మృతురాలు వేస్ట్ మెటీరియల్ సేకరించేందుకు వెళ్లినట్టు సమాచారం. ఈ ఘటనలో మహిళపై లైంగికదాడి చేసి, హత్య చేశారా లేదా మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్టు తెలిపారు. పూర్తి వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని సీఐ చెప్పారు.

పేద విద్యార్థుల చేతికి స్టెతస్కోప్

'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్' సక్సెస్

- తొలి విడతలో 108 మందికి ఎంబీబీఎస్ సీట్లు
- అత్యధిక సీట్లు ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోనే..
- మరో 50 మంది విద్యార్థులకు అవకాశం
- ఈ ఏడాది ఓపీబీసీలో 181 మందికి శిక్షణ
- 153 మందికి నీట్ ర్యాంకులు
- సోషల్ వెల్ఫేర్, గిరిజన గురుకులాల నుంచి 185 మందికి ఎంబీబీఎస్ సీట్లు



నవతెలంగాణ - రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన 'ఆపరేషన్ బ్లూ క్రిస్టల్, ఆపరేషన్ ఎమరాల్డ్' ప్రతియేటా వందలాది పేద విద్యార్థులను డాక్టర్లుగా తయారు చేస్తోంది. పేద విద్యార్థులకు వైద్య విద్య నేడు అందని ద్రాక్షగా మారింది. ఈ తరుణంలో వారిని ప్రోత్సహించి, నైపుణ్యమైన శిక్షణ ఇచ్చి వైద్యులుగా తయారు చేయడంలో సంస్థ కీలక పాత్ర పోషిస్తోంది. ప్రతియేటా వందకు పైగా ఎంబీబీఎస్ సీట్లు సాధిస్తున్నారు. సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ సంస్థలు.. రాష్ట్రంలో కార్పొరేట్ ఇన్స్టిట్యూట్‌లను తలదన్నేలా ఫలితాలను సాధిస్తూ మొదటి స్థానంలో నిలుస్తున్నాయి. దాంతో తల్లిదండ్రులు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం గౌలిదొడ్డిలోని సోషల్ వెల్ఫేర్ గురుకులం ఆపరేషన్ బ్లూ క్రిస్టల్ (ఓపీబీసీ)లో నీట్ కోసం లాంగ్‌టర్మ్ శిక్షణ పొందిన విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారు. ఈ ఏడాది గౌలిదొడ్డి సోషల్ వెల్ఫేర్ గురుకులం నుంచి 181 మంది విద్యార్థులు నీట్ పరీక్షలు రాయగా.. ఇందులో 153 మంది ర్యాంకులు సాధించారు. మొదటి విడత ఎంబీబీఎస్ కౌన్సెలింగ్‌లో 103 మంది సీట్లు సాధించారు. నార్సింగ్‌లో ఓపీబీసీ నుంచి 42 మంది నీట్ పరీక్షలు రాయగా 4 ఎంబీబీఎస్ సీట్లు వచ్చాయి. రెగ్యులర్ గురుకులాల నుంచి మరో 50 మంది అర్హత పొందారు. గౌలిదొడ్డి గురుకులం నుంచి మరో 50 ఎంబీబీఎస్ సీట్లు వచ్చే అవకాశం ఉందని గురుకులం ఉపాధ్యాయులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఓపీఎం కింద ఈ ఏడాది 93 మంది గిరిజన విద్యార్థులకు నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ ఇవ్వగా, వారిలో 64 మంది ర్యాంకులు సాధించారు. మరో 8 మంది రెగ్యులర్ గురుకులాలకు చెందినవారు మొత్తంగా గిరిజన గురుకులాల నుంచి 72 మంది అర్హత సాధించారు. ఓపీబీసీ, ఓపీఎం నుంచి 185 మంది తొలి విడత కౌన్సెలింగ్‌లో సీట్లు పొందారు.

విద్యార్థుల పట్టుదల గొప్పది

డాక్టర్ కావాలన్న పేద విద్యార్థుల కలలను నిజం చేసేందుకు ప్రభుత్వం మాకు ఇచ్చిన అవకాశం గొప్పది. అవకాశాలను వినియోగించుకోవడంలో విద్యార్థుల పట్టుదల చాలా గొప్పది. అంతే స్థాయిలో వారి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఫ్యాకల్టీ నాణ్యమైన శిక్షణతో ఎంతో మంది పేద కుటుంబాల జీవన స్థితిగతుల్లో మార్పులు తెచ్చింది.

- శారద, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూట్ సొసైటీ, గౌలిదొడ్డి, ప్రిన్సిపాల్

అత్యధిక సీట్లు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లోనే..

ఓపీబీసీ, ఓపీఎంలో కోచింగ్ తీసుకుని నీట్ ఫలితాలు సాధించిన విద్యార్థులకు 80 శాతం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో సీట్లు వచ్చాయి. గాంధీ, ఉస్మానియాలో ఎక్కువ మంది విద్యార్థులు సీట్లు పొందారు. దాంతో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు సైతం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫలితాలు భవిష్యత్‌లో ఎక్కువ మంది విద్యార్థులను డాక్టర్లను చేయాలన్న పట్టుదలను ఉపాధ్యాయుల్లో పెంచింది.



పేద పిల్లలను డాక్టర్లుగా తయారు చేయడమే ఓపీబీసీ లక్ష్యం

ఎస్సీ, ఎస్టీ పిల్లలను డాక్టర్లుగా తయారు చేసి వారి కుటుంబాల్లో వెలుగులు నింపడమే లక్ష్యంగా ఓపీబీసీని ఏర్పాటు చేశాం. లక్ష్య సాధన కోసం ఫ్యాకల్టీ నిర్విరామ కృషి చేస్తోంది. ప్రతి నిత్యం విద్యార్థుల పర్యవేక్షణ, పోటీ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా వారికి సలహాలు, సూచనలు ఇవ్వడంలో అధికారులు, ఫ్యాకల్టీ ప్రత్యేక చొరవతో మంచి ఫలితాలు ఇస్తోంది. టీచింగ్, నాన్ టీచింగ్ ఫ్యాకల్టీ కృషి అభినందనీయం.

- వెంకట రమణ, ఓపీబీసీ అకాడమి కో-ఆర్డినేటర్

లెసన్ ప్లానింగ్.. మంచి ఫలితాలు

విద్యార్థులకు సబ్జెక్ట్ సులభతరం కావడానికి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా లెసన్ ప్లాన్ తయారు చేసి విద్యార్థులకు బోధిస్తున్నారు. ప్రణాళికాబద్ధంగా లెసన్ ప్లాన్ తయారు చేయడం వైస్ ప్రిన్సిపాల్ దేవి, అసోసియేట్ లెక్చరర్స్ మల్లేష్ చారి, రమేష్, మల్లేష్.. విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించడం ఓపీబీఎస్ వెనక ఉన్న సిక్రెట్‌తో నీట్‌లో మంచి ఫలితాలు సాధించారు.

దళితుల సమస్యలపై కోటి సంతకాల సేకరణ

- నవంబర్ వరకు రాష్ట్ర సదస్సులు
- డిసెంబర్ 4న 'చలో పార్లమెంట్' : మల్లేపల్లి లక్ష్మయ్య, బి. వెంకట్ వెల్లడి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

దళితుల సమస్యలను జాతీయ ఎజెండా చేయడంలో భాగంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు జాతీయ దళిత కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మల్లేపల్లి లక్ష్మయ్య, బి వెంకట్ తెలిపారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌లో జరిగిన జాతీయ దళిత సదస్సు జయప్రదంగా ముగిసిందని వారు చెప్పారు. దేశ వ్యాప్తంగా 26 రాష్ట్రాల నుంచి 85 సంఘాలు, 332 మంది ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకర్లతో మాట్లాడారు. భూమి, ఉత్పత్తి, సంపద, బడ్జెట్, ప్రకృతి వనరుల్లో దళితులకు సామాజిక న్యాయం జరిగేలా 'సమగ్రమైన డిక్లరేషన్' రూపొందించినట్టు తెలిపారు. అది అన్ని రాజకీయ పార్టీలకు మార్గదర్శిలా, ఓ దిక్సూచిలా ఉండే విధంగా సదస్సు తీర్మానం చేసిందన్నారు. దళితులకు భూమి, విద్య, ఉపాధి, వైద్యం, రిజర్వేషన్లు, అత్యాచార సంఘటనలు వంటి కీలక అంశాలపై చర్చించినట్టు వారు వివరించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు అభద్రతలో జీవిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా రాష్ట్రాల్లో దళితులపై 80శాతం దాడులు పెరిగాయని విమర్శించారు. పాఠ్యాంశాల నుంచి అంబేద్కర్, భగత్‌సింగ్ వంటి మహనీయుల చరిత్రను తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాంటి చరిత్ర లేని సావర్కర్, గాడ్సే జీవిత అంశాలకు సంబంధించిన విషయాలను పాఠ్యాంశాలుగా చేర్చారని తెలిపారు. దేశవ్యాప్తంగా 20 శాతానికి పైగా ఉన్న దళితులకు జనాభా దామాషా ప్రకారం బడ్జెట్లో 20 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టాన్ని దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. పదేండ్ల బీజేపీ పాలనలో దళితులకు ఇసుమంత ప్రయోజనం కూడా జరగలేదని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా కల్పించిన హక్కులన్నిటినీ అది కాలరాస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో దళితులందర్నీ ఐక్యం చేసి రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను, ప్రభుత్వరంగ సంస్థలను కాపాడుకునేందుకు తద్వారా సామాజిక న్యాయాన్ని సాధించడం కోసం కృషి కొనసాగిస్తామన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని పూర్తిగా రద్దు చేసేందుకు ఆర్ఎస్ఎస్ కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఒకవైపు ఆదాని, అంబానీ ఆస్తులను, మత ఉద్రిక్తలను కుల విద్వేషాలను పెంచుతూ పేదలను మరింత పేదలుగా మార్చుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయడం లేదని చెప్పారు. నవంబర్ నాటికి అన్ని రాష్ట్రాల్లో దళిత సదస్సులు నిర్వహించాలనీ, డిసెంబర్ 4న చలో పార్లమెంటు నిర్వహించాలని పిలుపునిచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను ఓడించేందుకు ద్వారా దేశంలో దళితులు పేదలకు అండగా నిలబడాలని వారు కోరారు. ఈ మీడియా సమావేశంలో బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కే. కాంతయ్య, బాలమల్లేష్, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు జాన్ వెస్లీ టీ స్కైలాబ్ బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఆర్ వెంకట్రాములు డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ తదితరులు పాల్గొన్నారు

షోకాజ్ నోటీసులకు బెదిరేది లేదు

- సమస్యలు పరిష్కరించి సమ్మెను విరమింప చేయాలి: టీయుఎంహెచ్ఇయూ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సమ్మె చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎంలకు షోకాజ్ నోటీసులిచ్చినా బెదిరేది లేదనీ, రెగ్యులర్ చేసేంత వరకు సమ్మె ఆపేది లేదని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (టీయుఎంహెచ్ఇయూ - సీఐటీయూ అనుబంధం) స్పష్టం చేసింది. ఈ మేరకు మంగళవారం యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.డి ఫసియుద్దీన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.యాద నాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. బెదిరించి సమ్మెను విరమింప చేయాలనుకోవడం ప్రభుత్వ అవివేకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. షోకాజ్ నోటీసులు వెంటనే వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం బేషజాలకు పోకుండ పునరాలోచించి చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం నుంచి 33 జిల్లాల్లోని సమ్మె శిబిరాల్లో వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని కాంట్రాక్ట్ ఏఎన్ఎంలకు పిలుపునిచ్చారు.

వైద్యారోగ్యశాఖలో వివిధ రకాల పేర్లతో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె 15వ రోజుకు చేరింది. ఈ మధ్యకాలంలో ప్రభుత్వం వారితో మూడుసార్లు చర్చలు జరిపింది. అయితే వారి ప్రధాన డిమాండ్ రెగ్యులరైజేషన్‌పై ప్రభుత్వ వైఖరి సరిగా లేదనీ, ఏండ్ల తరబడి పని చేస్తున్న ఏఎన్ఎంలను రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని యూనియన్ నాయకులు విమర్శించారు. చట్టబద్ధంగా 15 రోజుల ముందు ప్రభుత్వానికి సమ్మె నోటీసు ఇచ్చినట్టు తెలిపారు. ప్రభుత్వం స్పందించక పోవడంతో సమ్మెకు వెళ్లిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ సమ్మెకు పూర్తి బాధ్యత ప్రభుత్వం వహించాలని వారు హెచ్చరించారు.

విడుదల చేయాలి

హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద నిరసన తెలుపుతున్న 121 మంది ఏఎన్ఎంలను అరెస్టు చేయడాన్ని టీయుఎంహెచ్ఇయూ ఖండించింది. ఈ మేరకు యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు భూపాల్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండీ ఫసియుద్దీన్, కె.యాదానాయక్ ఒక ప్రకటన విడుదల చేశారు. అరెస్ట్ చేసిన వారందరిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



నో పేమెంట్- నో వర్క్

- పెండింగ్ బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల డిమాండ్
- వాహనాలకు వాయిదాలు, ఇంటి అద్దెలు కట్టలేకపోతున్నాం..
- తమ భార్యల పుస్తెలను సైతం తాకట్టుపెట్టాం : జీహెచ్ఎంసీ ముందు కాంట్రాక్టర్ల ధర్నా

నవతెలంగాణ- సిటీబ్యూరో

"పెండింగ్ బిల్లులు చెల్లిస్తేనే.. పనులు చేస్తాం.. రూ.1000కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలి.. వాహనాలకు బ్యాంకు వాయిదాలు కట్టే పరిస్థితి లేదు.. మా భార్యల పుస్తెలను సైతం తాకట్టుపెట్టాల్సిన దుస్థితిలో ఉన్నాం" అంటూ జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్లు మరోసారి ఆందోళన చేపట్టారు. మంగళవారం ఉదయం కాంట్రాక్టర్లు కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ ఎంట్రెన్స్ వైపున్న కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫీసు వద్ద బైటాయించారు. నో పేమెంట్.. నో వర్క్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తొలుత కాంట్రాక్టర్లకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా, కాంట్రాక్టర్లు ఆందోళన కొనసాగించారు. దాదాపు గంటన్నర సేపు కాంట్రాక్టర్లు ధర్నా చేశారు. ప్రధాన కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. కాంట్రాక్టర్లను అరెస్టు చేస్తున్న క్రమంలో తీవ్ర వాగ్వాదం జరిగింది. దీంతో ఉద్రిక్తత నెలకొంది. కాంట్రాక్టర్లను అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు.

ఈ సందర్భంగా పలువురు కాంట్రాక్టర్లు మాట్లాడుతూ.. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న తమనెందుకు అడ్డుకుంటున్నారంటూ ప్రశ్నించారు. జీహెచ్ఎంసీ తమ బిల్లులన్నీ చెల్లించే వరకు ఎలాంటి పనులూ చేపట్టబోమని తేల్చి చెప్పారు. జీహెచ్ఎంసీ పరిధిలోని 30సర్కిళ్లు, ఆరు జోన్ల పరిధిలో దాదాపు ఐదు వేలమంది చిన్నాపెద్దా కాంట్రాక్టర్లున్నారని తెలిపారు. సీసీ, బీటీ రోడ్ల పనులు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులతోపాటు, నాలా మరమ్మతులు, అభివృద్ధి పనులు చేస్తున్నామని చెప్పారు. దీనిపై ఆధారపడి ఐదు వేల మందికిపై కార్మికులు కుటుంబసభ్యులతో కలిపి దాదాపు రెండు లక్షల మంది జీవిస్తున్నారన్నారు. ఏడాదికాలంగా జీహెచ్ఎంసీ అధికారులు బిల్లులు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని తెలిపారు. తమ భార్యల పుస్తెల తాళ్లను సైతం తాకట్టుపెట్టామని, వాహనాల వాయిదాలు, ఇంటి అద్దెలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గత మే మాసం చివరికల్లా సుమారు రూ.800 కోట్లవరకున్న బిల్లులు జులై చివరికల్లా వెయ్యి కోట్లు దాటాయని కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నేతలు హనుమంత్ సాగర్, సురేందర్ సింగ్ వెల్లడించారు. రూ.800 కోట్ల బకాయిలున్నపుడే కనీసం సగం బిల్లులైనా చెల్లించాలని తాము కోరినా అధికారులు పట్టించుకోలేదన్నారు.

బడాబాబులకు సంబంధించిన ఏజెన్సీలున్న సీఆర్ఎంపీకి ఒక్క నెల బిల్లు కూడా ఆపకుండా చెల్లిస్తున్న అధికారులు.. తమ బిల్లులు చెల్లించేందుకు ఎన్నో ఆంక్షలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావాలనే బిల్లులు చెల్లించడం లేదన్నారు. కాంట్రాక్టర్లలో నూటికి తొంభై మంది మధ్య తరగతికి చెందిన వారే ఉన్నారని, అప్పులు తీసుకొచ్చి, కుటుంబ సభ్యుల ఆభరణాలు కుదవ పెట్టి కార్మికులకు కూలి డబ్బులు చెల్లిస్తున్నారని చెప్పారు. బిల్లుల చెల్లింపులో అధికారుల అలసత్వానికి గతంలో కొందరు కాంట్రాక్టర్లు ఆత్మహత్య కూడా చేసుకున్నట్టు వెల్లడించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

గురుకుల విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- నల్లగొండ జిల్లా కేంద్రంలో ఘటన
- పరిస్థితి విషమం.. హైదరాబాద్‌కు తరలింపు

నవతెలంగాణ- నల్లగొండ ప్రాంతీయ ప్రతినిధి

గురుకుల విద్యార్థిని హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యాయత్నం చేసింది. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కేంద్రంలో మంగళవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. గంధవారిగూడెం పరిధిలోని ఎస్సీ గురుకుల ఇంటర్మీడియట్ కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని హాస్టల్ భవనం పైనుంచి దూకింది. దాంతో తీవ్రంగా గాయపడింది. కాలు విరగడంతోపాటు తలకు గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉంది. దాంతో హాస్టల్ సిబ్బంది వెంటనే విద్యార్థినిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ బాలిక చికిత్స పొందుతోంది. ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బంగారు పతకం సాధించిన డీసీపీ శ్రీబాల

- అభినందించిన డీజీపీ



నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

అంతర్జాతీయ పోలీస్ క్రీడల్లో బంగారు పతకాలు సాధించిన రాచకొండ రోడ్ సేఫ్టీ డీసీపీ శ్రీబాలను రాష్ట్ర డీజీపీ అంజనీ కుమార్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. మంగళవారం డీజీపీ కార్యాలయంలో శ్రీబాల అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంజనీ కుమార్ మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడడంలో నిరంతరం కృషి చేసే పోలీసు అధికారిణి శ్రీబాల కెనడాలో జరిగిన అంతర్జాతీయ పోలీసు ఫైర్ క్రీడాల్లో సత్తా చాటడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. రోజువారి విధుల్లోనే కాక.. సాంస్కృతిక, క్రీడా విభాగాల్లోనూ ఏవిధంగా రాణించవొచ్చు శ్రీబాల నిరూపించారని ఆయన కొనియాడారు. ఈ పోటీల్లో 70దేశాలు పాల్గొన్నాయని.. మొత్తం 8వేల మంది క్రీడాకారులు వివిధ పోటీల్లో పాల్గొన్నారని డీజీపీ గుర్తుచేశారు. అందులో బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో బంగారు పతకాన్ని సాధించిన శ్రీబాల, బ్యాడ్మింటన్ డబుల్స్‌లో రెండు రజతలు, టెబుల్ టెన్నిస్‌లో మరో రెండు కాంస్య పతకాలను కైవసం చేసుకొని రాష్ట్ర పోలీస్ కీర్తిని ప్రపంచంలో చాటారని ఆయన అభినం దించారు. డీసీపీ శ్రీబాల మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకాన్ని సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. పోలీసు విధుల్లోనే కాక.. క్రీడలో సైతం మహిళా పోలీసులు ఆసక్తి కనబర్చాలని, తద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండగల్గుతామని ఆమె చెప్పారు.

పాఠశాలల్లో సర్వీసు పర్సన్లను నియమిస్తాం

ఎస్జీటీయూకు విద్యాశాఖ సంచాలకుల హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రాథమిక పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీల సమస్యలను పరిష్కరించాలని ఎస్జీటీయూ రాష్ట్ర అధ్యక్షులు కరివేద మహిపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం కోరారు. ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమం బడ్జెట్‌ను ఉన్నతి శిక్షణతో సమానంగా ఇవ్వాలని సూచించారు. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను మంగళవారం హైదరాబాద్‌లో వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ ఏడాదిలోనే ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టాలని కోరారు. పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేయాలని తెలిపారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతం, ఉపాధ్యాయుల సర్దుబాటును కేవలం ప్రాథమిక పాఠశాలల్లోనే చేయాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక విషయంలో ఎస్జీటీలను తీసుకోవాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో సర్వీసు పర్సన్లను నెలలోపు నియమిస్తామంటూ ఆమె హామీ ఇచ్చారని తెలిపారు. ఎఫ్ఎల్ఎన్ బడ్జెట్‌కు సంబంధించి విద్యాశాఖ కార్యదర్శితో సంప్రదిస్తామంటూ ఆమె వివరించారని పేర్కొన్నారు. సీఎం ఆమోదం పొందగానే పీఎస్‌హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేస్తామన్నారని తెలిపారు.

అమెరికాలో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ ప్రోగ్రామ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత్‌లో వైద్య విద్యను ప్రారంభించి అమెరికాలో పూర్తి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్టు జేవియర్ విశ్వవిద్యాలయం ప్రకటించింది. విద్యార్థులు మొదటి రెండేండ్లు ప్రీ-మెడ్‌ను బెలగావిలోని కెఎల్‌వి ప్రాంగణంలో లేదా హైదరాబాద్‌లోని హోమియోపతి మెడికల్ కాలేజీలో పూర్తి చేయాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రీ-మెడ్‌ను పూర్తి చేశాక రెండేండ్లు జేవియర్ వర్సిటీ అరుబాలో ప్రి క్లినికల్ సైన్సెస్ (బేసిక్ సైన్సెస్) అధ్యయనాన్ని పూర్తి చేస్తారని పేర్కొంది. చివరి రెండేండ్లు హ్యాండ్స్ ఆన్ క్లినికల్ శిక్షణను అమెరికా, కెనడాలోని ఏసీజీఎంఈ ఆమోదించిన ఆస్పత్రుల్లో డాక్టర్ ఆఫ్ మెడిసిన్ ప్రోగ్రామ్‌ను పూర్తి చేస్తారని వివరించింది. అమెరికా, అరుబాలో ప్రవేశించడానికి సంబంధిత వీసా ప్రక్రియపై జేవియర్ ఇమ్మిగ్రేషన్ సిబ్బంది విద్యార్థులకు కౌన్సిలింగ్ ఇస్తారని తెలిపింది. జేవియర్ విద్యార్థులు హెచ్1, జే1 వీసీ ప్రోగ్రామ్‌కు అర్హులని స్పష్టం చేసింది. ఇంటర్ లేదా 12వ తరగతి పూర్తి చేసి నీట్ స్కోర్ ఉన్నా లేకున్నా ఈ కోర్సుకు దరఖాస్తు చేసుకోవాలని కోరింది.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడిగా శ్రీకాంత్ నియామకం

నవతెలంగాణ-హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడిగా విష్ణుదాస్ శ్రీకాంత్ నియమితులయ్యారు. ఆయన 'ఏబీ6 న్యూస్' వార్తా చానల్‌కు చీఫ్ ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. గతంలో ఉదయం, సాక్షి, 10టీవీ వంటి పలు మీడియా సంస్థల్లో పనిచేశారు. ఏబీ6 న్యూస్ వేదికగా బ్రాహ్మణ సమాజానికి చేసిన సేవలకు గుర్తింపుగా శ్రీకాంత్‌ను సంక్షేమ పరిషత్ సభ్యుడిగా నియమిస్తున్నట్టు అధ్యక్షులు కేవీ రమణాచారి తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం సదరు ఉత్తర్వుల ప్రతిని పరిషత్ ప్రధాన కార్యాలయంలో రమణాచారి ద్వారా శ్రీకాంత్ స్వీకరించారు.

అర్చకుల వేతనం పెంపు

ధూప దీప నైవేద్య పథకం క్రింద అర్చకుల గౌరవ వేతనాన్ని రూ. 6 వేల నుంచి రూ.10 వేలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంపాదకీయం

ఎగుమతులపై ఆంక్షలు!

మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పంటల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తోంది. వాతావరణంలో వచ్చిన మార్పులతో పంటల దిగుబడి తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడి ధరలు పెరిగే ప్రమాదం ఉందని చెబుతూ ఆహార పంటల ఎగుమతులను ఒక్కొక్కటీ నిషేధించుకుంటూ వస్తోంది.

> ఒకప్పుడు ఉల్లి ధరలను ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చిన గతం బీజేపీకి గుర్తుకొచ్చిందో ఏమో... ఎప్పుడూ లేనిది గ్యాస్ ధరలు తగ్గించడం, ఎగుమతులపై నిషేధం పెట్టడం వంటి చర్యలకు పూనుకుంటున్నది. ఇదంతా త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తదుపరి జరిగే లోక్‌సభ ఎన్నికల నాటికి ధరలను తగ్గించామని జనం ముందు చెప్పుకుని బయటపడే తాపత్రయమే కనిపిస్తోంది. ఎగుమతులు నిషేధిస్తే రైతులేమైపోతారోనన్న ధ్యాస మాత్రం లేనేలేదు.

ఇప్పటికే కార్పొరేట్ వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రాబోవు కాలంలో చిన్న రైతులు వ్యవసాయం నుంచి దూరమయ్యే ప్రమాదం పొంచి ఉంది. తాజాగా ఎగుమతుల నిషేధం కోసం పన్నుల పేరిట పలు ఆంక్షలు పెడుతూ రైతుల నోట్లో మన్ను కొడుతోంది. ఈ ఏడాది గోధుమ పిండి, మైదా, గోధుమ రవ్వ ఎగుమతులను కేంద్రం నిషేధించింది. తరువాత సెప్టెంబరు తొమ్మిది నుంచి అమల్లోకి వచ్చే విధంగా బాస్మతేతర బియ్యం ఎగుమతులపై ఇరవైశాతం ఎగుమతి పన్ను విధించటంతో పాటు, కొద్దిగా ముక్కలైన బియ్యం ఎగుమతులపై పూర్తిగా బ్యాన్ పెట్టేసింది. అంతకు ముందే గోధుమల ఎగుమతులపైనా నిషేధం పెట్టింది. తాజాగా ఎగుమతి నిషేధాల జాబితాలో పంచదార వంతు వచ్చింది. దీనిపై ఒక జాతీయ మీడియాలో వార్తలు, అనేకమంది ఆర్థికవేత్తల విశ్లేషణలు వచ్చాయి. ఇప్పటివరకు దానిని ఖండిస్తూ కేంద్రప్రభుత్వం ఎలాంటి ప్రకటనా చేయకపోవడం గమనార్హం.



వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులపై ఉన్న ఆంక్షలన్నింటినీ సడలిస్తామని, ఎలాంటి పరిమితులు విధించబోమంటూ 2018లో కేంద్రం ఎగుమతి దిగుమతి విధానంలో పేర్కొన్నది. నాడు చెప్పిన మాటలను అటకెక్కించి నేడు ఎగుమతులపై బ్యాన్ పెట్టడం వెనుక రాజకీయ, ఆర్థిక ప్రయోజనాలు దాగున్నాయని జరుగుతున్న పరిణామాలను చూస్తే స్పష్టమవుతోంది. దీంతో కేంద్రం నుంచి ఎప్పుడేం వినాల్సి వస్తుందోనని ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎన్నికలలో లబ్ది కోసం ధరల అంశాన్ని ముందుకుతెచ్చి ఎగుమతులను లేకుండా చేస్తే మన రైతుల పరిస్థితేంటి? ఈ నిర్ణయాల వల్ల రైతులు పండించిన పంటలకు మద్దతు ధరలు లభించడం కష్టమవుతుంది. ధరలు పెరగడానికి ప్రభుత్వ విధానాలే అయితే... దానికి మూల్యం చెల్లించాలన్నమాట. ఇదేమి న్యాయం? రైతుల నడ్డి విరగ్గొట్టి, ఎగుమతులపై బ్యాన్ పెట్టేస్తే ధరలు అదుపులో ఉంటాయని ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వగలదా?

గడిచిన తొమ్మిదేండ్ల మోడీ పాలనలో ఒకటి స్పష్టం. ఈ ప్రభుత్వానికి పారిశ్రామిక, వాణిజ్యవేత్తల మీద ఉన్న శ్రద్ధ, ప్రేమ ఇతర ఏ వర్గాల మీద లేదు. పెద్ద పెద్ద వ్యాపారులకు ఇచ్చిన రాయితీలు, రద్దు చేసిన రుణాలు రైతులకు లేవు. ఇప్పటి వరకు పంచదార ఎగుమతుల మీద ఆంక్షలు, పరిమితులు మాత్రమే విధించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పుడు నిషేధం విధిస్తే ఆ రైతులు ఎక్కడికి పోవాలి. సెప్టెంబరు 30వ తేదీ వరకు 61లక్షల టన్నుల పంచదార ఎగుమతికి కేంద్ర ప్రభుత్వం మిల్లులకు అనుమతి ఇచ్చింది. అయితే, అక్టోబరు ఒకటవ తేదీ నుంచి చెరకు ఆర్థిక సంవత్సరం ప్రారంభమవుతున్న క్రమంలో పండించిన పంటను ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసేలా ఆదేశాలు జారీ చేస్తుందా? అన్నది ప్రశ్న.

ప్రపంచ వాణిజ్య సంస్థ అనుమతిస్తే భారతదేశం ప్రపంచదేశాలకు ఆహార ధాన్యాలను సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉందని మోడీ గొప్పలు చెప్పారు. ఇప్పుడేమో ఎగుమతులపై నిషేధాలు విధిస్తున్నారు. అంతెందుకు ఇండోనేషియా, మొరాకో, టర్కీ, థాయిలాండ్, వియత్నాం వంటి దేశాలకు 20లక్షల టన్నుల నుంచి కోటి టన్నుల గోధుమలను పంపేలా ఏర్పాట్లు చేస్తామని కేంద్రం ప్రకటించిన మరుసటి రోజే గోధుమల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. ఉల్లి ధరల పెరుగుదల సూచన కనిపించటంతో వాటి ఎగుమతులపై నలభై శాతం పన్ను ప్రకటించింది. ధరలు పెరిగినప్పుడు వాటిని కొనకుండా..వాడకుండా ఉంటే ధరలు పెరగబోవని చెప్పిన నేతలు వీరు..! ఒకప్పుడు ఉల్లి ధరలను ఎన్నికల ప్రచారాస్త్రంగా మార్చిన గతం బీజేపీకి గుర్తుకొచ్చిందో ఏమో... ఎప్పుడూ లేనిది గ్యాస్ ధరలు తగ్గించడం, ఎగుమతులపై నిషేధం పెట్టడం వంటి చర్యలకు పూనుకుంటున్నది. ఇదంతా త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, తదుపరి జరిగే లోక్‌సభ ఎన్నికల నాటికి ధరలను తగ్గించామని జనం ముందు చెప్పుకుని బయటపడే తాపత్రయమే కనిపిస్తోంది. ఎగుమతులు నిషేధిస్తే రైతులేమైపోతారోనన్న ధ్యాస మాత్రం లేనేలేదు. ఎగుమతుల రద్దును అవకాశంగా తీసుకొని కృత్రిమ కొరతను సృష్టించి ధరలను పెంచిన అనుభవాలు అనేకం. ఇప్పుడు కూడా ఏరుదాటాక తెప్ప తగలెయ్యరనే గ్యారంటీ ఏమీ లేదు! అయినా వారికేం... అవస్థలు పడేది పేద, మధ్యతరగతి జనమే కదా...


'బ్రిక్స్' సదస్సులో ధనికదేశాలకు చైనా అధ్యక్షుని హెచ్చరిక

ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు దక్షిణాఫ్రికా నగరమైన జోహన్నెస్‌బర్గ్‌లో "బ్రిక్స్ (బిఆర్ఐసిఎస్)" కూటమి (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా) పదిహేనవ శిఖరాగ్ర సమావేశం జయప్రదంగా ముగిసింది. అర్జెంటీనా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌ను ఈ కూటమిలో చేరాల్సిందిగా ఆహ్వానం పలికారు. వాటికి అంగీకారమైతే 2024 జనవరి ఒకటవ తేదీ నుంచి పూర్తి స్థాయి సభ్యులుగా పరిగణిస్తారు. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో 2006లో జరిగిన ఒక సమావేశంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలతో ఏర్పడిన ఆర్థిక కూటమిని బ్రిక్ అని పిలిచారు. తరువాత 2010లో దక్షిణాఫ్రికా చేరటంతో అది బ్రిక్స్‌గా మారింది. ఇప్పుడు విస్తరణ బాటలో ఉన్నందున బ్రిక్స్ ప్లస్ అంటారా లేక మరేదైనా పేరు పెడతారా అన్నది చూడాల్సి ఉంది. బ్రిక్ లేదా బ్రిక్స్ కూటమి అని పేరు పెట్టటానికి గోల్డ్‌మన్ శాచస్ కంపెనీ ఆర్థికవేత్త జిమ్ ఓ నెయిల్ చేసిన వర్ణన ప్రేరణ అని చెబుతారు. ఇలాంటి కూటమి ఏర్పడితే అది 2050 నాటికి ప్రపంచ ఆర్థిక రంగంలో మిగతావాటిని వెనక్కు నెడుతుందని 2001లో జోస్యం చెప్పాడు. బ్రిక్స్ విస్తరణ, దాని తీరుతెన్నులను చూస్తే అంతకంటే ముందే దాని ప్రభావం వెల్లడయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిదానమే ప్రదానం అన్నట్లుగా ముందుకు పోతున్న ఈ కూటమి నేడు పశ్చిమ దేశాల పెత్తనం, తంటాల మారితనాన్ని ఎదుర్కొనే దిశగా ఉంది. నూతన ప్రపంచ ఆర్థిక, రాజకీయ వ్యవస్థకోసం చూస్తున్న ఈ కూటమి నడక నల్లేరు మీద బండిలా ఎలాంటి కుదుపులు లేకుండా సాగుతుందని చెప్పలేం. ఈ సమావేశాల్లో లూలా డిసిల్వా(బ్రెజిల్),

> పారిశ్రామిక, సరఫరా గొలుసు నుంచి విడగొట్టుకోవాలని, విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత షీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు.

సెర్గీలావరోవ్ (రష్యా విదేశాంగ మంత్రి), నరేంద్రమోడీ (ఇండియా), షీ జిన్‌పింగ్ (చైనా), సిరిల్ రామఫోసా (దక్షిణాఫ్రికా) పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మీద అంతర్జాతీయ కోర్టు వారంటు జారీ చేసింది. ఆ కోర్టును రష్యా అంగీకరించలేదు. బ్రిక్స్‌కు ఆతిథ్యం ఇస్తున్న దక్షిణాఫ్రికా కోర్టు ఒప్పందంలో సభ్యురాలిగా ఉన్నందున తలెత్తే పరిస్థితి కారణంగా పుతిన్ హాజరు కాలేదు.

పారిశ్రామిక, సరఫరా గొలుసు నుంచి విడగొట్టుకోవాలని, విచ్ఛిన్నం, ఆర్థిక బలవంతం చేయాలని చూస్తున్న శక్తుల చర్యలను అడ్డుకోవాలని, చైనా అధినేత షీ జిన్‌పింగ్ తాజా సమావేశంలో పిలుపునిచ్చారు. ఇదే తరుణంలో డిజిటల్ ఎకానమీ, హరిత వృద్ధి, సరఫరా వ్యవస్థల వంటి రంగాలలో ఆచరణాత్మక సహకారం అందించుకోవాలని కోరారు. అంతర్జాతీయ రంగంలో పెద్ద గొంతులేసుకొని, కండల ప్రదర్శనలతో తమ స్వంత నిబంధనలను రుద్దాలని చూస్తున్నవారి తీరు ఆమోదం కాదని, ఐరాస నిబంధనలకు కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. ఒక దేశం- ఒక కూటమి పెత్తనం లేకుండా ముందుకు వస్తున్న బహుముఖ ప్రపంచం, సాంప్రదాయక విలువలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు నూతన ఉదారవాద విధానాలు ముప్పు తెస్తున్నట్లు వీడియో ద్వారా పుతిన్ చేసిన ప్రసంగంలో పేర్కొన్నాడు. అమెరికా పేరు పెట్టకుండా దాని గురించే మాట్లాడినట్లు విశ్లేషకులు టీకా తాత్పర్యం చెప్పారు. పశ్చిమ దేశాలు బ్రిక్స్ కూటమి తమకు ముప్పుగానూ, జి-7కు పోటీగా దాన్ని మార్చేందుకు చైనా చూస్తున్నదనే అనుమానాలు పశ్చిమ దేశాల్లో రోజు రోజుకూ పెరుగుతున్నాయి. విస్తరణలో భాగంగా చేరుతున్న దేశాలు కూడా పశ్చిమ దేశాల బాధితులే కావటం గమనించాల్సిన అంశం. ప్రపంచంలో ఏ దేశమూ గతంలో మాదిరి ప్రచ్ఛన్న యుద్ధవాతావరణలో నడవాలని కోరుకోవటం లేదు.



ఎం. కోటేశ్వరరావు
8331013288

బ్రిక్స్ దేశాల్లోని జనాభా 2022 లెక్కల ప్రకారం 324కోట్ల మంది, అంటే ప్రపంచంలో నలభైశాతం మంది. భారత్, చైనాల్లోనే 282 కోట్ల మంది ఉండగా మిగిలిన మూడింటిలో 42 కోట్ల మంది ఉన్నారు. ప్రపంచ సాధారణ జీడీపీలో ఈ కూటమి వాటా 2000లో 11.74శాతం కాగా పదేండ్లలో 17.95, 2022 నాటికి 26శాతానికి పెరిగింది. అదే పీపీపీ పద్ధతిలో చూస్తే 31.5శాతానికి పెరిగి జి7 దేశాల 30శాతాన్ని దాటింది.2028 నాటికే బ్రిక్స్ వాటా 50శాతం దాటనుందని అంచనా. ఐఎంఎఫ్ సమాచారం ప్రకారం 2000 సంవత్సరం నుంచి 2022కు చూస్తే జనాభా వాటా 43.92 నుంచి 41.42శాతానికి తగ్గింది. ప్రపంచ ఎగుమతుల్లో వాటా 8.2 నుంచి 18, ప్రపంచ వాణిజ్యంలో 7.51 నుంచి 18శాతానికి, విదేశీ మారకద్రవ్య నిల్వ 281.2 నుంచి 4,581 బిలియన్ డాలర్లకు పెరిగింది. అంక్టాడ్ 2023 గణాంకాల ప్రకారం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) 2001-2021 కాలంలో 84 నుంచి 355 బి.డాలర్లకు పెరిగాయి. ఈ మొత్తంలో చైనా వాటా సగానికి పైగా ఉంది. ఒక్క జనాభాలో భారత్ ప్రథమ స్థానంలో ఉండటం తప్ప మిగిలిన అన్ని అంశాలలో చైనా ఎంతో ఎత్తున ఉంది.



జోహన్నెస్‌బర్గ్ శిఖరాగ్ర సభలో మొత్తంగా భిన్న నేపథ్యాల పూర్వరంగంలో దేశాల మధ్య వ్యూహాత్మక, ఆర్థిక, ప్రపంచ సమస్యలపై ఏకీభావం సాధించేందుకు సంప్రదింపులకు ప్రాధాన్యత ఇవ్వాలన్న సంకల్పం వెల్లడైంది. సమీకృత అభివృద్ధి, ప్రపంచ సవాళ్లు, దేశాల మధ్య సంబంధాలను పటిష్ట పరుచుకోవాలన్న వాంఛను నేతలు వెలిబుచ్చారు. సభ జరిగింది ఆఫ్రికా ఖండంలో గనుక సహజంగానే దాని ఇతివృత్తానికి కేంద్ర స్థానం లభించింది. ప్రపంచ పేద దేశాలు ప్రత్యేకించి ఆఫ్రికా దేశాలతో సంబంధాలు, సహకారం గురించి నేతలందరూ మాట్లాడారు. ఈ సభకు పుతిన్ రాకపోవటం గురించి పశ్చిమ దేశాల్లో ఇంకేముంది బ్రిక్స్‌లో విభేదాలు, రష్యా పలుకుబడికి గండిపడింది అన్నట్లుగా విశ్లేషణలను వండివార్చారు. ముందే చెప్పుకున్నట్లు ఆతిథ్య దేశాన్ని ఇరకాటంలో పెట్టకూడదన్న పరిణితి పుతిన్, ఇతర దేశాధినేతల్లో వెల్లడైంది. స్వయంగా హాజరు బదులు వీడియో కాన్ఫరెన్సు ద్వారా పాల్గొని నిర్ణయాల్లో భాగస్వామి అయ్యారు. బ్రిక్స్‌ను విస్తరించాలన్న ఆలోచన కొత్తగా వచ్చింది కాదు. 2013లో దక్షిణాఫ్రికా అధ్యక్ష స్థానంలో ఉన్నప్పుడు ఆఫ్రికా యూనియన్‌కు స్థానం కల్పించాలని కోరింది. తరువాత 2017లో బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్‌తో పాటు ఇతర దేశాలు) అన్న భావనను చైనా ముందుకు తెచ్చింది. తమకు సభ్యత్వం ఇవ్వాలని ఇరాన్, అర్జెంటీనా దరఖాస్తు చేసుకోవటంతో 2022లో బ్రిక్స్ సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో మొత్తం నలభై దేశాలు ఆసక్తి వెల్లడించటంతో పాటు 23 లాంఛనంగా దరఖాస్తు చేశాయి. వాటిని పరిశీలించి పైన పేర్కొన్న ఆరు దేశాలకు వచ్చే ఏడాది జనవరి ఒకటి నుంచి పూర్తి స్థాయి సభ్యత్వం ఇచ్చేందుకు నిర్ణయించారు.

ప్రపంచ జనాభాలో ఈ కూటమి దేశాల్లో 46.5శాతానికి, జీడీపీ 30శాతానికి పెరగనుంది. దేశాల వారీగా జీడీపీ బిలియన్ డాలర్లలో, బ్రాకెట్లలో ప్రపంచంలో దేశ వాటా శాతాలు దిగువ విధంగా ఉన్నాయి. చైనా 19,374(18.4), భారత్ 3,737(3.6), బ్రెజిల్ 2,081(2), రష్యా 2,063(2), సౌదీ అరేబియా 1,062(1), అర్జెంటీనా 641(0.6), యుఏఇ 491(0.5) దక్షిణాఫ్రికా 399(0.4), ఈజిప్టు 387(0.4), ఇరాన్ 368(0.4), ఇథియోపియా 156(0.1) బి.డాలర్లు. విస్తరణతో ఈ కూటమి దేశాల చమురు వాటా ప్రపంచంలో 20.4 నుంచి 43.1శాతానికి పెరగనుంది. ప్రపంచంలో దేశాల వాటాల శాతాలు ఇలా ఉన్నాయి. సౌదీ అరేబియా 12.9, రష్యా 11.9, చైనా 4.4, యుఏఇ 4.3, ఇరాన్ 4.1, బ్రెజిల్ 3.3శాతం కాగా అర్జెంటీనా, భారత్ 0.8శాతం చొప్పున, ఈజిప్టు 0.7శాతం కలిగి ఉండగా దక్షిణాఫ్రికా, ఇథియోపియాల్లో అసలేమీ లేదు. ప్రపంచ సహజవాయువులో 30శాతం కలిగి ఉన్నాయి. ప్రపంచ చమురు ఎగుమతుల్లో వాటా 18 నుంచి 25.1శాతానికి పెరగనుంది. ప్రపంచ ఆర్థికరంగం మీద పెత్తనం చేస్తున్న డాలరును వెనక్కు నెట్టి బ్రిక్స్ కరెన్సీని ప్రవేశపెట్టాలన్న ఆలోచన మీద కూడా జోహన్నెస్‌బర్గ్ సమావేశాల్లో చర్చ జరిగింది. కొన్ని దేశాల సందేహాల కారణంగా ముందుకు పోలేదు. ఉమ్మడి కరెన్సీని పంచుకోవటం గురించి బ్రెజిల్ ప్రతిపాదన ముందుకు తేగా మనదేశం భిన్న వైఖరిని వెల్లడించింది. ఈ అంశం ప్రస్తుత సమావేశ అజెండాల్లో లేదని దక్షిణాఫ్రికా పేర్కొన్నది. డాలర్లకు బదులు ఆయా దేశాల కరెన్సీలతో లావాదేవీలు జరపాలని చైనా, రష్యా పేర్కొన్నాయి. అమెరికా ఆంక్షలను ఎదుర్కొంటున్న ఈ దేశాలు సహజంగా డాలరును వ్యతిరేకిస్తున్నాయి. డాలర్లలో లావాదేవీల వాటా 2015లో వాటి వాటా 90శాతం ఉండగా

> ఇండో-పసిఫిక్ పేరుతో చైనా వ్యతిరేక కూటమి నిర్మాణానికి పూనుకున్న అమెరికాకు దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకలు తిరిగేందుకు అవకాశం ఉండాలంటూ మన దేశం మద్దతు ఇస్తున్నది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను సమర్థించనప్పటికీ అమెరికాకు ఆగ్రహం కలగకుండా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఒక విధంగా చెప్పాలంటే ఎవరికీ నొప్పి తగలకూడదనే వైఖరితో మన దేశం గడసాము గరిడీలు చేస్తున్నది.

2020 నాటికి 46శాతానికి, తరువాత ఇంకా తగ్గింది. మన దేశం మాత్రం ఎగుమతులు-దిగుమతులకు 80శాతం డాలర్లనే వాడుతున్నది.

ప్రస్తుత విస్తరణ, రానున్న రోజుల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న దేశాల పెరుగుదలను చూసినప్పుడు ప్రపంచ బలాబాల్లో ఈ కూటమి కీలకంగా మారనున్నదనేది స్పష్టం. మనదేశం, చైనాతో సహా మిగిలిన దేశాలన్నీ బహుముఖ ప్రపంచ వ్యవస్థ ఉండాలని కోరుతున్నాయి. ఈ కూటమిలో ఉన్న దేశాల ఆర్థిక రంగాలను చూసినప్పుడు తేడా చాలా ఎక్కువగా ఉంది. అందువలన వాటి ప్రయోజనాలు, ప్రాధాన్యతలు కూడా వేరుగా ఉంటాయి. ఉదాహరణకు మన దేశం చైనాను అధిగమించాలని చూస్తున్నట్లు బహిరంగంగానే వాంఛ వెల్లడిస్తున్నది. వివాదాస్పద అంశాలపై కూడా ఈ కూటమిలో పూర్తి ఏకీభావం లేనందున అంగీకృత అంశాల మీదనే కేంద్రీకరణ జరుగుతున్నది. ఇండో-పసిఫిక్ పేరుతో చైనా వ్యతిరేక కూటమి నిర్మాణానికి పూనుకున్న అమెరికాకు దక్షిణ చైనా సముద్రంలో స్వేచ్ఛగా నౌకలు తిరిగేందుకు అవకాశం ఉండాలంటూ మన దేశం మద్దతు ఇస్తున్నది. ఇరాన్‌పై అమెరికా విధించిన ఆంక్షలను సమర్థించనప్పటికీ అమెరికాకు ఆగ్రహం కలగకుండా ఇరాన్ నుంచి చమురు కొనుగోలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఒక విధంగా చెప్పాలంటే ఎవరికీ నొప్పి తగలకూడదనే వైఖరితో మన దేశం గడసాము గరిడీలు చేస్తున్నది.

లండన్‌లోని సోయాజ్ చైనా సంస్థ డైరెక్టర్ స్టీవ్ సాంగ్ మాట్లాడుతూ బ్రిక్స్ సభ్యదేశాలు ఉపరితలంతో ఒకేవిధంగా లేవని, అయినప్పటికీ ఎవరూ పశ్చిమ దేశాల ఆధిపత్య ప్రపంచంలో జీవించకూడదని అందరూ అనుకుంటున్నట్లుగా చూపేందుకు షీ జిన్‌పింగ్ చూశారని, చైనా వారు చూపుతున్న ప్రత్యామ్నాయంలో నిరంకుశులు తమ స్వంత దేశాల్లో సురక్షితంగా ఉండవచ్చని, ప్రజాస్వామిక అమెరికా, ఐరోపా దేశాలు రుద్దిన షరతులను అంగీకరించకుండా ప్రత్యామ్నాయ అభివృద్ధి పథాన్ని కనుగొనవచ్చనే భావన ఉన్నదని అన్నాడు. తమకు గానీ మరొక దేశానికి గానీ ప్రత్యర్థిగా రాజకీయ ప్రత్యర్థి తయారవుతున్నట్లుగా తాము భావించటం లేదని అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సులవాన్ సమావేశ ప్రాధాన్యతను తక్కువ చేసి చూపేందుకు, వక్రీకరించేందుకు చూశారు. కొత్తగా బ్రిక్స్‌లో చేరిన ఆరు దేశాల్లో ఏ ఒక్కటీ అమెరికా వ్యతిరేకమైనది లేదని వాషింగ్టన్‌లోని క్విన్సీ సంస్థ డైరెక్టర్ సరంగ్ షిడోర్ అన్నాడు. ఈ సమావేశాల తరువాత పశ్చిమ దేశాలకు చెందిన విశ్లేషకులు, మీడియా వార్తల తీరు వక్రీకరణ, కూటమిలో అనుమానాలను రేకెత్తించేదిగా తంపులు పెట్టేదిగా ఉందని చెప్పవచ్చు.

మెయిల్ @ నవతెలంగాణ

చంద్రయాన్ స్ఫూర్తితో సూర్యయాన్

చంద్రయాన్3 విజయవంతమైన నేపథ్యంలో మన శాస్త్రవేత్తలు మరో అద్భుతానికి శ్రీకారం చుట్ట బోతున్నారు.ఆ అద్భుతమే సూర్యయాన్ మిషన్. ఈ మిషన్‌లో భాగంగా సౌరవాయు ఆవర్తనాన్ని సుదూరం నుంచి పరిశీలించడానికి, సూర్యుని వెలుపల ఉన్న పొరలు, సౌరశక్తి కణాలు, వేర్వేరు తరంగ పౌనఃపున్యాల వద్ద ఫోటోస్పియర్ (కాంతి మండలం), క్రోమోస్పియర్ (వర్ణ మండలం)ను అధ్యయనం చేయనున్నారు. కరోనా వలయంలో పెరుగుతున్న వేడి వంటి వాటిపై అధ్యయనం చేసేందుకు ఆదిత్య ఎల్1 ఉపగ్రహాన్ని, పిఎస్ఎల్ వి-సి 57 వాహననౌక ద్వారా సెప్టెంబర్ 2వ శ్రీహరికోట నుండి అంతరిక్షంలోకి పంపబోతున్నారు. గ్రహణాలు వంటివి పరిశోధనలకు అడ్డంకిగా మారకుండా భూమికి సుమారుగా 15లక్షల కిలోమీటర్ల దూరంలో ఉన్న లాంగ్రేజియన్ పాయింట్1 చుట్టూ ఉన్న కక్ష్యలోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు. భూమి నుండి ఈ కేంద్రానికి చేరుకోవడానికి ఉపగ్రహ వాహక నౌకకి సుమారుగా 175 రోజులు పడుతుంది. ఈ ఉపగ్రహం బరువు 1500కిలో గ్రాములు. ఇది ఏడు పేలోడ్‌లను మోసుకెళ్తుంది. ఆ పెలోడ్లలలో విజిబుల్ ఎమిషన్ లైన్ కోరోనా గ్రాఫ్, సోలార్ అల్ట్రా వైలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్, ఆదిత్య సోలార్ విండ్ పార్టికల్ ఎక్స్పరిమెంట్, ప్లాస్మా ప్యాకేజ్ ఫర్ ఆదిత్య, సోలార్ లోఎనర్జీ ఎక్స్ రే స్పెక్ట్రోమీటర్, హైఎనర్జీ ఎల్ వన్ ఆర్బిటింగ్ ఎక్స్రే స్పెక్ట్రోమీటర్, మ్యాగ్నటోమీటర్లుగా ఉన్నాయి. వీటిలో విజిబుల్ ఎమిషన్ లైన్ కొరొనాగ్రాఫ్ ప్రధానమైనది. ఇది సూర్యగోళం నుండి ప్రసరించే కాంతి ప్రభావాన్ని అధ్యయనం చేస్తుంది. ఇప్పటికే ఈ మిషన్‌కు అవసరమైన పరికరాలను బెంగళూరులోని యుఆర్ రావు శాటిలైట్ కేంద్రం నుండి షార్ కేంద్రానికి తీసుకు వచ్చి పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ సజావుగా జరిగితే అక్టోబర్‌లోనే గగనయాన్ ప్రయోగానికి శ్రీకారం చుడతారు. ఈ ప్రయోగం ద్వారా అంతరిక్షానికి మహిళా రోబో వ్యోమమిత్రను మొదటగా పంపి, 2024 ఆఖరి నాటికి ముగ్గురు వ్యోమగాములను అంతరిక్షానికి పంపే ఆలోచన చేస్తున్నారు. 2023 మనదేశ అంతరిక్ష చరిత్రలో గుర్తుండి పోయే సంవత్సరం. రెండు నెలల వ్యవధిలోనే చంద్రయాన్ విజయం, సూర్యయాన్ ప్రయోగం చేపడుతున్న ఇస్రోకు అభినందనలు.

- డి జె మోహన రావు, 440485824

రైతు, కూలీలు సంఘటితం కావాలి...

వ్యవసాయాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో కేంద్రం చేసిన మూడు నల్లచట్టాలపై పదమూడు నెలల పాటు ఢిల్లీ సరిహద్దుల్లో రైతుల పోరాటం జరిగింది. ఆ చట్టాలవలే కత్తిమీద సాములా వేలాడుతున్న విద్యుత్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టారు పాలకులు. ఇది కూడా నల్లచట్టమే అనేది స్పష్టం. మూడు వ్యవసాయ చట్టాలు రైతులు, వ్యవసాయ కూలీలపై మాత్రమే ప్రత్యక్ష దాడి. కానీ విద్యుత్ రంగంలో మాత్రం ఈబిల్లు ప్రతి పేదవారిపై దాడి. పట్టణ పేదలు, గ్రామీణ పేదలు వినియోగదారులు, విద్యుత్తు కార్మికులు ఎవరైనా కావచ్చు ఇది అందరిపైనా ప్రభావం చూపే బిల్లు. అందువల్ల ఈ విద్యుత్ బిల్లుకు వ్యతిరేకంగా ఐక్య పోరాట ప్రతిఘటనను వినిపించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. పోరాడితే నల్ల చట్టాలను వెనక్కి తీసుకున్నారన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. మనకు 1947లో స్వాతంత్ర్యం వచ్చింది. నేటికీ దోపిడీ, అన్యాయం కొనసాగుతుందా లేదా? 1977లో జేపీ ఉద్యమం తర్వాత ఎన్నికలొచ్చినప్పుడు కూడా మోసపోయామా లేదా? 1991 నుంచి ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేస్తూ తీసుకొచ్చిన నూతన ఆర్థిక విధానాలు ప్రజల్ని మోసం చేశాయా లేదా? 2000 సంవత్సరం నుండి 2014 వరకు వచ్చిన ప్రభుత్వాలతో మోసపోతున్నామా లేదా? దేశాన్ని మత విద్వేషాలతో పాలిస్తున్న ఈ తొమ్మిదేండ్ల మోడీ ప్రభుత్వాన్ని కూడా ప్రజలు మోస్తున్నారు కదా! ఈ మోడీని తరిమికొట్టడం కూడా ఒక ముఖ్యమైన ప్రశ్న. అయితే పోరాటం అలా కాదు. మోడీ ప్రభుత్వం వెనుక ఎవరున్నారు? గత ప్రభుత్వాల వెనుక ఎవరున్నారు? తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రతి రంగంలో, వ్యవసాయంలో, ప్రతి పరిశ్రమలో కూలీలను, రైతులను దోపిడీ చేస్తున్న వారి వెనుక ఉన్న పెట్టుబడిదారులు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా పోరాటాన్ని బలోపేతం చేయడమే అత్యంత ముఖ్యమైన విషయం. అదానీ, అంబానీ, కార్పొరేట్లు, పెట్టుబడిదారులను తరిమికొట్టాలి. అయితే ఇది కార్మికులు, రైతులు, కూలీల ఉద్యమం ద్వారానే సాధ్యం. వారంతా సంఘటితం కావాలి.ఈ అవగాహనతో ఉద్యమాలను బలోపేతం చేయాలి. ఇదే లక్ష్యంతో ముందుకు సాగాలి.

- మూడ్ శోభన్, 9949725951

విద్యుత్ బస్సులు - దాచిన వాస్తవాలు

ఇటీవల కాలంలో విద్యుత్ బస్సులపై కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున చర్యలు చేపడుతున్నది... వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నది. పర్యావరణ హితం కోసమే ఇదంతా చేస్తున్నట్లు చెబుతున్నది. వాస్తవాలను ఓసారి పరిశీలిస్తే అసలు విషయం బహిర్గతమవుతుంది. భారత దేశంలో విడుదల అవుతున్న కాలుష్యంలో పరిశ్రమల ద్వారా 50శాతం, వాహనాల ద్వారా 20నుండి 30శాతం ఇతరత్రా కారణాల ద్వారా మిగతా కాలుష్యం విడుదల అవుతున్నది. దేశంలో 2019 మార్చ్ 31 నాటికి(ఆ తర్వాతి వివరాలు ఇంకా ప్రభుత్వం విడుదల చేయలేదు) రిజిస్టర్ అయినా వాహనాలలో ద్విచక్ర వాహనాలు 74శాతం. కార్లు, జీపులు, టాక్సీలు కలిపి 12.99శాతం. బస్సులు 0.69శాతం. అంటే విడుదల అవుతున్న కాలుష్యంలో బస్సుల వాటా నామమాత్రం. 2019 నాటికి దేశం మొత్తంలో 10లక్షల 47వేల బస్సులుండగా అందులో ఆర్టీసీ బస్సులు కేవలం 1,35,847. ఆర్టీసీ బస్సులు అతి తక్కువ కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. ఇవన్నీ ప్రభుత్వ గణాంకాలు. కేవలం 0.69శాతంగా ఉన్న బస్సుల కాలుష్యం గురించి అంత హడావుడి ఎందుకు? వాహన కాలుష్యంలో సింహ భాగం ద్విచక్ర, కార్లు, జీపుల, ఇతరత్రా నుండి విడుదల అవుతున్నది. దీన్ని నియంత్రించడం సమస్యకు సరైన పరిష్కారం. ఇది జరగాలంటే ప్రజా రవాణాను గణనీయంగా పెంచి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించడం అత్యంత ఆవశ్యకం. కానీ ఆ దిశగా చేపడుతున్న చర్యలేవి?



ఆర్. లక్ష్మయ్య
9971511954

ప్రపంచంలోని అత్యధి దేశాలు వ్యక్తిగత వాహనాల వినియోగం (రోజువారీ అవసరాలకోసం) నియంత్రించి ప్రజారవాణాను విస్తృత పరచి వినియోగించుకునేలా చట్టబద్ధంగా పలు చర్యలు చేబడుతున్నాయి. లక్సెంబర్గ్ దేశంలో ప్రజా రవాణా అందరికి పూర్తిగా ఉచితం. అమెరికాలో సహితం కొన్ని రాష్ట్రాలు, నగరాలలో ప్రజా రవాణా ఉచితం, అతి తక్కువ. ప్రపంచం మొత్తంలో ఏదేశంలో కూడా బస్సుల చార్జీలు నిర్వహణ ఖర్చులో 30-40శాతానికి మించి వసూలు చేయరు. నిర్వహణ ఖర్చులో అత్యధిక భాగం కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు వివిధ రూపాలలో సర్దుబాటు చేస్తాయి. ప్రపంచంలో ఎక్కడ ప్రజా రవాణాను లాభనష్టాల స్కేలుతో కొలవరు. కాలుష్య నివారణ గురించి మాట్లాడే ముందు ప్రజా రవాణాను విస్తృత పరచి, అందుబాటు ధరలతో అందరు రోజువారీ అవసరాల కోసం వినియోగించుకునేలా చేయడం ప్రథమ కర్తవ్యంగా ఉండాలి. ప్రపంచంలో అన్ని దేశాలలో లక్ష జనాభాకు 60బస్సులున్నాయి. చైనాలో ప్రతి 1000మందికి 6బస్సులు ఉంటే భారత దేశంలో ప్రతి 10వేల మందికి కేవలం 4బస్సులు మాత్రమే ఉన్నాయని, దేశంలో 90శాతం మందికి సొంత వాహనాలు లేవని స్వయంగా కేంద్ర రవాణా శాఖామాత్యులు నితిన్ గడ్కరీ చెప్పారు. ప్రజా రవాణా దేశంలో ఎంతగా విస్తరించాల్సిన అవసరం ఉంది మంత్రి ప్రకటనే తెలియజేస్తున్నది.

ఇక విద్యుత్ బస్సుల విషయానికి వస్తే వాటి ఖరీదు సుమారు రూ.2 కోట్లు. అదే డీజిల్ ఇంజన్ లక్సరీ బస్సు 40లక్షలు. ఆర్డినరీ బస్సు అయితే 25లక్షలు. ప్రస్తుతం భారత దేశానికి కావలసింది ప్రజల అవసరాలకు తగిన విధంగా బస్సులను పెంచడం. ఇటీవల కేంద్ర మంత్రివర్గం 10వేల విద్యుత్ బస్సులను 169 నగరాలు, పట్టణాలలో ప్రవేశ పెట్టాలని అందుకు రూ.20వేల కోట్లు కేంద్రం భరించాలని నిర్ణయించింది. ఇదే ఖర్చుతో 40వేల డీజిల్ బస్సులు కొనుగోలు చేయవచ్చు. ప్రత్యక్షంగా పరోక్షంగా లక్షలాది మంది నిరుద్యోగులకు ఉపాధి



లభిస్తుంది. విద్యుత్ బస్సులలో ప్రధానమైనది బ్యాటరీ. ఇదే అత్యంత ఖరీదు అయినది. దీన్ని విదేశాల నుండి దిగుమతి చేసుకోవాలి. ఛార్జింగ్ వంటి మౌలిక సదుపాయాలు పెద్దఎత్తున సమకూర్చుకోవాలి. వీటిపై ప్రపంచ వ్యాపితంగా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. మనదేశంలో కాశ్మీర్‌లో విద్యుత్ వాహనాల బ్యాటరీకి అవసరమైన లిథియం ఇటీవలే బయట పడింది. అందుచేత మన దేశం మరో పది సంవత్సరాలు వేచి చూడవచ్చు. ఈ లోగా ఖనిజ సంపద, ఇతర మౌలిక సదుపాయాల సమకూర్చుకోవచ్చు. ప్రపంచ వ్యాపితంగా విద్యుత్ బస్సులపై అనేక పరిశోధనలు జరుగుతున్నాయి. ధరలు కూడా క్రమంగా తగ్గుతాయి. మనం ఇంతగా తొందరపడి ఒళ్లు కాల్చుకోవడం అవసరమా?

కానీ ఇందుకు భిన్నంగా ఉరుకులు పరుగులమీద విద్యుత్ బస్సుల కోసం పరుగులు తీయడం వెనుక కారణమేంటి? ఈ విద్యుత్ బస్సులు ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేయాలి. అందుకు వచ్చే సబ్సిడీ వారికే చెల్లించబడుతుంది. ప్రయివేటు వ్యక్తులే ఆర్టీల ద్వారా బస్సులు నడపాలి. అందుకు గాను ఆర్టీలు వారికి డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఎయిర్‌పోర్టుకు నడుస్తున్న బస్సులు ఇదే తరహాలో నడుస్తున్నాయి. వీటిపై టీఎస్‌ఆర్టీసీకి వచ్చే ఆదాయంకంటే ప్రయివేటు వారికి చెల్లించే మొత్తం ఎక్కువ. దేశం మొత్తంలో విద్యుత్ బస్సుల కథ ఇదే. ఈ విధానం ఆర్టీసీలకు గుదిబండ అయింది. కేంద్ర ప్రభుత్వం 2015 నుండి ఫేమ్ 1, 2019 నుండి ఫేమ్ 2 పథకాలను ప్రవేశపెట్టింది. (ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ అఫ్ హైబ్రిడ్ అండ్ ఎలక్ట్రిక్ వెహికల్స్). ఫేమ్ 2 విధి విధానాలలోనే బస్సుల కొనుగోలు, నిర్వహణ, నడపడం ప్రయివేటు వారే చేయాలనే షరతు కేంద్రం విధించింది. దీనికి జి.సి.సి. (గ్రాస్ కాస్ట్ కాంట్రాక్టు)అని పేరు పెట్టింది. అంటే ఖర్చులు, లాభాలు కలుపుకొని నిర్ణయించడం. ఇదే విద్యుత్ బస్సుల కథలోని అసలు రహస్యం. ప్రజల సొమ్మును కొంతమంది వ్యక్తులకు కట్టబెట్టడం, ప్రభుత్వ రంగాన్ని విధ్వంసం చేయడమే పరమావధి.

దీని వెనుక మరో పెద్ద కుట్రకోణం కూడా దాగి ఉంది. గ్లోబల్ వార్మింగ్(పర్యావరణ పరిరక్షణ) పేర శిలాజ ఇంధనాల వాడకం గణనీయంగా తగ్గించాలని, ప్రత్యామ్నాయ ఇంధన వినియోగం పెంచాలని ప్రపంచ బ్యాంకు ఆదేశాలు. దానికే "జస్ట్ ట్రాన్సిషన్" అని పేరు పెట్టారు. ప్రపంచంలో అత్యధిక కాలుష్యం 27శాతం వెదజల్లుతున్న దేశం అమెరికా. ఆ తర్వాత 22శాతం యూరోప్ దేశాలు, సౌత్ అండ్ సౌత్ ఈస్ట్ దేశాలు 9శాతం మాత్రమే. అత్యధిక కాలుష్యం

> ఉరుకులు పరుగులమీద విద్యుత్ బస్సుల కోసం పరుగులు తీయడం వెనుక కారణమేంటీ? ఈ విద్యుత్ బస్సులు ప్రయివేటు వ్యక్తులు, సంస్థలు కొనుగోలు చేయాలి. అందుకు వచ్చే సబ్సిడీ వారికే చెల్లించబడుతుంది. ప్రయివేటు వ్యక్తులే ఆర్టీల ద్వారా బస్సులు నడపాలి. అందుకు గాను ఆర్టీలు వారికి డబ్బులు చెల్లించాలి. ప్రస్తుతం హైదరాబాద్ నగరంలోని వివిధ ప్రాంతాల నుండి ఎయిర్‌పోర్టుకు నడుస్తున్న బస్సులు ఇదే తరహాలో నడుస్తున్నాయి. వీటిపై టీఎస్‌ఆర్టీసీకి వచ్చే ఆదాయంకంటే ప్రయివేటు వారికి చెల్లించే మొత్తం ఎక్కువ. దేశం మొత్తంలో విద్యుత్ బస్సుల కథ ఇదే.

ప్రపంచంపై వదిలి ప్రజల జీవితాలను, వాతావరణాన్ని కలుషితం చేస్తున్న అమెరికా, యూరప్ దేశాలు ప్రధాన బాధ్యత వహించాలి. ఆ దేశాలు అందుకు సిద్ధంగా లేవు. కానీ అమెరికాకు అనుగుణంగా మారిన నరేంద్ర మోడీ ప్రభుత్వం మాత్రం నెత్తికెత్తుకొని దేశాన్ని నాశనం పట్టిస్తున్నది. భారతదేశ ఇంధన ఉత్పత్తిలో బొగ్గు 25శాతం, శిలాజ ఇంధనాలు 44శాతం. దేశంలో విద్యుత్ తయారీ ప్రధానంగా 78శాతం థర్మల్ విద్యుత్‌యే. బొగ్గే ఇందుకు ప్రధానం. శిలాజ ఇంధనాలు వాటి అనుబంధ పరిశ్రమలలో 2కోట్ల 15లక్షల మంది పనిచేస్తున్నారు. విద్యుత్ ఉత్పత్తిలో ప్రభుత్వ రంగం సింహభాగాన ఉంది. గాలి, సోలార్ లాంటి కొత్త విద్యుత్ ఉత్పాదన 96శాతం ప్రయివేటు రంగానిది. ఆ విధంగా ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి ప్రయివేటు వారికి ధారాదత్తం చేసేందుకు, కోట్లాది మందిని నిరుద్యోగ సైన్యంలోకి నెట్టేందుకు మోడీ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అమెరికాకు లొంగి కార్పొరేట్లకు ఊడిగం చేయడమే ప్రత్యామ్నాయ ఇంధన మార్గాలు, విద్యుత్ బస్సులు. కేంద్రం కుట్రలను ప్రజలు అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

నవతెలంగాణపై స్పందన
ఫోన్ చేయాల్సిన నంబరు : 9490099016

పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. నవతెలంగాణలో మీకు నచ్చిన, నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తెస్తే.. పత్రికకు మరింత పదును పెట్టే వీలుంటుంది. ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటలవరకూ పత్రికపై మీ అభిప్రాయాలను 9490099016కు తెలియచేయవచ్చు. మీరు చెప్పేది స్పష్టంగా, సూటిగా, క్లుప్తంగా ఉండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే మా అడ్రస్ : స్పందన, నవతెలంగాణ తెలుగు డైలీ, ఎం.హెచ్ భవన్, ప్లాట్ నెం.21/1, ఆజామాబాద్, ఆర్టీసీ కళ్యాణ మండపం దగ్గర, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 20.





అదానీకి అంత సీన్ ఉందా?

ధారవి వాసుల అనుమానాలు

న్యాయ పోరాటానికి సిద్ధమైన ప్రత్యర్థి బిడ్డర్





ముంబయి : ఆసియాలోనే అతి పెద్దదైన ముంబయి మురికివాడ ధారవిలో నివసిస్తున్న పది లక్షల మంది ప్రజలకు గృహ వసతి కల్పించి, వారి జీవితాలలో వెలుగులు నింపుతానంటూ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ చేసిన ప్రకటనపై అక్కడి పేదలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారంలో ఎదురు దెబ్బలు, ఆరోపణల నేపథ్యంలో అదానీ ఆర్థిక పరిస్థితిని అంచనా వేస్తున్న ప్రజలు ఆయనకు ఆ సామర్థ్యం ఉన్నదా అని ప్రశ్నిస్తున్నారు.

అదానీ అభివృద్ధి చేస్తానని చెబుతున్న ధారవి మురికివాడలో నివసిస్తున్న పేదలు దుర్భర జీవితాలు గడుపుతున్నారు. అక్కడ డ్రైనేజ్ వ్యవస్థ లేదు. సామూహిక మరుగు దొడ్లలోనే కాలకృత్యాలు తీర్చుకుంటారు. ఈ మురికివాడ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయానికి, ఆకాశ హర్మ్యాలలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విదేశీ కంపెనీలకు చేరువలో ఉంది. అయినా ప్రజల జీవనం అస్తవ్యస్థం. మురికివాడను పునర్నిర్మించే లక్ష్యంతో మహారాష్ట్ర ప్రభుత్వం జూలైలో 614 మిలియన్ డాలర్ల కాంట్రాక్టును ఖరారు చేసింది. ఆ వెంటనే తాను ఆ మురికివాడను స్వర్గధామంగా మారుస్తానని అదానీ ప్రకటించారు. ప్రస్తుతం అక్కడ ఉన్న పేదల ఇళ్లను కూల్చివేసి ప్రభుత్వ భూమిలో కొత్తగా టవర్లు నిర్మిస్తామని, వాటిని ప్రజల నివాసాలకు, వ్యాపారాలకు కేటాయిస్తామని అదానీ చెబుతున్నారు. దీనిపై అదానీ 12 బిలియన్ డాలర్లు ఖర్చు చేసి, 24 బిలియన్ డాలర్లు లభించేలా అభివృద్ధి హక్కులు పొందుతారని కన్సల్టెన్సీ సంస్థలు అంచనా వేస్తున్నాయి.

అయితే ప్రస్తుతం అదానీ ఆర్థిక పరిస్థితి అంత సజావుగా లేదు. జనవరి వరకూ ఆయన ప్రపంచ సంపన్నుల జాబితాలో మూడో స్థానంలో ఉన్నారు. అయితే హిండెన్‌బర్గ్ నివేదిక తర్వాత ఆయన వ్యాపార సామ్రాజ్యం బీటలు వారింది. అదానీ గ్రూప్ మార్కెట్ విలువ ఒక్కసారిగా 150 బిలియన్ డాలర్లు పడిపోయింది. ఇదే తమను ఆందోళనకు గురి చేస్తోందని ధారవి వాసులు తెలిపారు. దీనికితోడు పులి మీద పుట్రలా అదానీతో పాటు ధారవి కోసం బిడ్ వేసిన దుబాయికి చెందిన కన్సార్టియం సెక్‌లింక్ టెక్నాలజీస్ కార్పొరేషన్ న్యాయ పోరాటానికి సిద్ధమవుతోంది. 2018లోనే తాము ధారవి పునర్నిర్మాణానికి అత్యధిక బిడ్ వేశామని, అయితే 2022లో మహారాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రక్రియను తిరిగి ప్రారంభించి అదానీ గ్రూపుకు కాంట్రాక్ట్ కట్టబెట్టేలా నిబంధనలు మార్చిందని ఆ సంస్థ ఆరోపించింది. ఈ కేసులో ప్రభుత్వంతో పాటు అదానీని కూడా ప్రతివాదిగా చేర్చేందుకు గత నెలలో ముంబయి కోర్టు అనుమతించింది.

రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన బిడ్డింగ్ ప్రక్రియ రాజకీయ దురుద్దేశంతో కూడుకున్నదని, అదానీ గ్రూపుకు ప్రయోజనం చేకూర్చేలా నిబంధనలు మార్చారని కన్సార్టియం ఆరోపిస్తోంది. బిడ్ దాఖలు చేసే కంపెనీ ఆస్తుల నికర విలువను రెట్టింపు చేసి 2.4 బిలియన్ డాలర్లకు పెంచారని, కన్సార్టియం సభ్యుల సంఖ్యను ఎనిమిది నుండి రెండుకు కుదించారని చెబుతోంది. అయితే ఈ ఆరోపణలను అటు అదానీ గ్రూపు, ఇటు మహారాష్ట్ర ప్రభుత్వం ఖండిస్తున్నాయి.

ఆశాలపై పోలీసుల దాష్టీకం

అడ్డుకున్న పోలీసులు

- తోపులాటలు.. తీవ్ర ఉద్రిక్తత
- పలువురికి గాయాలు.. సొమ్మసిల్లిన ఆశాలు
- అరెస్టు చేసి స్టేషన్లకు తరలింపు
- ఖమ్మంలో పేర్లు, సంతకాలు పెట్టాలంటూ పోలీసుల ఒత్తిడి
- పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలకు వినతులు



నవతెలంగాణ- విలేకరులు

ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18,000 ఇవ్వాలని కోరుతూ తెలంగాణ వాలంటీర్ కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మంత్రుల నివాసాలు, కార్యాలయాల ముట్టడి ఉద్రిక్తంగా మారింది. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వెళ్తున్న ఆశాలను పలుచోట్ల పోలీసులు అడ్డుకున్నారు. తోపులాటతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. మహిళలని కూడా చూడకుండా పోలీసులు లాగిపడేశారు. ఈ క్రమంలో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కొందరు సొమ్మసిల్లి పడిపోయారు.

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మెమోరాండం ఇచ్చేందుకు హైదరాబాద్ మారేడ్‌పల్లిలోని ఆయన ఇంటికి వెళ్తున్న సీఐటీయూ నాయకత్వాన్ని, ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులకు, ఆశావర్కర్లకు మధ్య జరిగిన తోపులాటలో ఇద్దరు ఆశావర్కర్లు సొమ్మసిల్లి పడిపోయారు. ఆరుగురికి తీవ్ర గాయాలై రక్తం కారింది. పోలీసులు మొత్తం 78 మందిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం.వెంకటేష్, సహాయ కార్యదర్శులు టి.మహేందర్, ఎం. సత్య నారాయణ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం అనిత, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు ఉన్నారు.

మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావుకు వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఇంటి ముందు ఆశ కార్యకర్తలు ధర్నా చేపట్టారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఇంటి ఎదుట ధర్నా నిర్వహించారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ క్రమంలో సీఐటీయూ నాయకులు, ఆశాలను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఆశా కార్యకర్తలు పోలీస్ స్టేషన్ గేటు ఎదుట ఆందోళనకు దిగారు. ఆందోళన చేస్తున్న వారితో పోలీసులు చర్చలు జరిపారు. సుమారు రెండు గంటల తర్వాత విడుదల చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ఇంటి ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ సమస్యలను ఎమ్మెల్యేకు విన్నవించారు. ఈ క్రమంలో పోలీసులు సీఐటీయూ నాయకులతో పాటు ఆశావర్కర్లను అరెస్టు చేశారు. వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ఆందోళన చేపట్టి.. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

ఖమ్మంలోని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంప్ కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చేందుకు వెళ్లిన ఆశాలను పోలీసులు దౌర్జన్యంగా అరెస్టు చేశారు. ఖమ్మం టూ టౌన్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు విష్ణును బలవంతంగా ఎత్తుకెళ్లి పోలీసు వ్యాన్‌లో పడేశారు. అరెస్టు అయిన ఆశాలందరూ పేర్లు, సంతకాలు పెట్టాలని పోలీసు అధికారులు ఒత్తిడి చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ముఖ్యుల సంతకాలు పెడతామన్నా పోలీసులు ఒప్పుకోక పోవడంతో స్టేషన్‌లో ఆందోళనకు దిగారు. ఆశావర్కర్లకు ఫిక్స్ డ్ వేతనం రూ.18000 ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఇతర సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరారు. వైరాలో ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం వినతి పత్రాన్ని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో అందజేశారు. మధిరలో ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ర్యాలీగా మధిరలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్దకు చేరుకొని మానవహారం చేపట్టారు. కూసుమంచి మండల కేంద్రంలోని నుంచి పాలేరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ఆశాలు ర్యాలీ వచ్చి ధర్నా నిర్వహించారు. ఎమ్మెల్యే పీఆర్ఓకు వినతిపత్రాన్ని అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని పాల్వంచ మండలంలో ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఇంటి ముందు ధర్నా చేశారు. ఎమ్మెల్యే లేక పోవడంతో ఇంటికి వినతిపత్రాన్ని అతికించారు. భద్రాచలంలో ఆశా వర్కర్స్ సమస్యలపై ఎమ్మెల్యే పొదెం వీరయ్యకి మెమోరండం అందజేశారు. మణుగూరు ప్రధాన సెంటర్ నుంచి ఆశాలు ర్యాలీగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్దకు చేరుకొని ముట్టడించారు. ఎమ్మెల్యే రేగాకు వినతిపత్రం అందజేశారు.

మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఎమ్మెల్యే డాక్టర్ గువ్వల బాలరాజ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు కల్వకుర్తి టౌన్ పట్టణంలో, నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలను ముట్టడించారు.

ములుగు జిల్లా డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డాక్టర్ అల్లం అప్పయ్యకు వినతిపత్రం అందించారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి ఎమ్మెల్యే సీతక్కకు వినతిపత్రం అందజేశారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి.. ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డికి వినతిపత్రం అందించారు. హనుమకొండలోని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఇంటిని ముట్టడించారు. ఈ సందర్భంగా పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం వారిని అరెస్టు చేశారు. అంతకు ముందు భారీ ర్యాలీ తీశారు.

నేడు, రేపు డీఎడ్, బీఎడ్ కాలేజీల బంద్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 13,500 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బుధ, గురువారాల్లో రెండురోజులపాటు డీఎడ్, బీఎడ్ కాలేజీల బంద్‌కు డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం ప్రకటించింది. విద్యాశాఖ కార్యాలయం ముట్టడికి వెళ్లిన ఉపాధ్యాయ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జీ చేసి అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించింది. కవరేజీకి వచ్చిన మీడియా ప్రతినిధులపై పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ డీఎడ్, బీఎడ్ కాలేజీలను బుధ, గురువారాల్లో బంద్‌కు పిలుపునిచ్చారు.

కుల వివక్ష వ్యతిరేక బిల్లుకు కాలిఫోర్నియా అసెంబ్లీ అమోదం

వాషింగ్టన్ : కుల వివక్ష వ్యతిరేక బిల్లును కాలిఫోర్నియా రాష్ట్ర అసెంబ్లీ ఆమోదించింది. కుల వివక్షను సమర్ధవంతంగా ఎదుర్కొనాలని, రాష్ట్ర వ్యాప్తంగా అణచివేతకు గురవుతున్న వర్గాలకు రక్షణలను బలోపేతం చేయాలని ఈ బిల్లు కోరుతోంది. సోమవారం అసెంబ్లీ ఈ బిల్లును ఆమోదించి, గవర్నర్ గావిన్ న్యూసమ్ వద్దకు పంపింది. ఆయన సంతకంతో ఇది చట్టంగా మారుతుంది. వివక్ష వ్యతిరేక చట్టాల్లో కులాన్ని ఒక రక్షిత కేటగిరీగా చేర్చిన మొదటి అమెరికన్ రాష్ట్రంగా కాలిఫోర్నియా నమోదైంది. సెనెటర్ అయేషా వహాబ్ ఈ ఏడాది ప్రారంభంలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, రాష్ట్రవ్యాప్తంగా కుల సమానత్వ, పౌర హక్కుల కార్యకర్తలు, సంఘాలు పలువురు మద్దతిచ్చారు. దీర్ఘకాలంగా నెలకొని వున్న వివక్ష నుండి ప్రజలను కాపాడేందుకు తీసుకున్న చర్యకు మద్దతిచ్చినందుకు ఆయేషా హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. కాగా కొయిలేషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా దీన్ని కాలిఫోర్నియా చరిత్రలో చీకటి రోజుగా అభివర్ణించింది. బిల్లును ప్రవేశపెట్టిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 700కి పైగా సమావేశాలు జరిగాయి. కుల సమానత్వ రక్షణల గురించి ప్రజలు గొంతెత్తి మాట్లాడారు. కుల వివక్షకు గురవుతున్న వారందరూ 20ఏళ్లుగా సంఘటితమై పోరాడుతునే వున్నారని, ఈనాటికి హింసాత్మక దాడులు, వివక్ష నుండి రక్షణ పొందే రోజు వచ్చిందని ఈక్విటీ ల్యాబ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తెన్‌మోయి సౌందరరాజన్ వ్యాఖ్యానించారు.

ఎస్సీ, ఎస్టీలకు కాంగ్రెస్ చేసిందేమి లేదు

- ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఎస్సీ, ఎస్టీల కోసం చేసిందేమి లేదని బీఆర్ఎస్ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ విమర్శించారు. మంగళవారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలను కాంగ్రెస్ ఏనాడు పట్టించుకోలేదని తెలిపారు.

బీఆర్ఎస్ ఆ వర్గాల కోసం దళిత బంధు తెచ్చిందనీ, పోడు సమస్యను పరిష్కరించిందని తెలిపారు. బీజేపీ నల్ల చట్టాలను తెచ్చి రైతుల చావులకు కారణమయిందని విమర్శించారు. మోటర్లకు మీటర్లు పెట్టాలని బీజేపీ ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.

దరఖాస్తుల పరిశీలనపై లొల్లి

- ఒకే కుటుంబంలో రెండు సీట్ల ప్రతిపాదనపై రేవంత్, ఉత్తమ్ వాగ్వాదం
- అభ్యర్థి పూర్తి వివరాలు పొందుపరచాలి
- అవసరమైతే నా సీటు బీసీలకు ఇస్తా : కోమటిరెడ్డి
- 4న స్క్రీనింగ్ కమిటీ రాక

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీలో దరఖాస్తుల లొల్లి మొదలైంది. టికెటు కోసం వెయ్యి మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పరిశీలించే క్రమంలో వాడీవేడిగా చర్చలు జరిగాయి. మంగళవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో దరఖాస్తులపై చర్చించేందుకు ప్రదేశ్ ఎలక్షన్ కమిటీ (పీఈసీ) సమావేశమైంది. ఒక్కో నియోజకవర్గానికి చెందిన అభ్యర్థులను పరిశీలించి, ముగ్గుర్ని ఖరారు చేసి, ఏఐసీసీ స్క్రీనింగ్ కమిటీకి పంపించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో సమావేశమైన పీఈసీ...అభ్యర్థుల పూర్తి వివరాలు లేకుండా ఎలా చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటుందంటూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రశ్నించినట్టు తెలుస్తోంది. అరకొర సమాచారాన్ని బట్టి ఖరారు చేయలేమని ఆయన తేల్చి చెప్పినట్టు తెలిసింది. అయితే ఒకే కుటుంబంలో రెండు టికెట్ల అంశంపై పీసీసీ అధ్యక్షులు ప్రతిపాదన చేయాలని ఉత్తమ్ పట్టుబట్టగా...తాను ఎలాంటి ప్రతిపాదన చేయబోననీ, ఆ విషయాన్ని అధిష్టానం చూసుకుంటుందని రేవంత్ అన్నట్టు తెలిసింది.

పీసీసీ అధ్యక్షుడిగా నిర్ణయం తీసుకోవాల్సిందేనని ఉత్తమ్ చెప్పగా.. తనను డిక్టేట్ చేయవద్దని రేవంత్ బదులిచ్చినట్టు సమాచారం. దీంతో ఆగ్రహించిన ఉత్తమ్ సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయినట్టు తెలుస్తోంది. అభ్యర్థుల విషయంలో ఎలాంటి స్పష్టత రాకపోవడంతో వచ్చే నెల 2వ తేదీన మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి కూడా జోక్యం చేసుకుని అన్ని విషయాలను సానుకూలంగా చర్చిస్తామని వివరణ ఇచ్చినట్టు సమాచారం. ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాత్రం మరోలా స్పందించినట్టు తెలిసింది. సామాజిక తరగతులకు సముచిత స్థానం ఇవ్వాలని ఆయన కోరారు. అవసరమైతే తన సీటును బీసీలకు ఇస్తామని వెల్లడించారు. ప్రతి పార్లమెంటుకు రెండు సీట్ల చొప్పున బలహీన వర్గాలకు ఇవ్వాల్సిందేనన్నారు. బీసీల విషయంలో సీఎం కేసీఆర్ చేసిన తప్పిదాన్ని కాంగ్రెస్ పార్టీగా మనం చేయకూడదని చెప్పారు. దరఖాస్తుల పరిశీలనపై కొన్ని నియమ, నిబంధనలు రూపొందించాలని మరికొంత మంది కోరినట్టు వినికిడి. ఏఐసీసీ నియమించిన స్క్రీనింగ్ కమిటీ వచ్చేనెల 4న హైదరాబాదు రానుందనీ,ఆ కమిటీతో పీఈసీ సమావేశమై దరఖాస్తులపై చర్చిద్దామన్న అభిప్రాయంతో సభ్యులు ఏకీభవించినట్టు తెలిసింది.

సమావేశానంతరం పార్టీ నేతలు సంపత్ కుమార్, బలరాం నాయక్, శివసేనా రెడ్డి, జితేందర్‌తో కలిసి టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ పీఈసీ సమావేశంలో దరఖాస్తు దారులకు పార్టీతో ఉన్న అనుబంధం, పార్టీలో చేరిన తేదీ, దరఖాస్తు చేసుకున్న, పాల్గొన్న పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై కార్యక్రమాలు చేపట్టిన అంశాలకు సంబంధించి దరఖాస్తులో పొందుపరచిన వాటిపై చర్చించినట్టు తెలిపారు. స్క్రీనింగ్ కమిటీ మూడు రోజులపాటు హైదరాబాద్‌లో ఉండి వివిధ స్థాయిల్లో పని చేస్తున్న నాయకత్వంతో మాట్లాడుతారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు తొలి జాబితాలో టిక్కెట్లు కేటాయించాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ తొలి సమావేశం హైదరాబాద్‌లో నిర్వహించాలని ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు లేఖ రాయాలని తీర్మానించినట్టు చెప్పారు. మొత్తం 119 నియోజకవర్గాల నుంచి 1006 దరఖాస్తులు వచ్చాయనీ, ఇల్లందు నియోజకవర్గానికి అత్యధికంగా 38 దరఖాస్తులు వచ్చాయన్నారు. కొడంగల్, జగిత్యాల నియోజకవర్గంలో కేవలం ఒక్కో దరఖాస్తు మాత్రమే వచ్చాయన్నారు.

తుమ్మల కాంగ్రెస్‌లో చేరాలనుకుంటున్నారు : మల్లు భట్టి విక్రమార్క

బీఆర్ఎస్ సీనియర్ నేత తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ పార్టీలో చేరాలనుకుంటున్నారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. ఆ పార్టీలో ఆయనకు టికెట్ రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురయ్యారని చెప్పారు. ఆయన్ను కాంగ్రెస్‌లోకి వస్తే సాదరంగా ఆహ్వానిస్తామని తెలిపారు. తమ పార్టీలోకి ఎవరొచ్చినా బేషరతుగా ఆహ్వానిస్తామన్నారు. మోడీ పాలనలో క్యాపిటలిస్టులు...కేసీఆర్ పాలనలో దొరలు మాత్రమే బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. వామపక్షాలు కూడా కాంగ్రెస్ తో కలిసి నడవాలని కోరారు.

ఆర్టీసీ 'రాఖీ' స్పెషల్

- మహిళలకు లక్కీ డ్రా
- రూ.5.50 లక్షల విలువైన బహుమతులు





నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాఖీ పౌర్ణమికి టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీ డ్రా ద్వారా రూ.5.50 లక్షలు విలువైన బహుమతుల్ని అందచేయనున్నట్టు ఆ సంస్థ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్, మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ తెలిపారు. ప్రతి రీజియన్ పరిధిలో ముగ్గురికి చొప్పున మొత్తం 33 మందికి బహుమతులు ఇస్తారు. ఈ నెల 30, 31 తేదీల్లో టీఎస్‌ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలందరూ ఈ లక్కీడ్రాలో పాల్గొనవచ్చు. ప్రయాణం పూర్తయ్యాక టికెట్ వెనకాల పేరు, వారి ఫోన్ నంబర్ రాసి, వాటిని బస్టాండ్లలో ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలి. వాటన్నింటినీ ఒక చోటికి చేర్చి ప్రతి రీజియన్ పరిధిలో లక్కీ డ్రా నిర్వహించి, ముగ్గురు విజేతలను అధికారులు ఎంపికచేస్తారు.

వారికి ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేస్తామని వారు వివరించారు. "మహిళలకు రాఖీ పౌర్ణమి ఎంతో ప్రత్యేకమైంది. అత్యంత పవిత్రంగా ఈ పండుగను వారు జరుపుకుంటారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి మరీ తమ సోదరులకు రాఖీలు కడుతుంటారు. వారి ఆత్మీయత, అనురాగాలకు గుర్తుగా పండుగ నాడు లక్కీడ్రా నిర్వహించాలని నిర్ణయించాం" అని వారు తెలిపారు. సెప్టెంబర్ 9వ తేదీ లోపు లక్కీ డ్రాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేస్తామన్నారు. ఇతర వివరాలకు టీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 ఫోన్ చేయాలని సూచించారు.

పటానుచెరుతో పాటు మరో స్థానం కేటాయించండి

- సీఎంకు నీలం మధు వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వచ్చే ఎన్నికల్లో ముదిరాజ్ కులస్థులకు సముచిత స్థానం కల్పించాలని నీలం మధు ముదిరాజ్ బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం హైదరాబాద్‌లోని ప్రగతి భవన్‌లో సీఎంను కలిశారు. తమ సామాజిక వర్గానికి రెండు అసెంబ్లీ సీట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పటానుచెరుతో పాటు మరో స్థానం ఇవ్వాలని కోరారు. ముదిరాజ్ సామాజిక వర్గాన్ని బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలనీ, ప్రభుత్వ పదవుల్లోనూ అవకాశం ఇవ్వాలని కోరారు. అమెరికా నుంచి మంత్రి కేటీఆర్ వచ్చిన తర్వాత ఈ విషయంపై చర్చిస్తామంటూ సీఎం హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.


ఏ సమయంలోనైనా .. లోక్‌సభ ఎన్నికలు : నితీశ్‌కుమార్

పాట్నా : 2024 లోక్‌సభ ఎన్నికలు ఏ సమయంలోనైనా ముందస్తుగానే జరగవచ్చని బిహార్ ముఖ్యమంత్రి, జెడియు నితీశ్‌కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రతిపక్ష పార్టీల ఐక్యత నేపథ్యంలో తమకు మరింత నష్టం జరుగుతుందని బిజెపి భయపడుతోందని.. అందువల్ల ముందుగానే ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉందన్నారు. నలంద ఓపెన్ యూనివర్సిటీ ప్రారంభోత్సవం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. అధికార ఎన్‌డిఎ ముందస్తుగానే లోక్‌సభ ఎన్నికలకు వెళ్లే అవకాశం ఉందని ఏడెనిమిది నెలల నుంచే చెబుతున్నానన్నారు. బిజెపిని ఓడించేందుకు అన్ని ప్రతిపక్ష పార్టీలు కచ్చితంగా ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిపక్షాలను ఏకతాటిపైకి తీసుకురావడం వెనుక తనకు ఎలాంటి పదవీకాంక్షలేదని మరోసారి స్పష్టంచేస్తున్నానన్నారు. ఎన్నికలకు ముందు సాధ్యమైనన్ని పార్టీలను బిజెపికి వ్యతిరేకంగా ఏకం చేయడమే తన కోరిక అన్నారు. ఇండియా వేదికలోకి మరికొన్ని పార్టీలు రాబోతున్నాయంటూ ఇటీవల వ్యాఖ్యానించిన ఆయన ఆ వివరాలు వెల్లడించేందుకు నిరాకరించారు. అలాగే, రాష్ట్రంలో కులగణన ప్రక్రియ పూర్తయిందన్న బీహార్ ముఖ్యమంత్రి త్వరలోనే వాటిని ప్రచురించనున్నట్టు వెల్లడించారు. వివరణాత్మక డేటా ప్రచురించాక, ఇతర రాష్ట్రాలు సైతం దీన్ని కచ్చితంగా అనుసరిస్తాయని తాను భావిస్తున్నట్టు చెప్పారు. కులాల వారీగా సర్వే చేయాలన్న నిర్ణయాన్ని రాష్ట్రంలో బిజెపి సహా అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా తీసుకున్నట్టు చెప్పారు.

జాదవ్‌పూర్ యూనివర్సిటీలో ఉద్రిక్తత

- ఎస్ఎఫ్ఐ విద్యార్థుల ఆందోళన

కొల్‌కతా : తాత్కాలిక వైస్ ఛాన్సలర్ బుద్ధదేవ్ సాకు వ్యతిరేకంగా పశ్చిమ బెంగాల్‌లోని జాదవ్‌పూర్ యూనివర్సిటీ విద్యార్థులు మంగళవారం ఆందోళనకు దిగారు. దీంతో విశ్వవిద్యాలయంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. క్యాంపస్‌లో ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఏ నిర్ణయం తీసుకోవాలన్నా యూనివర్సిటీ అధికారులు సంబంధిత వ్యక్తులందరితోనూ చర్చించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. యూనివర్సిటీ వీసీ సోమవారం పరిపాలనా భవనం నుండి బయటికి వెళుతుండగా ఎస్ఎఫ్ఐకి చెందిన ఆర్ట్స్ ఫ్యాకల్టీ స్టూడెంట్స్ యూనియన్ విద్యార్థులు ఆయన్ని అడ్డుకొని తమ డిమాండ్‌ను వినిపించారు.



సొసైటీలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించండి

కమిషనర్ వంగాల సుమిత్రకు జీఎంపీఎస్ వినతి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా గొర్రెల పెంపకందార్ల సహకార సంఘాలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవిందర్ డిమాండ్ చేశారు. మంగళశారం హైదరాబాద్‌లో రాష్ట్ర సహకార ఎన్నికల కమిషనర్ వంగాల సుమిత్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉడుత రవిందర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 8,135 ప్రాథమిక గొర్రెల పెంపకందార్ల సహకార సంఘాలున్నాయని తెలిపారు. వాటిలో ఎక్కువ శాతం సంఘాల పాలకవర్గాల పదవీ కాలం పూర్తయినప్పటికీ ఎన్నికలు నిర్వహించలేదని చెప్పారు. గతంలో పశుసంవర్థక శాఖ పరిధిలో నిర్వహించే ఎన్నికల ప్రక్రియను సహకార శాఖకు బదిలీ చేశారన్నారు. వాటి మధ్య సమన్వయం లేదని విమర్శించారు. కొత్తగా రూపొందించిన నిబంధనల ప్రకారం ఫోటో ఓటర్ల జాబితా తయారు చేయడం ఆలస్యమవుతున్నదని చెప్పారు. ఎలాంటి లావాదేవీలు లేని గొర్రెల పెంపకందార్ల సంఘాలకు రహస్య బ్యాలెట్ ద్వారా నిర్వహించే ప్రక్రియను తీసుకొచ్చారని విమర్శించారు. ఆ ఎన్నికల నిర్వహణకు అయ్యే ఖర్చులు అయా సొసైటీలపై వేయడం సరైంది కాదన్నారు. గ్రామస్థాయి సభ్యులకు, కొంతమంది అధ్యక్షులకు వీటిపై సరైన అవగాహన లేదని చెప్పారు. కొత్తగా ఏర్పడిన జిల్లాల ప్రతిపాదికన జిల్లా యూనియన్లను ఏర్పాటు చేసే ప్రక్రియ ప్రారంభించలేదని తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ ఆలస్యం కావడం వల్ల ఇప్పటికే ఈ సొసైటీలు డీసీసీబీ ఎన్నికల్లో ఓటు హక్కును కోల్పోయారని తెలిపారు. ఎప్పటికైనా ఎన్నికల కమిషన్ స్పందించి ఈ ఎన్నికలను సమన్వయం చేసేందుకు జిల్లాకొక అధికారిని ప్రత్యేకంగా కేటాయించాలని డిమాండ్ చేశారు.

ఓటర్ల జాబితా తయారీ సులభతరం చేసి, ఎన్నికల ఖర్చులు తగ్గించి ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఓటర్ల జాబితా రూపకల్పనకు స్పెషల్ డ్రైవ్ ద్వారా ఎన్నికలు నిర్వహించాలన్నారు. కొత్త జిల్లాల ప్రతిపాదికన జిల్లా యూనియన్లు ఏర్పాటు చేసి జిల్లా ఎన్నికలు కూడా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ డైరెక్టర్ స్పందిస్తూ ఈ విషయాన్ని ప్రభుత్వం దష్టికి, సహకార ఎన్నికల సంస్థ దష్టికి తీసుకెళ్లి త్వరలోనే ఎన్నికలు నిర్వహించేలా ప్రయత్నం చేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కాడబోయిన లింగయ్య, తుషాకుల లింగయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శులు మద్దెపురం రాజు, అమీర్‌పేట్ మల్లేష్, కాల్వ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రెజరీ జీతాల్లేవు

హెల్త్ కార్డులు రాలేదు

- హామీలిచ్చి మరిచిన బీఆర్ఎస్
- జీవో నెంబర్ 317 వర్తింపు ఎప్పటికో..
- పదోన్నతుల కోసం ఎదురుచూపులే
- వైద్య విధాన పరిషత్‌లోని ఉద్యోగుల దుస్థితి ఇది



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హామీలిచ్చిన పార్టీ రెండు సార్లు అధికారంలోకి వచ్చింది. వాటిని ప్రభుత్వం అమలు చేస్తుందని ఉద్యోగులు ఎదురు చూస్తూనే ఉన్నారు. ఈలోగా పదేండ్లు గడిచిపోయాయి. ఈ లోపు పొరుగు రాష్ట్రం అదే పని చేస్తున్న వారి డిమాండ్లను పరిష్కరించింది. ఇక్కడి ఉద్యోగులు మాత్రం ఇప్పటికీ ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ రాత్రింబవళ్లు తిరుగుతూనే ఉన్నారు. డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది... ఆ విభాగంలో పని చేస్తున్న వారందరి పరిస్థితి ఇదే. గతంలో ఎవరికి వారుగా కేడర్ల వారిగా డిమాండ్ల సాధన కోసం ప్రయత్నించినా వారంతా జేఏసీగా ఏర్పడి పోరాడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో టీఆర్ఎస్ (నేడు బీఆర్ఎస్) ఇచ్చిన హామీల అమలు కోసం తెలంగాణ వైద్య విధాన పరిషత్‌లోని ఉద్యోగులు ఆందోళన కొనసాగిస్తున్నారు. ట్రెజరీ జీతాలు రాక, హెల్త్ కార్డులు లేక, జీవో నెంబర్ 317 వర్తించక, సమయానికి పదోన్నతులు రాక ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. టీవీవీపీ కమిషనర్‌కు పదే పదే వినతిపత్రాలు సమర్పించడం, ఆ పత్రాలు స్వీకరించిన కమిషనర్, తాను ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపానని చెప్పడం పరిపాటిగా మారింది.

తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలో రాష్ట్రంలో దాదాపు 174 ఆస్పత్రులున్నాయి. ఈ విభాగంలో రెగ్యులర్ డాక్టర్లు, సిబ్బంది సుమారుగా ఐదు వేల మందికిపైగా పని చేస్తున్నారు. వీరితో పాటు మరో వెయ్యి మందికి పైగా వరకు కాంట్రాక్టు పద్ధతిలో, రెండు వేల మందికిపైగా పొరుగుసేవల ప్రాతిపదికన పని చేస్తున్నారు.

ఈ విభాగంలో పని చేస్తున్న వీరు ప్రభుత్వ ఉద్యోగులే అయినప్పటికీ 010 పద్దు ద్వారా ట్రెజరీ ద్వారా జీతాల్లేకపోవడంతో పాటు, వైద్యారోగ్యశాఖలో పని చేస్తున్నా... హెల్త్ కార్డులకు నోచుకోలేదు. దీంతో ఉద్యోగులు కానీ, వారి కుటుంబ సభ్యులు కాని అనారోగ్యం పాలై ప్రయివేటు, కార్పొరేటు ఆస్పత్రికెళితే లక్షలాది రూపాయలను వెచ్చించాల్సి వస్తుందని వాపోతున్నారు. గతంలో సాక్షాత్తు అధికార పార్టీ అనుబంధ మెడికల్ యూనియన్ నాయకుని తండ్రి విషయంలో జరిగిన విషయాన్ని ఆ నాయకుడే చెబుతూ ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.

సమస్యకు పరిష్కారం లేదా?

ప్రత్యేక చట్టం ద్వారా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో వైద్యవిధాన పరిషత్‌ను ఏర్పాటు చేశారు. వైద్యారోగ్యశాఖలో మిగిలిన విభాగాల్లో పని చేసే ఉద్యోగులకు మాదిరిగా 010 పద్దు ద్వారా ట్రెజరీ జీతాలు, హెల్త్ కార్డులు వీరికి వర్తించడం లేదు.

2014కు ముందు తెలంగాణ ఉద్యమ సమయం నుంచే ఆ సౌకర్యాలను వర్తింపజేసేందుకు చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ హామీ ఇచ్చింది. అయితే 2014 ఎన్నికల తర్వాత ఆ హామీని నెరవేర్చలేదు. రెండో సారి అధికారంలోకి వచ్చాక అయినా ... తమ డిమాండ్లు పరిష్కరిస్తారని ఆశించిన ఉద్యోగులకు నిరాశే మిగిలింది. 1999 బ్యాచ్ కి చెందిన స్టాఫ్ నర్సులకు, ఇతర సిబ్బందికి పదోన్నతులు లేక జీవో 317 అమలు కాక ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈనెల 31 వరకే డీపీసీ(డిపార్ట్మెంటల్ ప్రమోషన్ కమిటీ) కాల పరిమితి ముగుస్తుందని ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

వెంటనే పదోన్నతులు కల్పించాలి

ఉద్యోగులందరికి వెంటనే పదోన్నతులు కల్పించాలనీ, 317 జీవోను అమలు చేయాలని జేఏసీ కోర్ కమిటీ సభ్యులు భైరపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వివిధ జిల్లాల్లో పని చేస్తున్న జిల్లా క్యాడర్ పోస్టులకు పదోన్నతులు ఇచ్చి 37 జీవోను అమలు చేయాలని కోరారు. లేకపోతే పరిషత్‌లో పని చేస్తున్న ఉద్యోగులందరం ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

లైంగిక దాడి ఘటనపై సమగ్ర నివేదిక ఇవ్వాలి

- గవర్నర్ తమిళి సై సౌందరరాజన్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నానక్‌రామ్‌గూడలో మహిళపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనపై గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, పోలీస్ కమిషనర్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ నుంచి 48 గంటల్లోపు సమగ్ర నివేదికను అందించాలని ఆమె ఆదేశించారు.

లైంగిక దాడి, హత్య అత్యంత దుర్మార్గం
మహిళా కమిషన్ సీరియస్

హైదరాబాద్ నానక్‌రామ్‌గూడలో మహిళపై లైంగిక దాడి, హత్యపై తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునితా లక్ష్మారెడ్డి సీరియస్ అయ్యారు. ఈ ఘటనను తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ సుమోటోగా స్వీకరించిందని కమిషన్ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. దారుణానికి పాల్పడిన వారిని తక్షణమే పట్టుకుని కఠినంగా శిక్షించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను సునితా లక్ష్మారెడ్డి ఆదేశించారు. వెంటనే సమగ్ర విచారణ జరిపి ఘటనపై మహిళా కమిషన్ కు నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

నేడు పట్నం పదవీ బాధ్యతల స్వీకరణ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రిగా పట్నం మహేందర్ రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు. ఈనెల 24 న రాష్ట్ర మంత్రిగా ఆయన ప్రమాణ స్వీకారం చేసిన సంగతి విదితమే. సచివాలయంలోని మొదటి అంతస్తులో ఏర్పాటు చేసిన కార్యాలయంలో మధ్యాహ్నం రెండు గంటలకు ఆయన పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు. కాగా మహేందర్ రెడ్డి ని సమాచార శాఖ అధికారులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.ఆ శాఖ డైరెక్టర్ బి. రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లీ, జాయింట్ డైరెక్టర్లు జగన్, శ్రీనివాస్, వెంకట రమణ, డీడీ లు మధు సూధన్, రాజా రెడ్డి, సీఐఈ రాధ కిషన్, మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర్ రావు తదితరులు మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షునిగా కె.లక్ష్మణ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ ములుగు జిల్లా అధ్యక్షునిగా కె. లక్ష్మణ్ రావును, పార్టీ జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు నియమించారు. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జేబుల్ని గుల్ల చేయడమే..

- ఎల్పీజీ సిలిండర్ ధరలపై కల్వకుంట్ల కవిత ట్వీట్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'ఇది కానుక కాదు. సామాన్య ప్రజల జేబులను గుల్ల చేసి దగా చేయడమే'. ప్రజల భావోద్వేగాలతో ఆడుకోవడమేనని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం ట్వీట్ చేశారు. వంట గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి, నామమాత్రంగా తగ్గించి, ఎంతో లబ్ధి చేశామని కేంద్ర ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటున్నదని విమర్శించారు. పదేండ్లలో బీజేపీ ప్రభుత్వం ఎల్పీజీ సిలిండర్‌పై రూ.800 పెంచి తాజాగా కేవలం రూ. 200 మాత్రమే తగ్గించిందని ఆమె పేర్కొన్నారు.

1,827 పోస్టులను ఆ నోటిఫికేషన్‌లో కలపాలి

- మంత్రి హరీశ్ రావుకు స్టాఫ్ నర్సుల వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 5204 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఆర్థికశాఖ అనుమతించిన 1,827 పోస్టులను విలీనం చేయాలని పలువురు స్టాఫ్ నర్సులు కోరారు.

ఈ మేరకు మంగళవారం వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 7,031 పోస్టులను భర్తీ చేయడం ద్వారా ఆస్పత్రుల్లో రోగుల సేవలకు అంతరాయం కలగకుండా ఉంటుందనీ, ప్రభుత్వానికి మరో నోటిఫికేషన్ వేసే భారం కూడా తప్పుతుందని సూచించారు. గతంలో టీఎస్పీఎస్సీ 2017 స్టాఫ్ నర్సు నోటిఫికేషన్‌లో మొదట 1,196 భర్తీ చేస్తున్నట్టు ప్రకటించి ఆ తర్వాత మరి కొన్ని పోస్టులను కలపడం ద్వారా 3,311 పోస్టులను భర్తీ చేసిందని వారు గుర్తుచేశారు. మంత్రికి వినతిపత్రం అందించిన వారిలో స్టాఫ్ నర్సులు కురుమేటి గోవర్ధన్, ప్రశాంతి, సంతోష్, రజిత, సరిత, అన్నమయ్య తదితరులున్నారు.

1,159 స్పెషలిస్టులకు పోస్టింగ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని 25 జిల్లాల్లో ఉన్న 26 ప్రభుత్వ మెడికల్ కాలేజీల ఆస్పత్రుల్లో 1,159 స్పెషలిస్ట్ వైద్యులకు కంపల్సరీ గవర్నమెంట్ సర్వీస్ కింద, ఏడాది కాలం పాటు పోస్టింగ్ ఇస్తూ రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ కె.రమేశ్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. పీజీ వైద్య విద్య పూర్తి చేసిన వారు తప్పని సరిగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏడాది కాలం పాటు పని చేయాల్సి ఉంటుంది. జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థో, గైనిక్, ఈఎన్‌టీ, అనస్థీషియా సహా మొత్తం 24 రకాల స్పెషాలిటీ వైద్య సేవలు వీరి ద్వారా ప్రజలకు అందించబోతున్నారు. స్పెషాలిటీ వైద్యులకు నెలకు రూ. 92,575 స్టైఫండ్‌గా ప్రభుత్వం చెల్లిస్తున్నది.

చేవెళ్ల రేసులో నంది ఎల్లయ్య వారసుడు

- టికెట్ కోసం దరఖాస్తు చేసిన నంది నరహరి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల (ఎస్సీ) అసెంబ్లీ టికెట్ రేసులో మాజీ ఎంపీ, సీనియర్ కాంగ్రెస్ నేత నంది ఎల్లయ్య వారసుడు నంది నరహరి నిలిచారు. ఈ స్థానం నుంచి తనను అభ్యర్థిగా ప్రకటించాలని కోరుతూ ఆయన దరఖాస్తు చేసుకున్నారు. ఏడు సార్లు లోక్‌సభ, రెండు సార్లు రాజ్యసభ సభ్యుడిగా పని చేసిన నంది ఎల్లయ్య వెంటే తన జీవిత కాలమంతా కాంగ్రెస్‌లో పని చేశాననీ, తనకు పోటీ చేసే అవకాశం ఇవ్వాలని పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ ముఖ్య నాయకులను కోరారు. బీఆర్ఎస్‌లో చేరితే రాజకీయంగా అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చినా కాంగ్రెస్ ఫ్యామిలీలోనే కొనసాగామనీ, తమ విధేయతను పార్టీ హైకమాండ్ గుర్తించాలని విజ్ఞప్తి చేశారు.

పరస్పరం సహకరించుకోవాలి

- మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ, అమెరికాలోని అయోవా రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అమెరికా పర్యటనలో ఉన్న మంత్రి అయోవా రాష్ట్ర రాజధాని డెమోయిన్ నగరంలో రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్ ఆడమ్ గ్రెగ్‌ను కలిశారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలు సాధించిన ప్రగతిని వివరించారు. అయోవా, తెలంగాణ మధ్య అనేక విషయాల్లో సారూప్యత ఉందని తెలిపారు. అనంతరం మంత్రి అయోవా స్టేట్ యూనివర్సిటీ క్యాంపస్ ను సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఇరు విశ్వవిద్యాలయాలు తాము చేస్తున్న పరిశోధనల విషయంలో కూడా పరస్పరం సహకరించుకోవాలనే విషయంపై చర్చించారు.

కొత్తగా 20 కేజీబీవీలు మంజూరు

495కు చేరిన సంఖ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో కొత్తగా మరో 20 కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ) మంజూరయ్యాయి. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మంగళవారం ఉత్తర్వులు (జీవోనెంబర్ 24) విడుదల చేశారు. వాటి ఏర్పాటుకుగాను రికరింగ్ బడ్జెట్‌గా రూ.60 లక్షలను సైతం మంజూరుచేసినట్టు తెలిపారు. జిల్లాల విభజనతో రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా పలు మండలాలను ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఆయా కొత్త మండలాల్లో కేజీబీవీలను ఏర్పాటు చేయాల్సి ఉంది. కొత్తగా 20 కేజీబీవీలను నెలకొల్పాల్సింది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో 2014లో రాష్ట్రంలో కేవలం 391 కేజీబీవీలుండేవి. 2017-18లో కొత్తగా 84 కేజీబీవీలను ప్రభుత్వం మంజూరుచేసింది. దీంతో రాష్ట్రంలో కేజీబీవీల సంఖ్య 475కి చేరింది. తాజాగా మరో 20 కేజీబీవీలు మంజూరు చేయడంతో వాటి సంఖ్య 495కు చేరింది. 245 కేజీబీవీల్లో ఇంటర్, మిగిలిన 230 కేజీబీవీల్లో పదో తరగతి విద్యార్థినిలు చదువుతున్నారు.

కొత్త కేజీబీవీలు...

మావల (ఆదిలాబాద్), బీర్‌పూర్, బుగ్గారం (జగిత్యాల), కొత్తపల్లి, గన్నేరువరం (కరీంనగర్), దంతాలపల్లి (మహబూబాబాద్), మహ్మదాబాద్ (మహబూబ్‌నగర్), నార్సింగి, నిజాంపేట, హవేలి ఘన్‌పూర్ (మెదక్), నిజామాబాద్ (సౌత్), నిజామాబాద్ (నార్త్), నాగిలిగిద్ద, మొగ్గుంపల్లి, వట్‌పల్లి, గుమ్మడిదల, చౌటకూరు (సంగారెడ్డి), దూల్మిట్ట (సిద్ధిపేట), చౌడాపూర్ (వికారాబాద్).

ఈసెట్ ప్రత్యేక కౌన్సెలింగ్ జరపాలి

- విద్యాశాఖ కార్యదర్శికి ఎస్ఎఫ్ఐ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈసెట్ అభ్యర్థులకు ప్రత్యేక విడత కౌన్సెలింగ్ ప్రక్రియను జరపాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణను మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్, ఓయూ కార్యదర్శి ఎం రవినాయక్, రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్ కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈసెట్ అభ్యర్థుల కోసం రెండు విడతలుగా కౌన్సెలింగ్ నిర్వహించారని తెలిపారు. చాలా మంది అభ్యర్థులకు సీట్లు వచ్చినా కాలేజీల్లో రిపోర్టు చేయలేకపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం విడుదల చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొన్నారు. దీంతో ప్రయివేటు పాలిటెక్నిక్ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు ధ్రువపత్రాలను సకాలంలో ఇవ్వడం లేదని తెలిపారు. ఫీజు చెల్లించి ధ్రువపత్రాలను తీసుకెళ్లాలంటూ విద్యార్థులకు చెప్పడంతో వారు డబ్బులు కట్టలేక ధ్రువపత్రాలను తెచ్చుకోలేదని వివరించారు. అందుకే సీటు వచ్చినా కేటాయించిన కాలేజీల్లో చేరలేదని తెలిపారు. అయితే ఈసెట్ అభ్యర్థులకు ఏపీలో మూడుసార్లు కౌన్సెలింగ్ జరిగిందని గుర్తు చేశారు. తెలంగాణలో అనేక ఇబ్బందులు పడుతున్న అభ్యర్థుల కోసం మరోసారి కౌన్సెలింగ్‌ను జరపాలని కోరారు.

ఆధార్, ఫింగర్ ప్రింట్స్ చోరీ..

- సిలికాన్ వేలిముద్రలతో నగదు విత్‌డ్రా
- ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన సీఐడీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

సైబర్ నేరగాళ్లు రెచ్చి పోతున్నారు. బాధితులకు తెలియకుండానే నకిలీ ఫింగర్ ప్రింట్స్‌తో ఆన్‌లైన్‌లో నగదును విత్ డ్రా చేస్తున్న ముఠాలోని మరో ఇద్దరిని సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. మంగళవారం సీఐడీ అదనపు డీజీపీ మహేష్‌భగవత్ తెలిపిన వివరాల మేరకు.. బీహార్‌కు చెందిన రంజిత్ సాహ, సఫత్ ఆలం మరికొందరితో కలిసి ఒక ముఠాగా ఏర్పడ్డారు. వీరు గతేడాది డిసెంబర్‌లో హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ఉద్యోగి ఖాతాలో నుంచి విడతల వారీగా రూ.24వేలు డ్రా చేశారు. అతని ప్రమేయం లేకుండానే ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ కావడంతో బాధితుడు సీఐడీ సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దర్యాప్తు చేపట్టిన అధికారులు.. నిందితులు ఫేక్ ఫింగర్ ప్రింట్స్‌ను ఉపయోగించినట్టు గుర్తించారు. రిజిస్ట్రేషన్లు, రెవెన్యూ శాఖ వెబ్‌సైట్ల నుంచి సేల్ డీడ్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని వాటిలో ఉన్న ఫింగర్ ప్రింట్స్, ఆధార్ నంబర్లు, బ్యాంక్ వివరాలు, ఫోన్ నెంబర్లు నిందితులు సేకరించినట్టు గుర్తించారు. ఆ తర్వాత కంప్యూటర్లలో వాటిని స్కాన్ చేసి సిలికాన్ వేలిముద్రలు తయారు చేసుకొని.. వాటి సహాయంతో బాధితులకు తెలియకుండానే కస్టమర్ సర్వీస్ పాయింట్ మిషన్లలో బాధితుల బ్యాంక్‌లోని నగదును దోచుకుంటున్నారు. విచారణ చేపట్టిన పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వీరికి సహకరించిన కస్టమర్ సర్వీస్ అధికారులపై విచారణ కొనసాగిస్తున్నారు. ఈ ముఠా పలుచోట్ల ఈ తరహా మోసాలకు పాల్పడినట్టు సీఐడీ అధికారుల దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు అక్రమ్‌ను సీఐడీ అధికారులు గతేడాది డిసెంబర్‌లోనే అరెస్ట్ చేశారు. చాకచక్యంగా కేసును ఛేదించినందుకు పోలీస్ అధికారులను మహేష్‌భగవత్ ప్రత్యేకంగా అభినందించారు.

ప్రజల సొంతింటి కలలు నెరవేర్చండి

- వారి హక్కులకు భంగం కల్గించొద్దు
- రియల్టర్లకు 'రెరా' చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ హెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రజల సొంతింటి కలల్ని నెరవేర్చడంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లు ప్రమాణాలు పాటించాలనీ, కొనుగోలుదారుల హక్కులకు ఎలాంటి భంగం కలిగించొద్దని తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా) చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ హెచ్చరించారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు పూర్తి పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేయాలని సూచించారు. అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటి అండ్ అవేర్‌నెస్, రెరా సంయుక్తాధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లకు జరిగిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రకటనలు జారీ చేసి, వ్యాపార కార్యక్రమాలు చేయొద్దని చెప్పారు. 'రెరా' చట్టం కొనుగోలు దారుల హక్కులను పరిరక్షించడంతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారుల బాధ్యతలను కూడా గుర్తు చేస్తుందన్నారు. వ్యవసాయ రంగం తర్వాత భవన నిర్మాణ రంగానికే అత్యంత ప్రాధాన్యత ఉన్నదని తెలిపారు. సొంతింటి కోసం కొనుగోలుదారులు తమ ఆదాయంలో 77శాతం వెచ్చించడాన్ని బట్టి రియల్ ఎస్టేట్ రంగానికి ఎంతటి ప్రాధాన్యత ఉందో గుర్తించాలని చెప్పారు. మంచికంటే కూడా చెడు ఎక్కువ ప్రభావం చూపుతుందనీ, అందువల్ల వ్యాపారులు, ఏజెంట్లు కొనుగోలుదారుల విశ్వాసాన్ని కోల్పోవద్దని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న 'రెరా' సభ్యులు కే శ్రీనివాసరావు, కే లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణ కోసం రెరా పని చేస్తుందన్నారు. దేశ, రాష్ట్ర ఆర్థికవృద్ధిలో నిర్మాణరంగ పాత్ర ప్రధానమైందని గుర్తుచేశారు. క్రెడాయ్ అధ్యక్షులు పీ రామకృష్ణారావు మాట్లాడుతూ రెరా చట్టాన్ని అన్ని వర్గాల వారు అవగాహన చేసుకోవాలనీ, ఈ రంగంలో అందరూ వినియోగదారులేనని స్పష్టం చేశారు. సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా రియల్టర్లు బాధ్యతతో పనిచేయాలని చెప్పారు. ఈ సందర్భంగా 'రెరా' చైర్మెన్ స్వయంగా రెరా చట్టంలోని పలు సెక్షన్లపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. పలువురు బిల్డర్ల సందేహాలకు సమాధానాలు చెప్పారు. కార్యక్రమంలో అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అవేర్నెస్ సంస్థ వ్యవస్థాపకులు హజీద్ సుల్తాన్ అలీ, మేనేజర్ శివకుమార్, నేషనల్ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్, రెరా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సురభి సత్తయ్య, జాయింట్ డైరెక్టర్ అశ్విని, పీఆర్వో పీ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ

రియల్ ఎస్టేట్‌కు సంబంధించిన ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి వీడియో కాన్ఫరెన్స్ విధానాన్ని రెరా చైర్మెన్ డాక్టర్ ఎన్ సత్యనారాయణ ప్రారంభించారు. మంగళవారంనాడిక్కడి రెరా ప్రధాన కార్యాలయంలో సభ్యులు జే లక్ష్మీనారాయణ, కే శ్రీనివాసరావులతో కలిసి ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీపై ఆన్‌లైన్‌లో విచారణ జరిపారు. ఫిర్యాదుదారులు ప్రపంచంలో ఏ మూలన ఉన్నా, వృద్ధాప్యంలో ఉండి విచారణకు హాజరు కాలేని పరిస్థితుల్లో ఉన్నా, ఫిర్యాదుదారుడు ఇచ్చిన అర్జీ మేరకు వర్చువల్ విధానంలో హియరింగ్‌కు హాజరు కావచ్చునని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రెరా నిబంధనలు ఉల్లంఘించిన మూడు రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులకు షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. నాగోల్ చౌరస్తాలోని సుప్రజ ఆస్పత్రి సమీపంలో నాని డెవలపర్స్ పేరుతో కార్యాలయం ప్రారంభించి, రెరా రిజిస్ట్రేషన్ పొందకుండా శ్రీ లక్ష్మీనరసింహ కంట్రీ-3 పేరుతో ఆలేరు, యాదాద్రిలో వెంచర్లు చేపట్టి కరపత్రాలు బ్రోచర్ల ద్వారా కొనుగోలుదారులను ఆకర్షిస్తూ ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారనీ, అలా చేయడం చట్టరీత్యా నేరమని పేర్కొంటూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. అలాగే ఖైరతాబాద్ ప్రేమ్ నగర్ కాలనీకి చెందిన ఆర్నా ఇన్ఫ్రా డెవలపర్స్‌కు కూడా నోటీసు జారీ చేశారు.

కార్మికుల పొట్టకొడుతున్న ప్రభుత్వం..

- గిరిజన హాస్టల్ డైలీవేజ్ వర్కర్ల సమస్యల పట్ల నిర్లక్ష్యం
- సెప్టెంబర్ 15 తర్వాత సమ్మె : సీఐటీయూ నేతలు బి మధు, వంగూరు రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గిరిజన హాస్టళ్లలో పనిచేస్తున్న కార్మికుల పొట్టకొట్టొద్దనీ, వారి సమస్యలను పరిష్కరించటంలో ప్రభుత్వం నిర్లక్షాన్ని వీడాలనీ, లేదంటే వచ్చే నెల 15 తర్వాత సమ్మె తప్పదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి బి మధు, కోశాధికారి వంగూరు రాములు హెచ్చరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని సంక్షేమ భవన్ ముందు హాస్టల్ డైలీవేజ్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ)ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం యూనియన్ కార్యదర్శి కె బ్రహ్మచారి అధ్యక్షతన జరిగిన సభలో మధు, రాములు మాట్లాడుతూ డైలీవేజ్ వర్కర్లను ఔట్ సోర్సింగ్ లోకి మార్చే ఆలోచనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. హాస్టల్ వర్కర్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలనీ, కళాశాల హాస్టళ్లలో క్యాటరింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. హాస్టల్ వర్కర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి ఎన్ని సార్లు తీసకొచ్చినా పట్టించుకోవటం లేదనీ, ఇది కార్మికుల పట్ల నిర్లక్ష్యం కాకపోతే మరేమిటని ప్రశ్నించారు. వారి సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం, అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. 30 ఏండ్లుగా పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకుండా, ప్రభుత్వం శ్రమ దోపిడీకి పాల్పడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. రూ.5వేల నుంచి రూ. 10వేల వేతనం చెల్లిస్తూ, వెట్టిదాకిరి చేయిస్తున్నారని విమర్శించారు. పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరారు. జీవో నెం. 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శాశ్వత స్వభావం కలిగిన పనిలో క్యాటరింగ్ విధానం తీసుకురావడం వల్ల కార్మికుల పొట్టగొట్టి కాంట్రాక్టర్లకు లబ్ది చేకూరుస్తున్నదని తెలిపారు. డైలీవేజ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఏడీ సర్వేశ్వరరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు యాటల సోమన్న, యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు టేకం ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్, నాయకులు సంగ్యా నాయక్, హీరాలాల్, ముత్తయ్య, కౌశల్య, పద్మ రాములు, కోటేష్, లక్ష్మణ్, జలంధర్, తిరుపతమ్మ, జయ, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

1న హెచ్ఐసీసీలో స్వతంత్ర భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలు

- ముఖ్యఅతిథిగా సీఎం కేసీఆర్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్వతంత్ర భారత వజ్రోత్సవ ముగింపు వేడుకలను వచ్చేనెల ఒకటిన హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. ఈ వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంగళవారం ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని ఆమె నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కేవీ రమణాచారి, దేశపతి శ్రీనివాస్, డీజీపీ అంజనీకుమార్‌లతో సహా పలువురు కార్యదర్శులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ ఈ వజ్రోత్సవ ముగింపు ఉత్సవాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారని అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం జరిగే ఈ సమావేశానికి రాష్ట్ర మంత్రులు, పార్లమెంటు సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ల చైర్మెన్లు, మేయర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్లు, జిల్లా పరిషత్ చైర్మెన్లు, జెడ్పీటీసీలు, మండల పరిషత్ అధ్యక్షులు. డీసీసీబీ, డీసీఎంఎస్, రైతు బంధు సమితిల అధ్యక్షులు, ఆల్ ఇండియా సర్వీస్ అధికారులతో సహా పలువురు ప్రముఖులు పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రంలో భాగంగా దాదాపు గంటసేపు దేశభక్తి, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని కలిగించే పలు సాంస్కృతిక కార్యక్రమాలుంటాయని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి సందేశం ఉంటుందని ఆమె వెల్లడించారు. ఈ వజ్రోత్సవ ముగింపు వేడుకలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సంబంధిత అధికారులందరూ విస్తృతస్థాయిలో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఆదర్శంగా క్రీడా పాలసీ

- క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్
- అట్టహాసంగా చలో మైదాన్



హైదరాబాద్ : దేశానికి ఆదర్శంగా నిలిచేలా, క్రీడాకారులకు ప్రోత్సాహం అందించేలా త్వరలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నూతన క్రీడా విధానాన్ని తీసుకు రానుందని క్రీడాశాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ అన్నారు. హాకీ మాంత్రికుడు, మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఎల్బీ స్టేడియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) నిర్వహించిన 'చలో మైదాన్' ముగింపు కార్యక్రమానికి మంత్రి శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'ఉమ్మడి రాష్ట్రంలో అన్ని రంగాల్లో నష్టపోయాం. స్వరాష్ట్రంలో ప్రతి నియోజకవర్గానికి ఓ స్టేడియం నిర్మించుకున్నాం. గ్రామీణ ప్రాంతాల్లో 18 వేల క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసుకున్నాం. గ్రామ స్థాయిలో క్రీడా పోటీల నిర్వహణకు అవసరమైన సమగ్ర స్పోర్ట్స్ కిట్‌ను సైతం అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటిన తెలంగాణ క్రీడాకారులు నిఖత్ జరీన్, ఇషా సింగ్‌లకు ఇంటి స్థలాలు, భారీ నగదు బహుమతి అందించాం. త్వరలోనే దేశానికి ఆదర్శంగా నిలిచేలా నూతన క్రీడా విధానాన్ని ప్రకటించబోతున్నామని' మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ మాట్లాడుతూ.. ' రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల కేంద్రాల్లో చలో మైదాన్ కార్యక్రమంలో భాగంగా క్రీడా యువ సమ్మేళనాలు, యువ చైతన్య సభలకు సుమారు లక్ష మంది యువత హాజరవటం గొప్ప విషయం. యువత క్రీడలను ఓ కెరీర్‌గా ఎంచుకునేందుకు చైతన్యదీపకిగా ఉండేలనే లక్ష్యంతో చలో మైదాన్ కార్యక్రమం నిర్వహించాం. తెలంగాణ క్రీడాకారుల విజయ గాథలను డాక్యుమెంటరీ రూపంలో యువతకు ప్రదర్శించాం. క్రీడా రంగంలో తెలంగాణను అగ్రగామిగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకంతో ముందుకెళ్తున్నాం. భవిష్యత్‌లో మన క్రీడాకారులు ఒలింపిక్స్‌లోనూ పతకాల పండించేందుకు అనువైన క్రీడా వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తున్నామని' అన్నారు. ఎల్బీ ఇండోర్ స్టేడియంలో జరిగిన చలో మైదాన్ ముగింపు కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం కార్యదర్శి జగదీశ్ యాదవ్, గీత కార్పోరేషన్ చైర్మెన్ పల్లె రవి కుమార్ గౌడ్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మెన్ మల్కా కొమురయ్య సహా క్రీడా సంఘాల ప్రతినిధులు, పారా ఒలింపియన్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



వేడుకగా క్రీడా దినోత్సవం

హాకీ దిగ్గజం ధ్యాన్‌చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం రాష్ట్ర వ్యాప్తంగా పండుగ వాతావరణంలో సాగింది. చలో మైదాన్‌లో భాగంగా 33 జిల్లాల కేంద్రాల్లో యువ చైతన్య సభలు నిర్వహించారు. యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారని శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు. 'గత ఆరు నెలల్లోనే రాష్ట్ర స్థాయి మహిళల చెస్ టోర్నీ, సీఎం కప్, ట్రైక్రీడా వేడుకలు సహా ఇప్పుడు చలో మైదాన్‌తో శాట్స్ యంత్రాంగం క్రీడాభివృద్ధిలో నిమగ్నమైంది. పల్లెల నుంచి ప్రపంచ చాంపియన్లు రావాలనే నినాదంతో రానున్న కాలంలో మరిన్ని క్రీడా పోటీల నిర్వహణకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని' శాట్స్ చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ అన్నారు.



ఆసియా వేట

- బరిలో నిలిచిన ఆరు జట్లు
- ఊరిస్తున్న భావోద్వేగ సమరాలు

నేటి నుంచి ఆసియా కప్

వేడెక్కిన వాతావరణం. భావోద్వేగ సమరాలు. మైదానంలో క్రికెటర్ల కవ్వింపు చర్యలు. సరిహద్దులు, సంస్కృతి సహా రక్త చరిత్ర పంచుకున్న నేపథ్యం ఉన్న ఆసియా దేశాలు.. నేటి నుంచి ఆసియా కప్ వేటకు సిద్ధమవుతున్నాయి. ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ ముంగిట ఆసియా క్రికెట్ పవర్‌హౌస్‌లు సన్నద్ధత సమరంగా ఆసియా కప్‌లో అదరగొట్టేందుకు ఎదురు చూస్తున్నాయి. డిఫెండింగ్ చాంపియన్‌గా శ్రీలంక బరిలో నిలువగా.. ఆసియా టైటిల్‌తో వరల్డ్‌కప్ వార్‌లోకి దిగాలనే ఆలోచనతో టీమ్ ఇండియా ఉంది. ఆరు దేశాల అద్వితీయ క్రికెట్ పోరు.. 2023 ఆసియా కప్ నేటి నుంచి ఆరంభం.

నవతెలంగాణ క్రీడావిభాగం

ఇప్పుడు 50 ఓవర్ల ఫార్మాట్‌లో..

2022లో సైతం ఆసియా కప్ జరిగింది. టీ20 ప్రపంచకప్ ముంగిట పొట్టి ఫార్మాట్‌లో జరిగిన ఆసియా కప్‌కు భారత్ ఆతిథ్యం ఇచ్చింది. కోవిడ్ పరిస్థితుల్లో యుఏఈ వేదికగా మ్యాచులు జరిగాయి. ఈ ఏడాది వన్డే వరల్డ్‌కప్ ఉన్న నేపథ్యంలో ఆసియా కప్ ఫార్మాట్ సైతం మారింది. ఆగస్టు 30న ముల్తాన్‌లో తొలి మ్యాచ్ ఆసియా కప్ ఆరంభం కానుంది. ఐసీసీ ప్రపంచకప్ అనంతరం ప్రపంచ క్రికెట్‌లో ఇదే అతిపెద్ద టోర్నమెంట్. ఆసియా అగ్ర దేశాలు ఆడే ఈ టోర్నీ 1984లో మొదలైంది. 2022 ఆసియా కప్ విజేతగా శ్రీలంక నిలిచింది. ఆసియా కప్‌ను భారత్ ఏడు సార్లు, శ్రీలంక ఆరు సార్లు గెల్చుకోగా.. పాకిస్థాన్ రెండు సార్లు సాధించింది. నేటి నుంచి 16వ ఆసియా కప్ ఆరంభం కానుంది.

పోటీలో ఆరు జట్లు

ఆసియా కప్ వేటలో ఆరు జట్లు నిలిచాయి. అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్, భారత్, పాకిస్థాన్, శ్రీలంక సహా నేపాల్ కప్ రేసులో నిలిచింది. నేపాల్ అసోసియేట్ సభ్య దేశం. ఆసియాకప్‌లో నేపాల్ తొలిసారి ఆడుతోంది. ఏసీసీ మెన్స్ ప్రీమియర్ కప్ విజేతగా నిలిచిన నేపాల్.. ఫైనల్లో యుఏఈపై గెలుపొంది అర్హత సాధించింది. ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో 15వ స్థానంలో కొనసాగుతున్న నేపాల్‌కు 20 ఏండ్ల కుర్రాడు రోహిత్ పాడెల్ నాయకత్వం వహిస్తున్నాడు.

టోర్నీ సాగుతుందిలా..!

ఆసియా కప్‌లో పోటీపడుతున్న ఆరు జట్లు తొలి దశలో రెండు గ్రూపులుగా విడిపోతాయి. గ్రూప్-ఏలో భారత్, పాకిస్థాన్, నేపాల్ ఉండగా.. గ్రూప్-బిలో అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక నిలిచాయి. గ్రూప్ దశలో ప్రతి జట్టు మరో జట్టుతో ఓ సారి ముఖాముఖి తలపడుతుంది. టాప్-2లో నిలిచిన జట్లు సూపర్-4 దశకు అర్హత సాధిస్తాయి. సూపర్4 దశలో ప్రతి జట్టు ఇతర మూడు జట్లతో ఓసారి ఆడనుంది. సూపర్4లో టాప్-2 నిలిచిన రెండు జట్లు ఫైనల్స్‌కు చేరుకుంటాయి. నేడు తొలి మ్యాచ్‌లో పాకిస్థాన్, నేపాల్ తలపడనుండగా.. సెప్టెంబర్ 17న కొలంబోలో ఫైనల్ జరుగుతుంది. మ్యాచులు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3 గంటలకు ఆరంభం అవుతాయి.

రసవత్తర భావోద్వేగాలు

ఆసియా కప్ అనగానే భారత్, పాకిస్థాన్ పోరే అందరికి గుర్తుకొస్తుంది. ఈ రెండు జట్లు తలపడితే రెండు దేశాల అభిమానులు, మైదానంలో ఆటగాళ్ల భావోద్వేగాలు సహజంగానే తారాస్థాయిలో ఉంటాయి. కానీ ఆసియా కప్ అంటే.. భారత్, పాక్‌కు పోరుకు మించిన భావోద్వేగ సమాహారం!. ఇటీవల కాలంలో పాకిస్థాన్, అఫ్గనిస్థాన్ మ్యాచ్‌లో మైదానం లోపల, వెలుపల అత్యంత ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక బంగ్లాదేశ్, శ్రీలంక మ్యాచ్‌లోనూ 'నాగిని' డ్యాన్స్ వైరం కొనసాగుతూనే ఉంది. బంగ్లాదేశ్, పాకిస్థాన్ మ్యాచ్ సైతం భావోద్వేగాలకు గురిచేసేదే. దీంతో వరల్డ్‌కప్‌కు మించిన నాటకీయత, భావోద్వేగతకు ఆసియా కప్ వేదికైంది.

హైబ్రిడ్ మోడల్ ఆతిథ్యం

ఆసియా కప్ తొలిసారి హైబ్రిడ్ మోడల్‌లో జరుగుతుంది. ఆతిథ్య హక్కులు పాకిస్థాన్‌కే దక్కినా.. భద్రతా కారణాల రీత్యా భారత జట్టు అక్కడికి వేళ్లేందుకు నిరాకరించింది. దీంతో 13 మ్యాచుల టోర్నీలో 4 నాలుగు మ్యాచులే పాకిస్థాన్‌లో జరుగుతుండగా.. 9 మ్యాచులకు శ్రీలంకలోని పల్లెకల్, కొలంబో వేదికగా నిలుస్తున్నాయి. పాకిస్థాన్‌లో నాలుగు మ్యాచులకు ముల్తాన్, లాహోర్‌లు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. పాకిస్థాన్ సొంతగడ్డపై గ్రూప్-ఏ మ్యాచ్, సూపర్ 4 మ్యాచ్ ఆడేలా షెడ్యూల్ చేశారు. భారత్ మినహా అఫ్గనిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకలు పాక్ గడ్డపై ఆడుతున్నాయి.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!!

ద్వైపాక్షిక క్రికెట్ అత్యంత క్షీణ దశకు చేరటంతో దాయాది జట్లు కేవలం ఏసీసీ, ఐసీసీ టోర్నీల్లోనే తలపడుతున్నాయి. చివరగా వన్డే ఫార్మాట్‌లో 2019 ప్రపంచకప్‌లోనే భారత్, పాక్ ఢీకొట్టాయి. 2019 వరల్డ్‌కప్ గ్రూప్ దశలో పోటీ పడిన అనంతరం.. ఇప్పుడే మళ్లీ వన్డేల్లో ముఖాముఖి సమరానికి సై అంటున్నాయి. భారత్, పాక్ ఫైనల్‌కు చేరుకుంటే.. ఆసియా కప్‌లో గరిష్టంగా మూడు సార్లు తలపడే అవకాశం ఉంది.

సూపర్-4 నుంచే రాహుల్

- గ్రూప్ దశ మ్యాచ్‌లకు ఫిట్‌గా లేడు
- చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వెల్లడి

ముగిసిన ఆసియా కప్ క్యాంప్



బెంగళూర్ : ఆసియా కప్ ముంగిట భారత క్రికెటర్ల ఆరు రోజుల శిక్షణ శిబిరం మంగళవారంతో ముగిసింది. బెంగళూర్ శివారులోని ఆలూర్‌లో జరిగిన క్రికెటర్ల క్యాంప్‌లో భారత ఆసియా కప్ జట్టు సన్నద్ధత కాగా.. నేడు రోహిత్‌సేన కొలంబోకు బయల్దేరి వెళ్లనుంది. ఆసియా కప్ క్యాంప్ ముగిసిన అనంతరం మీడియాతో మాట్లాడిన చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్.. కెఎల్ రాహుల్ ఆరంభ దశ మ్యాచులకు అందుబాటులో ఉండటం లేదని 'బాంబ్' పేల్చాడు. జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ)లోనే ఉండి ఫిజియో వద్ద శిక్షణ కొనసాగించనున్న కెఎల్ రాహుల్ సూపర్ 4 మ్యాచుల ఆరంభానికి జట్టుతో చేరతాడు. సెప్టెంబర్ 4న రాహుల్ ఫిట్‌నెస్ పరీక్షకు వెళ్లనుండగా.. నివేదిక ఆధారంగా ఎన్‌సీఏ చీఫ్ రాహుల్‌ను శ్రీలంకకు పంపించే విషయంలో సరైన నిర్ణయం తీసుకోనున్నారు.


రెండు మ్యాచులకే దూరం! : 'కెఎల్ రాహుల్ చాలా బాగా కోలుకుంటున్నాడు. జట్టు కోణంలో.. అతడు కేవలం రెండు మ్యాచులకు మాత్రమే దూరమవుతున్నాడు. రాహుల్ మంచిగా బ్యాటింగ్ చేస్తున్నాడు, వికెట్ కీపింగ్ చేస్తున్నాడు. ఎటువంటి సమస్య లేదు. కానీ ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నాం. రానున్న రోజుల్లో ఎన్‌సీఏలో మ్యాచ్ సిములేషన్స్‌పై దృష్టి పెడతాడు. రెండు మ్యాచ్‌ల అనంతరం రాహుల్ టీమ్ సెలక్షన్‌కు అందుబాటులోకి వస్తాడని అనుకుంటున్నాం. స్వదేశంలో ఆస్ట్రేలియాతో సిరీస్ సైతం ఉంది. దీంతో పెద్దగా కంగారు పడటం లేదు. రాహుల్, శ్రేయస్‌లు అనుభవం కలిగిన క్రికెటర్లు. ఎంతో క్రికెట్ ఆడారు, ఫిట్‌నెస్ సాధించి వచ్చారు. ఇప్పుడు తగినంత మ్యాచ్ టైమ్ ఇవ్వటమే మా ప్రాధాన్యం' అని ద్రవిడ్ చెప్పారు.

గాయాల దెబ్బ : 'బ్యాటింగ్ లైనప్‌లో నం.4, నం.5 స్థానాలపై ఎక్కువగా చర్చ జరుగుతుంది. దీంతో భారత్‌కు ఆ స్థానాల్లో స్పష్టత లేదనే అభిప్రాయం కలుగుతుంది. కానీ ఆ స్థానాల రేసులో ఉన్న క్రికెటర్లు ఎవరో నేను 18-19 నెలల కిందటే చెప్పేవాడిని. కెఎల్ రాహుల్, శ్రేయస్ అయ్యర్, రిషబ్ పంత్‌లు ఈ రెండు స్థానాల కోసం మా పరిశీలనలో ఉన్న ఆటగాళ్లు. కానీ ఈ ముగ్గురు క్రికెటర్లు రెండు నెలల వ్యవధిలో గాయాల బారిన పడ్డారు. గాయాలైనప్పుడు.. కొత్త వారితో ప్రయత్నం చేస్తాం. కొంతమందిని రొటేట్ చేశాం. ఆ ముగ్గురులో కనీసం ఇద్దరు ఆటగాళ్లు ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి వచ్చారని' భారత మాజీ కెప్టెన్ రాహుల్ తెలిపాడు.

బుమ్రా రాక సంతోషం : 'జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి రావటం సంతోషం. గత రెండేండ్లుగా బుమ్రాను ఎంతగానో మిస్ అయ్యాం. ఐర్లాండ్ పర్యటనలో ప్రసిద్ కృష్ణతో కలిసి బుమ్రా నాలుగు ఓవర్ల స్పెల్‌తో ఆకట్టుకున్నాడు. ఆసియా కప్‌లో మరింత మెరుగు పడేలా చూస్తాం. ప్రపంచకప్‌కు సిద్ధమయ్యేందుకు భారత్‌కు పూర్తిగా నెల రోజుల సమయం ఉంది. పేస్ విభాగంలో చాలా ఆప్షన్లు ఉన్నాయి. ప్రపంచకప్ వంటి మెగా టోర్నీల్లో జట్టులోకి ఎంపిక కాకపోయినా..అవసరాన్ని బట్టి జట్టులోకి వచ్చేందుకు అవకాశం ఉంటుంది' అని రాహుల్ ద్రవిడ్ అన్నారు.

తెలంగాణలో శాశ్వత నివాసులైన విద్యార్థులందరూ స్థానికులే

- మెడికల్ అడ్మిషన్ల ప్రక్రియలో అదే విధానం అమలుచేయాలి : కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి హైకోర్టు ఆదేశం



నవతెలంగాణ - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో మెడికల్ సీట్ల భర్తీ విషయంలో స్థానిక కోటా వ్యవహారంపై హైకోర్టు మంగళవారం తీర్పు చెప్పింది. తెలంగాణలో శాశ్వత నివాసితులైన విద్యార్థులందరినీ స్థానికులగానే పరిగణించాలని పేర్కొంది. ఆవిధంగానే 2023-24 విద్యా సంవత్సరానికి ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల అడ్మిషన్లు చేపట్టాలని పేర్కొంది. ఈమేరకు కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణలో శాశ్వత నివాసితులమని అధికారుల నుంచి ధ్రువీకరణ పత్రం తీసుకుని వారం రోజుల్లోగా వర్సిటీకి సమర్పించాలని పిటిషనర్లకు న్యాయస్థానం సూచించింది. ఆ విధంగా వచ్చిన అప్లికేషన్లను పరిశీలించి ప్రతిభ ఆధారంగా ఆయా కేటగిరీల్లో సీట్ల కేటాయింపులు చేయాలని కోర్టు స్పష్టంచేసింది. స్థానిక కోటా నిబంధన-2017లోని 3(111)(బి) ప్రకారం ఒక విద్యార్థిని స్థానికుడిగా పరిగణించాలంటే.. మెడికల్ అడ్మిషన్లకు ముందు నాలుగేండ్లు తెలంగాణలోనే నివాసం ఉండాలి. తెలంగాణలోనే చదివి ఉండాలనే నిబంధనకనుగుణంగా ప్రభుత్వం జీవో 114 జారీ చేసింది. దీనిని హైదరాబాద్‌కు చెందిన రాథోడ్, ఇతరులు హైకోర్టులో సవాల్ చేసిన పిటిషన్లపై మంగళవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరధే ఆధ్వర్యంలోని డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. వాదోపవాదనల అనంతరం తీర్పు చెప్పింది. ప్రభుత్వ ఉత్తర్వులు రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నాయనీ, ఆర్టికల్ 14ను ఉల్లంఘిస్తోందని న్యాయస్థానం పేర్కొంది. అయినప్పటికీ నిబంధనను కొట్టేయడం లేదని చెప్పింది. ఈ తరహాలో సుప్రీంకోర్టు కూడా తీర్పులు చెప్పిందని న్యాయమూర్తి ఈ సందర్భంగా గుర్తు చేశారు.

ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్ల గడువు 15 వరకు పొడిగించండి

- ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్‌కు టీఎస్‌జీహెచ్‌ఎంఏ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇన్‌స్పైర్ అవార్డుల కోసం నామినేషన్ల గడువును ఈనెల 31 నుంచి వచ్చేనెల 15 వరకు పొడిగించాలని తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం (టీఎస్‌జీహెచ్‌ఎంఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, ప్రధాన కార్యదర్శి ఆర్ రాజగంగారెడ్డి, కోశాధికారి బి తుకారాం కలిసి వినతిపత్రం సమర్పించారు. భారీ వర్షాల వల్ల పాఠశాలలకు సెలవులు ప్రకటించబడ్డాయని తెలిపారు. గత రెండు వారాలుగా విద్యార్థులు కంటి రుగ్మతలు, వైరల్ ఫీవర్ వల్ల పాఠశాలలకు పూర్తిస్థాయిలో హాజరు కావడం లేదని పేర్కొన్నారు. ఈనెల 21 నుంచి వచ్చేనెల 11 వరకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులందరూ దశలవారీగా "ఉన్నతి" శిక్షణ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని వివరించారు. విద్యార్థుల నుంచి ఆలోచనలు స్వీకరించడం, అకౌంట్ నెంబర్లను సేకరించే ప్రక్రియ కొనసాగుతున్నదని తెలిపారు. గతేడాది సెప్టెంబర్/అక్టోబర్ వరకు ఇన్‌స్పైర్ అవార్డు నామినేషన్లను వేయడానికి సమయమిచ్చారని గుర్తు చేశారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకొని ఇన్‌స్పైర్ అవార్డుల నామినేషన్ వేసే గడువును వచ్చేనెల 15 వరకు పొడిగించాలని కోరారు.

కాంగ్రెస్‌తోనే పాలమూరు జిల్లాకు న్యాయం :టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

లనవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ వచ్చినా పాలమూరు గోస తీరలేదని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే పాలమూరు జిల్లాకు న్యాయం జరుగుతుందన్నారు.

కాంగ్రెస్ హయాంలో జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, శ్రీశైలం, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో నిర్మించామని గుర్తు చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని రేవంత్ నివాసంలో వారికి కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. గద్వాల నియోజకవర్గానికి చెందిన బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్, వెంకట్ రామిరెడ్డి, రిటైర్డ్ ఎంఈవో సత్యనారాయణ, ఎంపీటీసీలు శివారెడ్డి, ఈశ్వర్, మాజీ ఎంపీపీలు గోవింద్, నాయుడు,సర్పంచ్ సునీత, వార్డు సభ్యులు ఉన్నారు. బీఆర్ఎస్ వైఫల్యాలను తిరగబడదాం.. తరిమికొడదాం నినాదంతో ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

25 వేల టీచర్ పోస్టులకు

మెగా డీఎస్సీ ప్రకటించాలి

రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య డిమాండ్

- విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ముట్టడి
- నిరుద్యోగుల భారీ ర్యాలీ, తీవ్ర ఉద్రిక్తత
- అసెంబ్లీ చేరువలో అరెస్ట్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఇరవై ఐదు వేల టీచర్ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేయాలని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సీఎం కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో ఇచ్చిన హామీ మేరకు ఉపాధ్యాయ పోస్టులకు డీఎస్సీ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు. తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, రామ్మోహన్‌రావు సంయుక్త ఆధ్వర్యంలో నిరుద్యోగులు మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనరేట్‌ను ముట్టడించారు. ఈ నేపథ్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పోలీసులు అరెస్టుల పరంపర కొనసాగించారు. అన్ని జిల్లాల నుంచి వచ్చిన నిరుద్యోగులు పలు దిక్కుల నుంచి కమిషనర్ కార్యాలయానికి చేరుకున్నారు. అలీయా కళాశాల నుంచి ర్యాలీగా బషీర్‌బాగ్, రవీంద్రభారతి మీదగా వచ్చి కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించారు. కళాశాల నుంచి బయలుదేరిన వారిని పోలీసులు ఎల్బీ స్టేడియం వద్ద అడ్డుకోవడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు, నిరుద్యోగుల మధ్య తోపులాట జరగడంతో తీవ్ర ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులను తప్పించుకుని నిరుద్యోగులు కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడించడానికి తరలివెళ్లగా.. అక్కడ అరెస్టు చేసి వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య నిరుద్యోగులను నిలువరించ డానికి ప్రయత్నించినప్పటికీ మూకుమ్మడిగా తరలిపోయారు.

అంతకు ముందు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పీఆర్సీ కమిటీ రిపోర్ట్ ప్రకటిస్తే 5 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించడం దారుణమన్నారు. తెలంగాణలోని ప్రాథమిక పాఠశాలల్లో 18 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పార్లమెంట్ సాక్షిగా ప్రకటించారని, సీఎం కేసీఆర్ అసెంబ్లీలో 15 వేల టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారని, 25 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉపాధ్యాయ సంఘాలు ప్రకటించాయని చెప్పారు. 25 సంవత్సరాలుగా ఎయిడెడ్ పాఠశాలల్లో 4,900 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 10 వేల పీఈటీ పోస్టులు, 5 వేల క్రాఫ్ట్, డ్రాయింగ్ టీచర్ పోస్టులు, ఉన్నత పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ పోస్టులను ఈ అసెంబ్లీ ఎన్నికల్లోపే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేలాది టీచర్ పోస్టులను భర్తీ చేయాలని.. లేకపోతే సచివాలయం, ప్రగతి భవన్‌ను నిరుద్యోగ అభ్యర్థులతో కలిసి ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నిరుద్యోగ జేఏసీ, బీసీ సంక్షేమ సంఘం, బీసీ యువజన సంఘం, డీఎడ్, బీఎడ్ అభ్యర్థుల సంఘం నాయకులు జిల్లపల్లి అంజి, పృథ్వీ రాజ్, మోడీ రాందేవ్, సైదులు గౌడ్, రాజు, రమా దేవి, గంగ, గౌతమి, శృతి తదితరులు పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ కోసం ప్రగతిభవన్‌ను ముట్టడిస్తాం

- 22 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాల్సిందే
- డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై లాఠీచార్జీ సరికాదు :ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఖండన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 22 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాల్సిందేనని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ), భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కమిటీలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. విద్యాశాఖ సంచాలకుల కార్యాలయం ముందు శాంతియుతంగా ధర్నా చేస్తున్న డీఎడ్, బీఎడ్ అభ్యర్థులపై పోలీసులు లాఠీచార్జి చేసి వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించాయి. 22 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ప్రగతిభవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించాయి. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కోట రమేష్, కార్యదర్శులు టి నాగరాజు, ఆనగంటి వెంకటేశ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధ్యాయ అభ్యర్థులపై లాఠీచార్జీ అమానుషం..వైఎస్ షర్మిల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

భావి తరానికి పాఠాలు నేర్పే ఉపాధ్యాయ అభ్యర్థులపై కేసీఆర్ ప్రభుత్వం లాఠీ ఛార్జ్ చేయటం అమానుషమని వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీలో ఇచ్చిన వాగ్దానం ప్రకారం 13,086 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తే లాఠీలతో కొడతారా?అని ప్రశ్నించారు. కొలువుల కోసం తెలంగాణ తెచ్చుకున్న నిరుద్యోగులను కొట్టటం దారుణమని తెలిపారు. తొమ్మిదేండ్లుగా ఉపాధ్యాయ పోస్టుల ఊసేత్తకుండా నామమాత్రంగా పోస్టులు భర్తీ చేసి, ఓట్లు దండుకునేందుకు కొత్త ఎత్తుగడలతో వస్తున్నారని పేర్కొన్నారు.

డీఎడ్,బీఎడ్ అభ్యర్థులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

'ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించండి..బహుమతులు పొందండి'



నవతెలంగాణ-హయత్ నగర్

ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసిన వారికి లక్కీ డీప్ ద్వారా బహుమతులు అందజేయాలని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ పిలుపులో భాగంగా హయత్ నగర్ 1 డిపో మేనేజర్ రఘు, 2 డిపో మేనేజర్ శ్రీనివాసరావులు మంగళవారం హయత్ నగర్ బస్టాండ్ లో లక్కీ డీప్ బాక్స్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివాహాది శుభాకార్యాలు, రాఖీ పండుగను పురస్కరించుకొని ఈ లక్కీ డీప్ బాక్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేటి నుండి 31 తేదీలలో ఆర్టీసీ బస్సులలో ప్రయాణం చేసిన వారి టికెట్ వెనుకాల వారి ఫోన్ నెంబర్ రాసి బాక్స్ లో వేయాలన్నారు. తదుపరి వారికి 1,10,000 గల బహుమతులు అందజేస్తాం అని తెలియజేశారు. ఈ అవకాశాన్ని మహిళ ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



నవతెలంగాణ-వనస్థలిపురం

అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిం చాలని కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని విజయపురి కాలనీ ఫేస్ 1లో చేపట్టిన డ్రైనేజీ పనులను మంగళవారం వాటర్ వర్క్స్ టీజీ ఎం రాజగోపాల్, మేనేజర్ భవ్య రెడ్డిలతో కలిసి ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విజ యపురి కాలనీ ఫేస్ వన్‌లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో విజయపురి కాలనీ అధ్యక్షులు వెంకట రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్, ప్రధాన కార్యదర్శి సాయిరాం, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు కామేష్, పవన్ రెడ్డి, అనిరుద్, గోపాల్, వేణు పాల్గొన్నారు.

ఫ్లై ఓవర్ పనుల్లో వేగం పెంచండి



- ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ- సంతోష్ నగర్

ఫ్లై ఓవర్ పనుల్లో వేగం పెంచాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని సాగర్ రింగ్ రోడ్డు వద్ద చేపట్టిన ఫ్లై ఓవర్ నిర్మాణ పనులను లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసరావుతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ చౌరస్తాను ఫ్రీ సిగ్నల్ చౌరస్తాగా మార్చడం జరిగిందన్నారు. ఎస్.ఆర్.డీ.పీ.పనుల్లో భాగంగా దాదాపు రూ.658 కోట్ల వ్యయంతో పనులు చేపట్టినట్లు తెలిపారు. దాదాపు అన్ని ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులు పూర్తి అయినట్లు చెప్పారు. ఎల్బీనగర్ జంక్షన్ వద్ద కుడి, ఎడమ ఫ్లై ఓవర్లు, అండర్ పాసులు, నాగోల్ జంక్షన్ ఫ్లై ఓవర్, కామినేని జంక్షన్ వద్ద రెండు వైపులా ఫ్లై ఓవర్లు, చింతలకుంట జంక్షన్ వద్ద అండర్ పాస్, బైరమల్ గూడ(ఆలేఖ్య టవర్స్) జంక్షన్ వద్ద రెండు ఫ్లైఓవర్లు నిర్మించామన్నారు.

ప్రస్తుతం ఆలేఖ్య టవర్స్ వద్ద సెకండ్ లెవెల్ నూతన స్కై ఫ్లై ఓవర్ నిర్మాణ పనులు గతంలో ప్రారంభమైనట్లు చెప్పారు. వచ్చే అక్టోబర్ వరకు పూర్తిస్థాయిలో పనులు పూర్తవుతామని అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యం అని అన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసి.. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించి..మరోసారి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వ పాలనను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాకేశ్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు.

ఆశాలకు రూ.18వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్



నవతెలంగాణ - మీర్ పేట్

ఆశా వర్కర్లకు రూ.18వేల ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అలువాల రవి కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్ల సమస్యలపై రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంత్రి సబితా ఇంద్రారెడ్డి క్యాంప్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకనుగుణంగా ఆశాల జీతాలను రూ.18 వేలకు పెంచాలని కోరారు. ఆశాలకు ప్రసూతి సెలవులపైన సర్క్యులర్‌ను వెంటనే జారీ చేయాలన్నారు. ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం, ఉద్యోగ భద్రత, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా, రూ. 5లక్షలు, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా శేఖర్, బట్టి బాల రాజు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మికి రూ.4లక్షలు సాయం చేసిన కాంగ్రెస్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఇటీవల పోలీసుల చేతిలో తీవ్రంగా గాయపడిన లక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రూ. 4లక్షల ఆర్థిక సాయం అందజేసినట్లు మాజీ ఎంపీ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వి.హనుమంత రావు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్‌లు తెలిపారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న అల్మాస్ గూడలో నివాసం ఉండే గిరిజన మహిళ లక్ష్మిని మంగళవారం రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహా రెడ్డి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డిలతో వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. లక్ష్మి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త మనోహర్ రెడ్డి, దేప భాస్కర్ రెడ్డి, ఏనుగు జంగారెడ్డి, సరికొండ మల్లేష్, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, చల్లా బాల్ రెడ్డి, మౌనిక, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, కందుకూరు మండల అధ్యక్షుడు కృష్ణ నాయక్, కార్పొరేషన్ మహిళా అధ్యక్షురాలు అమృత నాయుడు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి



- సీఐటీయూ నాయకులు

నవతెలంగాణ - హస్తినాపురం

జీహెచ్ఎంసీ పరిధిలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌ను మంగళవారం వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే నిబంధనను జీహెచ్ఎంసీ ఉల్లంఘిస్తుందని మండిపడ్డాడు. పారిశుద్ధ్య సేవలో ప్రైవేటీకరణ చర్యలను ఉపసంహరించుకొని ప్రైవేటు సంస్థలతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. కార్మికులకు బయోమెట్రిక్ హాజరు పట్టిక ద్వారా జరుగుతున్న అవకతవకలను అరికట్టి, జీతాలను సరియైన క్రమంలో ఇచ్చి ఉద్యోగ భద్రత కింద డబుల్ బెడ్ రూం ఇండ్లు, దూర ప్రాంతాల నుండి వచ్చే కార్మికులకు బస్ పాస్ సౌకర్యాలు తదితర సౌకర్యాలను కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఆలేటి ఎల్లయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు మల్లెపాక వీరయ్య ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, నాయకులు సిహెచ్. జంగయ్య, జి.జంగయ్య, ఎం. బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును కాపాడాలంటూ కమిషనర్ ఫిర్యాదు



నవతెలంగాణ- అబ్దుల్లాపూర్ మెట్

పెద్ద అంబర్ పేట మున్సిపాలిటీ ఐదో వార్డులో కబ్జాకు గురైన రోడ్డును కాపాడాలని కోరుతూ మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డికి బీఎస్పీ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు యంజాల ప్రహ్లాదు మాట్లాడుతూ పెద్ద అంబర్ పేట గ్రామ రెవెన్యూ సర్వేనెం. 309, 320లకు సంబంధించిన లేఔట్‌లోని ప్లాట్ నెం.127, 128, 129, 130, 131, 132 ప్లాంట్లకు సంబంధించిన వారు రోడ్డును కబ్జా చేసి.. 15 ఫీట్ల ఎత్తులో మట్టిని నింపి ప్రహరీ గోడను నిర్మిస్తున్నారన్నారు. అలాగే ఐదో వార్డులో అనేక అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అక్రమ నిర్మాణాలపై అనేక ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బీఎస్పీ నాయకులు అరుణ్ ఉన్నారు.

'చదువుతోపాటు గ్రౌండ్ వర్కౌట్ ముఖ్యం'



నవతెలంగాణ- చైతన్యపురి

ఎస్ఐ జాబ్ సాధించాలంటే నిరంతరం చదువుతో పాటు గ్రౌండ్ వర్కౌట్ కూడా ఎంతో ముఖ్యమని ఫిజికల్ డైరెక్టర్ నందు నాయక్ అన్నారు. నందు ఆర్మీ అకాడమీలో శిక్షణ తీసుకున్న విద్యార్థి హర్ష ఢిల్లీలో ఎస్ఐగా సెలెక్ట్ అవడంతో మంగళవారం హర్షను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నందు నాయక్ మాట్లాడుతూ ఢిల్లీ లో ఉద్యోగం సాధించడం ఎంతో ఆనందాన్ని ఇచ్చిందన్నారు. అకాడమీలో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారని సలహాలు, సూచనల కోసం హర్షను తీసుకు రావడం జరిగిందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడానికి అకాడమీ ఎప్పుడూ ముందుంటుందని అన్నారు. శిక్షణ తీసుకున్న విద్యార్థులు నిజాయితీగా కష్టపడితే ఉద్యోగం సాధించడం ఏమి కష్టం కాదన్నారు.

50 ఏండ్ల వరకు తాగునీటి సమస్య ఉండదు



- మంత్రి సబితా ఇంద్రారెడ్డి

నవతెలంగాణ- చైతన్యపురి

రాబోయే 50 ఏండ్ల వరకు హైదరాబాద్ నగరానికి తాగునీటి సమస్య లేకుండా కృష్ణా, గోదావరి జలాలను తీసుకువచ్చి..ఇంటింటికీ తాగునీరు అదే విధంగా సీఎం కేసీఆర్ చర్యలు తీసుకున్నారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. సరూర్నగర్ డివిజన్లో రెండు కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టెండర్ పూర్తయిన కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఎస్‌టీఐ కాలనీలోని పార్కు, భగత్ సింగ్ నగర్ లోని మహిళా భవన పనులు కొద్దిగా ఆలస్యం అయ్యాయని అన్నారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు. పెరిగిన జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తామని చెప్పారు. ఆరు కోట్ల నిధులతో విజయపురి కాలనీలో ఎస్ఎన్‌డీపీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఆ పనులు పూర్తయితే విజయపురి కాలనీకి వరద నీటి ముంపు సమస్య ఉండదని తెలిపారు. రజనీకాంత్ లాంటి స్టార్ నాయకుడు వచ్చి హైదరాబాద్‌ను సింగపూర్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలతో పోల్చాడని గుర్తు చేశారు. ఎనిమిదేళ్ల కాలంలో ఎల్బీనగర్ రూపురేఖలే మారిపోయాయని అన్నారు. నగరానికి నలుమూలల నాలుగు మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు నిర్మించి..కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారని కొనియాడారు. పండ్ల మార్కెట్ ఆవరణలో దాదాపు రూ.1200 కోట్లతో నిర్మిస్తున్న టీమ్స్ నిర్మాణ పనులు పూర్తి అయితే పేదలందరికీ ఉచితంగా వైద్యం అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బొగ్గరపు దయానంద్ గుప్తా, లోకసాని కొండల్ రెడ్డి, మహేందర్ యాదవ్, బేర బాలకిషన్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద శర్మ, పెండ్యాల నగేష్, రామ్ నర్సింహ గౌడ్, లక్ష్మీ నగర్ కాలనీ అధ్యక్షుడు వాయు కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రాజు, రామకృష్ణ యాదవ్, మహేష్ యాదవ్, వెంకటేష్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

బడంగ్ పేట్ :

రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో శ్రీరామ కాలనీకి చెందిన అజాద్ యూత్ కమిటీ సభ్యులు జల్‌పల్లి మున్సిపాలిటీ ఉపాధ్యక్షులు దూడల శ్రీనివాస్ గౌడ్, యూత్ వింగ్ వర్కింగ్ ప్రెసిడెంట్ యంజాల అర్జున్ ఆధ్వర్యంలో జిల్లెలగూడ క్యాంపు కార్యాలయంలో మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ పేద, బడుగు, బలహీనవర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. దేశంలోని ఏ రాష్ట్రంలో చేయలేని అభివృద్ధి తెలంగాణ రాష్ట్రంలో జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



సీనియర్ జర్నలిస్టుకు మంత్రి పరామర్శ



నవతెలంగాణ- చైతన్యపురి

రంగారెడ్డి జిల్లా జర్నలిస్ట్ యూనియన్ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్ట్, మహేశ్వరం నియోజకవర్గం ప్రజాపక్షం ఇంచార్జి అనంతుల శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి మంగళవారం శ్రీశంకర్ కాలనీలోని ఆయన నివాసానికి వెళ్లారు. తర్వాత ఆయన ఆరోగ్య విషయాలను తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్కేపురం డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నాగేష్, మాజీ కౌన్సిలర్ అశోక్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, ఆర్కేపురం డివిజన్ బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళ రెడ్డి, ఋషి తదితరులు పాల్గొన్నారు.

పేద అమ్మాయి పెండ్లికి అండగా ఐవీఎఫ్



నవతెలంగాణ-నాగోల్

పేదింటి అమ్మాయి పెళ్లికి ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అండగా నిలిచింది. హైదరాబాద్ లోని ఎల్బీనగర్ నియో జక వర్గ పరిధిలోని హయత్ నగర్‌కు చెందిన అమ్మాయి నవనీత వివాహం కోసం ఆమె తల్లిదండ్రులు నాగోల్‌లోని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, ఐవీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తను మంగళవారం క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా వారికి ఐవీఎఫ్ ఆధ్వర్యంలో పుస్తె, మెట్టెలు, చీర, గాజులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పెళ్లి కూతురు తల్లి సరస్వతి, తండ్రి శ్రీరాములు,సల్వాచారి,సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ శంకర్, ప్రవీణ్ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన పెంచుకోవాలి



గవర్నర్ తమిళసై సౌందరరాజన్

నవతెలంగాణ- వనస్థలిపురం

ప్రతి ఒక్కరూ చిరుధాన్యాలపై అవగాహన పెంపొందించుకోవాలి తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. మంగళవారం సాయంత్రం వనస్థలిపురం రైతు బజార్ వద్ద నయా మిల్లెట్స్ వ్యవస్థాపకుడు అమర్‌నాథ్ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గవర్నర్‌తో పాటు సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ బీజేపీ ఇంచార్జి పి మురళీధర్ రావు, ఎల్ఎల్ఎంఆర్ డైరెక్టర్ సితార సత్యవతితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ గర్భిణులకు చిరుధాన్యాలు బహుకరించి మాట్లాడారు. గర్భిణులు చిరుధాన్యాలు తీసుకోవడం వలన కడుపులోని బిడ్డ మెదడు అభివృద్ధి చెందుతుందని, తల్లీబిడ్డ బాగుంటే భర్త బాగుంటాడని, అదేవిధంగా ఒక కుటుంబం బాగుంటే రాష్ట్రం బాగుంటుందని.. రాష్ట్రం బాగుంటే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. చిరుధాన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. నేడు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండి చిరుధాన్యాలను అలవాటు చేసుకోవాలని సూచించారు. మధ్యప్రదేశ్ బీజేపీ ఇంచార్జి పి. మురళీధర్ రావు మాట్లాడుతూ అమర్ నాథ్ దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని, 365 రోజులు ఒక్కొక్క ప్రాంతంలో చిరుధాన్యాలతో కూడిన రుచులు చూపిస్తున్నారు. మనదేశంలో చాలామందికి రక్తహీనత అధికంగా మహిళల్లో ఉందని, రక్తహీనత నివారణకు సజ్జలు ఎంతో ఉపయోగపడతాయని, ఇదేవిధంగా రాగుల్లో కాలుష్యం అధిక శాతంగా ఉంటుందని గుర్తు చేశారు. ఎల్ఎల్ఎంఆర్ డైరెక్టర్ తార సత్యవతి మాట్లాడుతూ భారతదేశంలోని ప్రజలు ప్రస్తుత అలవాట్లు మార్చుకొని ముందుకు సాగాలన్నారు. చిరుధాన్యాలపై అవగాహన ప్రజల్లో ఎక్కువైందని, 7000 సంవత్సరాల క్రితం నుంచి ప్రపంచ వ్యాప్తంగా చిరుధాన్యాలపై ఆధారపడి ఉండేవారని, చిరుధాన్యాలు ఆరోగ్య ప్రదాత అనితెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్‌కు పూర్వ విద్యార్థి చేయూత

నవతెలంగాణ-హయత్ నగర్

మన్సురాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్వ విద్యార్థి పోచబోయిన జగదీష్ యాదవ్.. పాఠశాల మూత్రశాలలపై షెడ్డు నిర్మాణానికి రూ .15వేలు, రూ.10వేలతో గ్రంథాలయ పుస్తకాలను మంగళవారం ప్రధానోపాధ్యాయులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ సరిత, శ్రీనివాస్, రజిత, ఆంజనేయులు, బీఆర్ఎస్ మాజీ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు చంద్రమోహన్, సుధాకర్ రెడ్డి, గోపినాయక్, బుచ్చిబాబు, విద్యార్థుల తల్లీదండ్రులు పాల్గొన్నారు.



'సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం'

నవతెలంగాణ-తుర్కయంజాల్

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు ఓ వరం అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. కోహెడ గ్రామానికి చెందిన సామల యూసుఫ్ రెడ్డి, పల్లపు మహేశ్వరి కుటుంబ సభ్యులకు సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.70000 విలువ గల చెక్కులు మంజూరయ్యాయి. ఈ మేరకు మంగళవారం లబ్ధిదారులకు ఆ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ సిద్దాల జ్యోతి జంగయ్య, అబ్దుల్లాపూర్మెట్ రైతుబంధు కోఆర్డినేటర్ కందాల బలదేవరెడ్డి, కోహెడ రెండో వార్డ్ టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బుడ్డ విజయ్ బాబు, కోహెడ బీఆర్ఎస్ పార్టీ నాలుగో వార్డ్ అధ్యక్షులు పల్లపు ఆంజనేయులు, పసుల దేవేందర్ ముదిరాజ్, కుమార్, పల్లపు యాదగిరి, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి

- కేంద్ర ప్రభుత్వ మైనార్టీ కమిషన్ సభ్యురాలు కుమారి సయ్యద్ షేహజది

నవతెలంగాణ - ధూల్ పేట్

పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ఎప్పటికప్పుడు పరిష్కరించుకోవాలని కేంద్ర ప్రభుత్వ మైనార్టీ కమిషన్ సభ్యురాలు కుమారి సయ్యద్ షేహజది సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలన్నారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, వాటిని సక్రమంగా అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేవలం కొన్ని ప్రాంతాలకే పరిమితం కాకుండా అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి నిర్మాణాపనులతో పాటు సమస్యలను పరిష్కరించాలన్నారు. ఇండ్లు లేని రోడ్లపై ఉండే మహిళల కోసం చార్మినార్ జోన్ పరిధిలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. పలు ప్రాంతాల్లో నెలకొన్న, మంచినీటి, కలుషిత నీటి సమస్యల పరిష్కారానికి అధికారులు పర్యవేక్షించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో చార్మినార్ జోన్ జాయింట్ కమిషనర్ శైలజ, ఎస్.ఈ.మహేశ్వర్ రెడ్డి, చాంద్రాయణగుట్ట సర్కిల్ డీసీ షనవాజ్, డిప్యూటీ డైరెక్టర్ (వెటర్నరీ) శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ (యు బి డి) అమీనా బి, టౌన్ ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ శ్యామ్ కుమార్, మలేరియా విభాగం సీనియర్ ఏంటామాలజిస్ట్ శ్రీనివాస్, ఈఈ లు, ఆరోగ్యం పారిశుధ్యం విభాగం, వీధి దీపాలు, జలమండలి, విద్యుత్ విభాగం అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ప్రజా సమస్యలపై చాంద్రాయణగుట్ట నర్కి పూల్ బాగ్‌లోని జోనల్ కమిషనర్ కార్యాలయంలో మంగళవారం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్ (యూసీడీ) చంద్రకాంత్ రెడ్డి, చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ టీ.వెంకన్న పర్యవేక్షణలో అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలు, ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల పై ప్రజలకు కల్పిస్తున్న అవగాహన చర్యలపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పారిశుధ్య, దోమల నివారణ, వీధి దీపాలు, సేవరేజ్, డ్రైనేజీ, కలుషిత నీరు, విద్యుత్,

రామయ్య కోచింగ్ సెంటర్‌లో ఉచితంగా టెస్టులు



నవతెలంగాణ- చైతన్యపురి

తెలంగాణలో టెట్, డీఎస్సీలకు ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం 33 జిల్లాల వారీగా ఉచితంగా గ్రాండ్ టెస్టలను నిర్వహిస్తున్నట్లు రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ సంస్థ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరక్టర్ సిరికొండ లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 3 నుండి 7 వరకు సబ్జెక్ట్ వారీగా టెట్ ఎగ్జామ్స్, సెప్టెంబర్ 8 నుండి 12 వరకు టెట్ గ్రాండ్ టెస్టుల నిర్వహణ ఉంటుందని అని తెలిపారు. డీఎస్సీ ప్రిపేర్ అవుతున్న అభ్యర్థుల కోసం ప్రతి ఆదివారం గ్రాండ్ టెస్టులు నిరంతరంగా కొనసాగుతాయన్నారు. అభ్యర్థులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రాండ్ టెస్టులు అన్ని కూడా రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ మొబైల్ ఆప్ నందు నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. టెస్టులు రాయాలనుకునే అభ్యర్థులు ప్లే స్టోర్ నుండి రామయ్య కాంపిటీటివ్ కోచింగ్ సెంటర్ మొబైల్ ఆప్ డౌన్లోడ్ చేసుకుని వారి వారి జిల్లా బ్యాచ్ చేరాల్సి ఉంటుందని..బ్యాచ్ కోడ్ ఎగ్జామ్ సంబంధిత వివరాల కోసం 9246208422, 8885555202, 8008954440 నంబర్లకు సంప్రదించాలని కోరారు.

'సీఎం సహాయ నిధి పేదలకు ఎంతో ఉపయోగం'



నవతెలంగాణ-బోడుప్పల్

నిరుపేదల పాలిట సీఎం సహాయ నిధి ఎంతో ఉపయోగమని బీఆర్ఎస్ బోడుప్పల్ నగర అధ్యక్షుడు మంద సంజీవరెడ్డి అన్నారు. మంగళవారం సీఎం సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు అందజేశారు. 26 డివిజన్ వీరారెడ్డి నగర్ కాలనీకి చెందిన దత్త్రికి రూ.60వేలు, 7వ డివిజన్‌కు చెందిన శైలజకు రూ.60వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, 26 డివిజన్ ఇన్‌చార్జి రాసాల మహేష్ యాదవ్, ఉప్పరి విజయ్, వీరారెడ్డి నగర్ కాలనీ అధ్యక్షులు తదితరులున్నారు.

నడుస్తూ..ఆరోగ్యాన్ని కాపాడుకోండి : వాకర్స్ ఇంటర్నేషనల్ క్లబ్



నవతెలంగాణ-ఉప్పల్

నడవండి.. నడిపించండి.. ఆరోగ్యానికి కాపాడుకోండి అనే నినాదంతో ఏర్పాటు చేసిన వాకర్స్ క్లబ్, ఇంటర్నేషనల్ క్లబ్ ఇప్పుడు హైదరాబాదులో వివిధ ప్రాంతాల్లో 82 క్లబ్‌లుగా ఏర్పడి ప్రజల ఆరోగ్యం కోసం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని ఇంటర్నేషనల్ క్లబ్ గవర్నర్ చక్రపాణి అన్నారు. మంగళవారం ఉప్పల్‌లోని స్కై వాక్, ఉప్పల్ క్లబ్ పేరుతో ఏర్పాటు చేసిన స్కై వే మీద ఒక రౌండ్ నడిచారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తలుపునూరి వీరేశం, ప్రధాన కార్యదర్శి బిక్మల్ల భాస్కర్ గుప్తా, కోశాధికారి వంశీ ని ప్రకటించారు.

దేవర్ యాంజల్‌ను రక్షించండి సారూ..



నవతెలంగాణ-శామీర్‌పేట

దేవర్ యాంజల్‌ను రక్షించాలని తూంకుంట మున్సిపాల్టీ దేవర్ యాంజల్ కమిటీ ప్లకార్డులు ప్రదర్శించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జైతురాం నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. దేవరయాంజల్‌లోని దేవాదాయ శాఖకు చెందిన సర్వే నెంబర్ 639, 640లోని భూమిలో మంత్రి మల్లారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతో కొంతమంది అక్రమార్కులు కబ్జా చేసి గుడిసెలు వేశారని తెలిపారు. అక్రమ గుడిసెలను తొలంచాలని ఆదేశించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కరెంటు, రోడ్డు తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తానని చెప్పడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో అక్రమార్కుల ఆగడాలకు హద్దు అదుపు లేకుండా పోయిందన్నారు. దేవాదాయ శాఖ భూమి అన్యాక్రాంతం కావడానికి కారకులైన వారిపై సేవ్ దేవరయాంజల్ కమిటీ మండి పడింది. ఇప్పటికైనా అక్రమార్కుల చెర నుండి దేవుని భూమి విడిపించాలని కోరారు. గ్రామాభివృద్ధికి దోహదం చేయాలని లేదంటే భవిష్యత్తులో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్నం నర్సింహ రెడ్డి, సాయి కిరణ్ గౌడ్, దండోత్కర్ రాజ్ మోహన్, ఎం. హుస్సేన్, అశోక్, గణేష్, శ్రీకాంత్ రెడ్డి, అజయ్, నర్సింహ, నవీన్, పృథ్వి రెడ్డి, రాజు, టిల్లు, పి నాగరాజు, బి నవీన్, రాఘవేందర్, మురళి, నర్సింగ్ రావు, జైపాల్, జి రాజు, కె. రమేష్, ఎస్ మహేందర్, అర్జున్ పాల్గొన్నారు.

వంద శాతం తడిపొడి చెత్త సేకరణ

- పీర్జాదిగూడ మేయర్ జక్కా వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో తడిపొడి చెత్తను వంద శాతం సేకరిస్తున్నామని మేయర్ జక్కావెంకట్‌రెడ్డి అన్నారు. సమీకృత వ్యర్థాల శుద్ధీరణ పార్క్‌ను మేయర్ జక్కా వెంకట్ రెడ్డి, కమిషనర్ ఇస్లావత్ నమ్య, ఐటీసీ ఎగ్జిక్యూటీవ్ వైస్ ప్రెసిడెంట్ శివశంకర్ బందోపాధ్యాయలు కలిసి సందర్శించారు. నగర పరిధిలో ప్రజలందరి సహకారంతో తడి, పొడి చెత్తను100 శాతం వేరు వేరుగా సేకరించడంతో పాటు సేకరించిన తడి చెత్త నుంచి సేంద్రీయ ఎరువును తయారు చేస్తున్నామన్నారు. సమీకృత వ్యర్థాల శుద్దీకరణ పార్క్ (డంపింగ్ యార్డ్) నందు రూ.54.00లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన ట్రెడెడ్, బ్రిక్కెడ్ మిషన్ పనితీరును వివరించారు. భవిష్యత్తులో బయోగ్యాస్‌ను కూడా పీర్జాదిగూడ డంపింగ్ యార్డులో ఉత్పత్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పొడిచెత్తను రీసైక్లింగ్ చేయడం జరుగుతుందన్నారు. చెత్తను ఆదాయ వనరుగా మార్చాలనే ఉద్దేశ్యంతో ఐటీసీ, వెల్త్ అవుట్ ఆఫ్ వేస్ట్ అనే కార్యక్రమానికి చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రజలు స్వచ్ఛందంగా తడి చెత్త , పొడి చెత్త, హానికారక చెత్తను ఇంటి నుండే వేరుచేసి అందిస్తుండటం సంతోహంగా ఉందన్నారు. తడి చెత్తను ఎరువులుగాను, బయోగ్యాస్‌గా మార్చడం, పొడి చెత్త అనగా పేపర్,ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వేస్ట్, ఇనుము, మొదలైనవి 15 రకాల పొడి చెత్త రీసైక్లింగ్ చేయడానికి అనువైన వస్తువుల కోసం డీఆర్‌సీ సెంటర్ ఏర్పాటు చేసామన్నారు. నగర పరిధిలో రోజుకు 43 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని పేర్కొన్నారు. జనాభా పెరుగుదల, భవిషత్తు అవసరాల దృష్ట్యా 100 టన్నులకు చెత్త నిర్వహణ చేసేందుకు అవసరమైన షెడ్, కన్వేనర్ బెల్ట్, ఆటోమెటిక్ బైలింగ్ మెషిన్ మొదలైన పరికరాలను సమకూర్చడానికి ఐటీసీ సంస్థ వారు సహకరించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. వారు సానుకూలంగా స్పందించారని చెప్పారు.

స్వచ్ఛ పీర్జాదిగూడ నగరంగా నిర్మాణంలో తమ వంతు సంపూర్ణ సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎస్ఎన్ ఉమాకాంత్-చీఫ్ మేనేజ ర్, సీఎస్ఆర్,ఐటీసీ సత్య శ్రీనివాస్- డిప్యూటీ మేనేజర్, ఐటీసీ, సుధా పోలేని- ప్రాజెక్ట్ మేనేజర్, డీవీవీఎస్ మూర్తి -వావ్ ప్రాజెక్ట్, చెట్టి రాజు-ఎర్త్‌బాక్స్ అర్వో శ్రీనివాస్‌రెడ్డి, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మురళీ పాల్గొన్నారు.

'అభివృద్ధిలో తెలంగాణ నంబర్ వన్'



నవతెలంగాణ-కీసర

అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్‌గా నిలుస్తుందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి అన్నారు. మంగళవారం నాగారం మున్సిపాల్టీలో రూ.70 లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాల్టీలు, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ చంద్రారెడ్డి, కమిషనర్ జి.రాజేందర్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ మల్లేశ్ యాదవ్, డీఈఈ సుదర్శనం రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, వివిధ వార్డుల కౌన్సిలర్లు శ్రీనివాస్ గౌడ్, అనంత్‌రెడ్డి, అనితాసుధాకర్‌రెడ్డి, లావణ్యశ్రీనివాస్, సుమిత్రా సురేష్, దివ్యాదయాకర్, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మీవేణు, శ్రీనివాస్, రేణుక జగన్ మోహన్ రెడ్డి, కో-ఆప్షన్ మెంబర్స్ ఆధామ్ షఫిక్ , నాగారం మున్సిపల్ అధ్యక్షుడు తేళ్ల శ్రీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నిమ్మల శ్రీనివాస్, ఆంజనేయులు గౌడ్, అంజయ్య, పెంటయ్య, రమేష్ గుప్తా, లింగం, రాహుల్‌రెడ్డి, వామన్ పాల్గొన్నారు.

బీఎల్ఆర్‌ను కలిసిన ఆటో, వ్యాన్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి, రాష్ట్ర ఆటో, వ్యాన్ డ్రైవర్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు బండారి లక్ష్మారెడ్డిని బోడుప్పల్ సిద్ధార్థ స్కూల్ ట్రాన్స్‌ఫోర్ట్ యూనియన్ నాయకులు మంగళవారం కలిశారు. కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్‌నబీ, జనరల్ సెక్రెటరీ భాస్కర్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్, రజాక్‌రెడ్డి, ప్రచార కార్యదర్శి శ్రీకాంత్, మల్లేష్, సంగమేష్ బోడుప్పల్ సిద్ధార్థ స్కూల్ ట్రాన్స్‌ఫోర్ట్ అధ్యక్షులు వెంకట్ రెడ్డి , ఉపాధ్యక్షులు చందర్, జనరల్ సెక్రెటరీ సతీష్‌రెడ్డి, క్యాషియర్స్ శివ, రాంబాబు కలిశారు. అంతకుముందు బండారి లక్ష్మారెడ్డి పోస్టర్ ఆవిష్కరించారు.

'ముదిరాజ్‌లకు అసెంబ్లీ సీట్లు కేటాయించాలి'



నవతెలంగాణ-మేడ్చల్

ముదిరాజ్‌లకు జనాభా ప్రతి ప్రతిపాదికన అసెంబ్లీ సీట్లు కేటా యించాలని పూడూరు గ్రామ ముదిరాజ్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు జీ.పరమేష్ ముదిరాజ్ రాజకీయ పార్టీలను కోరారు. ఈ మేరకు మంగళవారం గ్రామ పరిధిలోని అంబేద్కర్ విగ్రహానికి ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జీ.పరమేష్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షు డు సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే అభ్యర్థులలో ముదిరాజ్ సామాజిక వర్గానికి చెందిన ఒక్క వ్యక్తికి కూడా అవకాశం ఇవ్వకపోవడాన్ని ఖండిస్తున్నామని తెలియజేశారు. కేసీఆర్ పునర్ ఆలోచన చేసి ముదిరాజ్ లకు అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. పటాన్ చెరువు నియోజకవర్గం నాయకుడు నీలం మధు చేస్తున్న సేవలను సీఎం గుర్తించి ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో యూత్ అధ్యక్షుడు మర్కంటి నాగరాజ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు శ్రీరామ్ ముదిరాజ్, వార్డు సభ్యులు జనార్దన్ యాదవ్, యాటవెల్లి హన్మంత్ రెడ్డి, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు బచ్చు మల్లారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ సుదర్శన్ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యుడు తుపాకుల కృష్ణ ముదిరాజ్, నాయకులు భాగిరెడ్డి, తిరుమని రమేష్ ముదిరాజ్, హరిబాబు ముదిరాజ్,సాయి ముదిరాజ్, రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఒత్తిడిని జయిస్తేనే ఉత్తమ ఫలితాలు



- ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ-ఘట్కేసర్

ప్రతి విద్యార్థి ఒత్తిడిని జయించి నప్పుడే మంచి ఫలితాలు సాధించగలరని ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఘటకేసర్ మండలం అవుషాపూర్ పరిధిలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాల యాజమాన్యం ఘటకేసర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన అల్ఫోర్స్ నవోత్సవ్ 2023 కార్యక్రమానికి విద్యా సంస్థల చైర్మెన్ డాక్టర్ వి. నరేందర్ రెడ్డితో కలిసి అతిధిగా ఏనుగు సుదర్శన్ రెడ్డి, అతిధిగా సర్పంచ్ ఏనుగు కావేరి మచ్చేందర్ రెడ్డిలు హాజరై య్యారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ విద్యార్థులు చెడు అలవాట్లకు లోనై చదువులపై శ్రద్ధ పెట్టలేక పోతున్నారని, దీనితో తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండా లని సూచించారు. ప్రణాళిక బద్ధం గా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు.

క్రమ శిక్షణకు మారుపేరుగా అల్ఫోర్స్ కళాశాలలో విద్యార్థులు సాధించిన ఫలితాలే నిదర్శణమన్నారు. అంతకుముందు విద్యా సంస్థల చైర్మెన్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ అల్ఫోర్స్ విద్యాసంస్థలు 33 ఏండ్లుగా విద్యార్థులను ఉత్తములుగా తీర్చిది ద్దేందుకు కృషిచేస్తున్నామని తెలిపా రు. నైతిక విలువలతో విద్యను నేర్చుకున్నపుడే ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని చెప్పారు. అనంతరం విద్యార్థులు సాంస్కృ తి కార్యక్రమా లు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో ప్రిన్సిపల్, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందజేసిన కౌకుంట్ల రాహుల్ రెడ్డి



నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాల్టీ పరిధిలోని రాంపల్లి గ్రామానికి చెందిన నీరుడు నాగయ్య గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం ఉదయం చనిపోయారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాగారం మున్సిపాల్టీ యువ నాయకుడు కౌకుంట్ల రాహుల్‌రెడ్డి రూ.5వేలను నాగయ్య అంత్రక్రియలకు మృతుడి కుటుంబ సభ్యుడు రాకేష్‌యాదవ్‌కు అందజేశారు. కార్యక్రమంలో నీరుడు భిక్షపతి, మీసాల సురేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తున్నాం

- కార్పొరేటర్ బండారు శ్రీవాణి



నవతెలంగాణ-ఉప్పల్

అభివృద్ధి అంటే ఏమిటో మేం చూపిస్తున్నామని రామంతపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి అన్నారు. ఎన్నికల సమీపిస్తుండడంతో కొంతమంది నాయకులు వస్తుంటారు? పోతుంటారు? అని విమర్శించారు. మంగళవారం రామంతపూర్ డివిజన్‌లోని కామాక్షి పురం రోడ్ నెంబర్ 7, 8లలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..త్వరలో సీసీరోడ్లు, సివరేజ్ పైప్‌లైన్స్ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రామంతపూర్‌లో కాంగ్రెస్ నాయకులు ఇక్కడ అభివృద్ధి శూన్యమని మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఒకవైపు అభివృద్ధి పనులతో రామంతపూర్ డివిజన్ దూసుకెళ్తుంటే అభివృద్ధి జరగడం లేదనడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ హయాంలో రామంతపూర్‌లో మౌలిక వసతుల దిక్కు లేదన్నారు. నేడు సీసీ రోడ్ల నిర్మాణం, నూతన డ్రయినేజీ వ్యవస్థతో రామంతపూర్ రూపురేఖలు మారుతున్నాయని చెప్పారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరారు. ఎన్నికలు వచ్చినప్పుడే ప్రజలు గుర్తుకొచ్చారా? అని ఆమె ప్రశ్నించారు. రామంతపూర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు బండారు వెంకట్రావు, తమ్మలి రవి, కల్మ కళా లింగం, పలుగుల అంజయ్య పటేల్, కాలనీవాసులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోంది

- తెలుగుదేశం మల్కాజిగిరి పార్లమెంట్ అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్ గౌడ్



నవతెలంగాణ-కీసర

బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని మల్కాజిగిరి పార్లమెంట్ తెలుగుదేశం అధ్యక్షులు కందికంటి అశోక్ కుమార్‌గౌడ్ అన్నారు. టీటీడీపీ మల్కాజిగిరి పార్లమెంట్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ధర్నా నిర్వహించి మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కంటోన్మెంట్ ఇన్‌చార్జి గడ్డి పద్మావతి, మేడ్చల్ ఇన్‌చార్జి సుంకరి వెంకటేష్, మల్కాజిగిరి కో ఆర్డినేటర్ మెంబర్స్ కర్నూల్ గోపి నరేష్ ముదిరాజ్, కుత్బుల్లాపూర్ వీరబాబు బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమమూర్తి, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి నిర్మల, ఉప్పల్ ప్రెసిడెంట్ ప్రకాష్, చిల్కానగర్ ప్రెసిడెంట్ శేఖర్ రెడ్డి, మహిళా రాష్ట్ర ఆర్గనైజ్ సెక్రెటరీ సావిత్రి, మేరీ, రాష్ట్ర మహిళా నాయకురాలు ఆశా, బిందు, యూత్ నాగారం మున్సిపల్ అధ్యక్షులు జంగారెడ్డి, సుజాత, ఘట్కేసర్ మండలాధ్యక్షులు సంజీవ గౌడ్, పోచారం డివిజన్ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి గ్రూప్‌లో రామ్మూర్తి జయంతి



నవతెలంగాణ-కాప్రా

గిడుగు రామ్మూర్తి జయంతిని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో కమలానగర్ ఆఫీసులో మంగళవారం నిర్వహించారు. గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి సామాజిక ఉద్యమ నాయకులు జయరాజు, మహిళా సంఘం నాయకురాలు శారద పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ముఖ్యఅతిథిగా హాజరైన జయప్రకాష్ మాట్లాడుతూ .. తెలుగు భాష, సంస్కృత పద బంధనాల నుంచి వేరుచేసి ప్రజల భాషలో నడిపించిన వారిలో రామ్మూర్తి ప్రముఖులని గర్తు చేశారు. గిరిజనుల భాషలలో ఒకటైన సవర భాషను అక్షర రూపం ఇచ్చి దాని అభివృద్ధి చేసి అనేక రచనలు రచించారని చెప్పారు. మహిళా సంఘం నాయకురాలు శారద మాట్లాడుతూ.. తెలుగును అభివృద్ధి పరచటంలో వారు కృషి ఎంతో చేశారని పేర్కొన్నారు. అనంతరం గొడుగు యాదగిరిరావు, కోమటి రవి ప్రసంగించారు. కార్యక్రమంలో శివన్నారాయణ, శ్రీనివాస్, ప్రసాద్ బాబు, గౌసియా, శోభ, చంద్రశేఖర్, ఎన్ శ్రీనివాస్, బసవ పున్నయ్య పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



నవతెలంగాణ-మేడ్చల్

రాష్ట్ర ప్రభుత్వం ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం మేడ్చల్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. మేడ్చల్ పట్టణంలోని మహాత్మా గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీగా వెళ్లి తహశీల్దార్ శైలజకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణలో ఉన్న నిరుపేద ఆర్యవైశ్యుల కోసం వెయ్యి కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీల మేనిఫెస్టోలో ఆర్యవైశ్య కార్పొరేషన్ అంశాన్ని పెట్టాలన్నారు. ఏ ప్రభుత్వం ఏర్పడినా ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌పట్టణ,మండల అధ్యక్షులు బద్రి నారయణ, రవికుమార్, వాసవీక్లబ్ అధ్యక్షులు కృష్ణ మూర్తి, వాసవీక్లబ్ సెక్రటరీ రమేష్‌గుప్తా, నాగేష్ గుప్తా, చంద్రశేఖర్‌గుప్తా, రాజేశ్వర్ గుప్తా, గోలి వెంకటరమణ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

- ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్

నవతెలంగాణ-మేడ్చల్

మెగాలోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ ట్రాఫిక్ సీఐ హనుమాన్‌గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 9వ తేదీ వరకు లోక్ అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. పలు రకాల పాత కేసులను పరిష్కరించుకొనేందుకు ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. డ్రంక్ అండ్ డ్రైవ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడిన వారు సంబంధిత పత్రాలతో మేడ్చల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ లో సంప్రదించాలని కోరారు. పూర్తి సమాచారం కోసం 8328079774, 04029355679, 9440521015, 9989979618, 9490617165 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

క్రీడా మైదానం కోసం స్థలం కేటాయించండి



నవతెలంగాణ-కీసర

క్రీడా మైదానం కోసం స్థలం కేటాయించాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డికి అంకిరెడ్డిపల్లి గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు. మంగళవారం నగరంలోని మంత్రి నివాసానికి వెళ్లి క్రీడా మైదానం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. వెంటనే స్పందించిన మంత్రి జిల్లా కలెక్టర్ అమోయ్ కుమార్‌కు దృష్టికి తీసుకుపోయి పరిష్కారం అయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ బెస్త వెంకటేష్, కీసర మండల బీఆర్ఎస్ అధ్యక్షులు జలాల్ పురం సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ శాఖ కన్వీనర్ శ్రావణ్



నవతెలంగాణ-ఉప్పల్

భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి సభ్యుల సమావేశంలో ఉత్సవ సమితి ఉప్పల్ కన్వీనర్‌గా నామ శ్రవణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం శ్రవణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులను, మండపాల నిర్వాకులను సమన్వయపరుస్తూ సామూహిక ఉత్సవాలు చేస్తామన్నారు. నిమజ్జోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమం లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉప్పల్ నియోజక వర్గ కన్వీనర్ రేవెల్లి రాజు, కో కన్వీనర్ మారినేని ఫణిందర్, ఉత్సవ సమితి ముఖ్య సలహాదారులు పెద్దలు గోరిగె కృష్ణ , శామీర్‌పేట్ ధర్మ రెడ్డి , మహంకాళి లక్ష్మణ్ , బింగి రమేష్ గౌడ్ , రావుల బాలకృష్ణ గౌడ్ గారు, రెడ్డిగారి దేవేందర్ రెడ్డి ఉత్సవ సమితి మాజీ కన్వీనర్లు బోరంపేట మురళి, సింగారం కార్తీక్, గోరిగె వెంకటేష్ మరియు ఉత్సవ సమితి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞం 12వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-కీసర

శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ 12వ వార్షికోత్సవ ఆహ్వాన పత్రికను కీసర మండలం విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు బాల లింగాచారి కమిటీ సభ్యులతో కలిసి చీర్యాల మల్లన్న గుడి ఆవరణలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..సెప్టెంబర్ 17వ తారీఖున శ్రీ విరాట్ విశ్వకర్మ యజ్ఞ పూజా కార్యక్రమాన్ని నాగారంలోని జీఆర్ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం మండల ప్రధాన కార్యదర్శి రాఘవేంద్ర చారి, సలహాదారులు అనంత చారి, వైస్ ప్రెసిడెంట్ రాముచారి, ఉప్పలోజు మురళి చారి, గౌరవ అధ్యక్షులు నాగరాజు చారి పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-జవహర్‌నగర్

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో జవహర్ నగర్ విద్యార్థులు ప్రతిభ చూపారు. గత ఆదివారం బెంగుళూరులో నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చి అవార్డులను సాధించారు. ప్రతిభ చూపిన వారిలో అఖిల్ చక్ర (ఫైటింగ్లో గోల్డ్, కటాస్లో సిల్వర్), రేవంత్ (ఫైటింగ్లో గోల్డ్, కటాస్ సిల్వర్), యోజిత్ (ఫైటింగ్లో సిల్వర్, కటాస్ సిల్వర్) పతకాలు సాధించారు. ఈ మేరకు మాస్టర్ నరేందర్యాదవ్, జవహర్ నగర్ ప్రజలు విద్యార్థులకు అభినందలు తెలిపారు.

'విద్యుత్ అమరుల స్ఫూర్తితో పోరాడాలి'



నవతెలంగాణ-ఘట్కేసర్

విద్యుత్ అమరవీరుల నెత్తుటి మరకల సాక్షిగా నేడు రైతాంగానికి ఉచిత కరెంట్ అందుతుందని సీపీఎం మండల కార్యదర్శి ఎన్ సబిత అన్నారు. మంగళవారం పోచారం మున్సిపాల్టీ అన్నోజిగూడ రాజీవ్ గృహకల్పలో విద్యుత్ అమరవీరుల 23వ వర్థంతి సభ నిర్వహించారు. అనంతరం మాట్లాడుతూ నాటి చంద్రబాబు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు చేతుల్లో కీలుబొమ్మగా ఉంటూ కరెంటు చార్జీలు పెంచిందన్నారు. పెంచిన కరెంటు బిల్లులు చెల్లించబోమని అసెంబ్లీ ముందుకు వచ్చిన ప్రజలపై పోలీస్ కాల్పులు జరిపారని గుర్తు చేశారు. ఆ కాల్పుల్లో సీపీఐ(ఎం) కార్యకర్తలు విష్ణువర్ధన్‌రెడ్డి, రామకృష్ణ, బాలస్వామి చనిపోయారని తెలిపారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యురాలు అలివేల, గ్రామ శాఖ కార్యదర్శి సునీత, చల్లగొండ అరుణ, వరలక్ష్మి, సత్తన్న ఉన్నారు.

సమస్యల పరిష్కారంలో ఎల్లవేళలా ముందుంటా..

- ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలకు చెందిన సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్‌ను ఆయన నివాసం వద్ద కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు, ఆహ్వాన పత్రికలు అందజేశారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వరద నీటి సమస్యల నివారణకు బాక్స్ డ్రైన్ నిర్మాణం

- కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-నేరేడ్ మెట్

వరద నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన ప్రాంతాల్లో బాక్స్ డ్రైన్ నిర్మాణం చేపడుతున్నట్టు అల్వాల్ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆమె డివిజన్ పరిధిలోని తిరుమల ఎన్ క్లేవ్ వద్ద నూతనంగా చేపట్టిన బాక్స్ డ్రైన్ పనులను మున్సిపల్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పనులలో నాణ్యత పాటించాలని సూచించారు. త్వరతగతిన పూర్తి చేయాలని ఆమె అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఈఈ రాజు, డీఈ రంజిత్ రెడ్డి, ఏఈ లక్ష్మి రామారావు, కాంట్రాక్టర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

గ్రేటర్ కాంగ్రెస్‌లో 'టికెట్' టెన్షన్

- ఢిల్లీ, హైదరాబాద్ నేతలతో టచ్‌లో ఆశావహులు
- ఒక్కొక్క నియోజకర్గం నుంచి పోటాపోటీగా దరఖాస్తులు
- గ్రేటర్‌వ్యాప్తంగా 100కుపైగా దరఖాస్తులు
- కాంగ్రెస్ పార్టీలో టికెట్ల కోసం తీవ్రమైన పోటీ



నవతెలంగాణ-సిటీబ్యూరో

కాంగ్రెస్ ఆశావహుల్లో టికెట్ టెన్షన్ మొదలైంది. పోటీ చేయాలనకుంటున్న నియోజకవర్గం నుంచి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు.. టికెట్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికివారు తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. అయితే కాంగ్రెస్ అధిష్టానం ఎవరివైపు మొగ్గు చూపుతుందో.. ఎవరికి టికెట్ కేటాయిస్తుందో తెలియని పరిస్థితి. పార్టీలో తమకు ఉన్న పలుకుబడిని ఉపయోగించి ఢిల్లీ, హైదరాబాద్‌లోని పెద్దలతో పైరవీలు చేసుకుంటున్నారు. ఫలానా సెగ్మెంట్ నుంచి తనకే అవకాశం వచ్చేలా చూడాలని మొరపెట్టుకుంటున్నారు. ఒక్కో నియోజకవర్గానికి యావరేజ్‌గా ఐదారుగురు దరఖాస్తు చేసుకొని ఉండటంతో టికెట్ల కేటాయింపుపై అధిష్టానికి పెద్ద తలనొప్పిగా మారింది. ఎవరికి ఇస్తే.. ఎలా ఉంటుంది? ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయోనని కాంగ్రెస్ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. తాజాగా ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) టికెట్ల ఎంపికపై భేటీ అవ్వగా.. ఈ మీటింగ్‌లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి ఒక నిర్ణయం రానున్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు ఆసక్తి చూపిస్తున్న వారి నుంచి టీపీసీసీ ఇటీవల దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. ఈ నెల 18 నుంచి 25 వరకు చేపట్టిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా వెయ్యికిపైగా దరఖాస్తులు రాగా.. గ్రేటర్‌లోని 24 సెగ్మెంట్ల నుంచి కూడా ఆశావహులు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో రాష్ట్రస్థాయి నేతలతో పాటు సీనియర్లు, జిల్లా స్థాయి నేతలు ఉన్నారు. అయితే ఇతర నియోజకవర్గాల కంటే పాత బస్తీలోని యాకుత్‌పురా, కార్వాన్, బహదూరపుర, చార్మినార్, చాంద్రాయణ గుట్ట సెగ్మెంట్ల నుంచి 9 నుంచి పది మధ్యలో దరఖాస్తులు రాగా.. ఒక్క గోషామహల్ నుంచే 17మంది వరకు దరఖాస్తు చేసుకున్నారని తెలిసింది. ముషీరాబాద్, ఖైరతాబాద్, సికింద్రాబాద్, సనత్‌నగర్, గోషామహల్, జూబీహిల్స్, నాంపల్లి, అంబర్‌పేట, ఉప్పల్, ఎల్బీనగర్, మల్కాజిగిరి, మహేశ్వరంతో పాటు వివిధ నియోజకవర్గాల నుంచి భారీగా దరఖాస్తులు వచ్చాయి.

పోటాపోటీగా దరఖాస్తులు..

గ్రేటర్ హైదరాబాద్‌లోని పలు నియోజకవర్గాల్లో ఆశావహులు టికెట్‌పై ఎంతో ఆశతో ఉన్నారు. కాంగ్రెస్ టికెట్ దక్కించుకునేందుకు ప్రజల మద్దతు తమకే ఉందంటూ కార్యక్రమాలు నిర్వహిస్తూ.. అధిష్టానం దృష్టిలో పడేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఎవరికివారు పోటాపోటీగా కార్యక్రమాలు చేసుకుంటూ వెళ్తున్నారు. ముషీరాబాద్ స్థానం నుంచి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్‌తో పాటు ఆయన కుమారుడు, సికింద్రాబాద్ డీసీసీ అధ్యక్షుడు అనిల్ కుమార్ పోటీ పడుతుండగా.. ఇదే సెగ్మెంట్ నుంచి పీసీసీ నేతలు నగేష్ ముదిరాజ్, సంగిశెట్టి జగదీష్, మాజీ అధ్యక్షుడు కృపారావు తనయుడు కెనెడి రాజ్ ఆశలు పెట్టుకున్నారు. కాంగ్రెస్ హైకమాండ్ సూచన మేరకు జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానానికి మాజీ క్రికెటర్ అజహరుద్దీన్ దరఖాస్తు చేసుకున్నట్టు చెబుతుండగా.. ఇప్పటికే అక్కడి నుంచి పీజేఆర్ తనయుడు మాజీ ఎమ్మెల్యే విష్ణువర్ధన్‌రెడ్డి దరఖాస్తు చేసుకున్నారు. ఖైరతాబాద్ స్థానంపై కార్పొరేటర్ విజయారెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, డీసీసీ అధ్యక్షులు రోహిణీ రెడ్డి, పీసీసీ నేత వినోద్ రెడ్డిలు ఆశలు పెట్టుకున్నారు. సనత్ నగర్ నుంచి పీసీసీ కార్యదర్శి కోటా నీలిమ, మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి తనయుడు మర్రి ఆదిత్య రెడ్డి, రవీందర్ గౌడ్, సీనియర్ నాయకులు నాగేందర్ రాజ్ టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఎవరికి వారే రంగంలో దిగి ప్రజా మద్దతు పొందేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక సికింద్రాబాద్ కోసం వ్యాపారవేత్త నోముల ప్రకాశ్ రావు, సాయిబాబా, ఆదం సంతోష్ కుమార్‌తోపాటు పలువురు టికెట్ ఆశిస్తుండగా.. అధిష్టానం ఆదేశాల మేరకు కంటోన్మెంట్ నుంచి సర్వే సత్యనారాయణ దరఖాస్తు చేసుకున్నట్టు చెబుతున్నారు. ఇక్కడి నుంచి బోల్లు కృష్ణ, మరో ఇద్దరు ఆశావహుల జాబితాలో ఉన్నారు. గోషామహల్ స్థానం నుంచి పీసీసీ నేత మెట్టు సాయికుమార్, మధుసూధన్ గుప్తా, వినయ్‌కుమార్ ముదిరాజ్‌లతో కలిపి మొత్తం 17 మంది రేసులో ఉన్నారు. నాంపల్లి నుంచి ఫిరోజ్ ఖాన్, మరొకరు దరఖాస్తు చేసుకున్నారు. అంబర్‌పేట్ నుంచి లక్ష్మన్ యాదవ్, మోతా రోహిత్, నూతి శ్రీకాంత్ గౌడ్ ఆశలు పెట్టుకున్నారు. ఉప్పల్ నుంచి ఏ-బ్లాక్ అధ్యక్షుడు పరమేశ్వర్‌రెడ్డి, బి-బ్లాక్ అధ్యక్షుడు సోమశేఖర్ రెడ్డి, రాగిడి లక్ష్మా రెడ్డి, మేకల శివారెడ్డి, పసుల ప్రభాకర్ రెడ్డి దరఖాస్తు చేసుకోగా. ఎల్బీనగర్ నుంచి మధుయాస్కీ గౌడ్, మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, మిద్దెల జీతేందర్, సూదిని మహేందర్ రేసులో ఉన్నారు. మల్కాజిగిరి నుంచి నంది కంటి శ్రీధర్, కూకట్‌పల్లి నుంచి శ్రీరంగం సత్యం, వెంకట్రావు, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి తదితర అసెంబ్లీ స్థానాల నుంచి టికెట్లకు తీవ్ర పోటీ నెలకొంది. అయితే తాజా పీఈసీ భేటీ నేపథ్యంలో ఒక్కో నియోజకవర్గానికి మూడు దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఆశావహులు అందరూ అధిష్టానం నిర్ణయం కోసం చూస్తున్నారు.

ఇండ్లను కూల్చేందుకు వచ్చిన జేసీబీని అడ్డుకున్న స్థానికులు



నవతెలంగాణ - కూకట్ పల్లి

59 జీఓ క్రమబద్దీకరణ రుసుములు చెల్లించనందుకు కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డి నగర్‌లో ఇండ్లను కూల్చేందుకు జేసీబీతో వచ్చిన రెవెన్యూ సిబ్బందిని స్థానికులు అడ్డుకున్నారు. జేసీబీని తిరిగి పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రూ. 10,20,30,40,80 లక్షల వరకు రుసుములు కట్టాలంటే మధ్య తరగతికి కుటుంబీకులు ఏ విధంగా కట్టగలరని ప్రశ్నించారు. ఈ విషయంపై ఎమ్మెల్యే గాంధీ, ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణలు ఎమ్మార్వో, కలెక్టర్‌తో మాట్లాడారు. ఈ విషయమై పాపిరెడ్డి నగర్ వాసులను వేధించవద్దని పాపిరెడ్డి నగర్ కంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా కాలనీ నాయకులు పెద్ద సంఖ్యలో ఎమ్మార్వో ఆఫీస్ కు తరలి వెళ్లగా అక్కడకు కలెక్టర్ రాగా వారికి కార్పొరేటర్‌తో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈరెడ్డి దేవేందర్ రెడ్డి,చిట్టి రెడ్డి గోపాల్ రెడ్డి, దొడ్ల రామిరెడ్డి, నగేష్, ఎడ్ల సంపత్ రెడ్డి ,ముత్యం వెంకట్ రెడ్డి, రామకష్ణారెడ్డి, శరత్ రెడ్డి ,కె.వి.రాజు, ఉపేందర్ రెడ్డి ,శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, కనక రెడ్డి, తడికల రాజిరెడ్డి, పాపిరెడ్డి నగర్ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి అడుగడుగునా జన నీరాజనం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

రాష్ట్రంలో చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు అడుగడుగునా నీరాజనం పలుకుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు తెలిపారు. 23వ రోజు పాదయాత్ర లో బాగంగా ఎమ్మెల్యే మూసా పెట్ డివిజన్‌లో మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ తో కలసి పాదయాత్ర నిర్వహించారు. మూసాపేట్‌లోని పలు ప్రాంతాలలో మంచినీటి సమస్య ఉందని స్థానికులు తెలియజేయడంతో, వెంటనే వాటర్ వర్క్స్ అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి వారం రోజుల్లో మంచినీళ్ల సరఫరా జరిగే విధంగా కషి చేస్తాం అని చెప్పారు. మంత్రి కేటీఆర్ సహకారంతో, మూసాపేట్ డివిజన్ లో 50 సంవత్సరాలుగా పరిష్కారం కాని సమస్యలను పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ : పెన్షన్ దారులకు కేసీఆర్ అందించే పింఛనే ఆసరా అని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కూకట్ పల్లిలోని ఎస్.ఆర్.సి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం



వికలాంగుల పెన్షన్ నెలకు రూ.3016 నుంచి రూ.4016కు పెంచడం జరిగిందన్నారు. పెన్షన్ దారులకు సీఎం కేసీఆర్ పెద్ద కొడుకులా నెల నెల పింఛన్ ఇచ్చి వారి బతుకుకు భరోసాగా నిలుస్తుండన్నారు. అనంతరం తెలంగాణలో వికలాంగులకు ఆసరా పెన్షన్ అమల్లోకి రావడంతో హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్ర పటానికి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా వారికి ఎమ్మెల్యే, జీహెచ్ఎంసీ కమి షనర్ ప్రొసీడింగ్స్ అందజేశారు. బాలాజీనగర్ కార్పొరేటర్ శిరీష బాబురావు, సభియ గౌసుద్దీన్, ముద్దం నర్సింహా యాదవ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

సీఎం కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్‌లో చేరేందుకు ముందుకు వస్తున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం కే.పి.హెచ్.బి కాలనీలో బీజేపీ సీనియర్ నాయకులు బచ్చు నాగ మల్లేశ్వర్‌తో 60



మంది బీజేపీకి రాజీనామా చేసి కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు, బీఆర్ఎస్ కోఆర్డినేటర్ సతీష్ అరోరాల అధ్వర్యంలో ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన పార్టీ కండువాలను కప్పి సాధరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలకు ఆకర్షితులమై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నాం అని తెలిపారు. మతాలకు, కులాలకు మధ్య చిచ్చులు పెట్టడం తప్ప బీజేపీ రాష్ట్రానికి చేసింది ఏమీలేదన్నారు. ఎమ్మెల్యే చేస్తున్న అభివద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగిందన్నారు. ఎమ్మెల్యే గెలుపే లక్ష్యంగా పార్టీ కోసం నిస్వార్థంగా పనిచేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలి

- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

జగద్గిరిగుట్ట చివరి బస్‌స్టాప్ ప్రాంగణంలో ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం జగద్గిరిగుట్ట లాస్ట్ బస్టాప్‌లో ప్రజలు, ప్రయాణికులు నిలబడడానికి ఇబ్బందిగా ఉండడంతోపాటు, బస్టాప్ శిధిలా అవస్థకు చేరడంతో సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు ఏఈ తిరుపతి స్థానిక నాయకులతో కలిసి కార్పొరేటర్ సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్టాప్‌లో ఉన్న ఫుట్‌పాత్ మరమ్మత్తు పనులు వెంటనే ప్రారంభించాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు విట్టల్ ముదిరాజ్, మురళి, గణేష్ ,సంగప్ప, యాకయ్య, విగ్నేష్ , కిరణ్ చారి, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ కూకట్ పల్లి డివిజన్ మహిళా నూతన కమిటీ ఏర్పాటు

నవతెలంగాణ - కూకట్‌పల్లి

కూకట్ పల్లి డివిజన్ మహిళా అధ్యక్షురాలు కృష్ణ వేణి ఆధ్వర్యంలో ఆమె నివాసంలో మహిళా కాంగ్రెస్ నూతన కమిటిని మంగళవారం నియమించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేశారు, ముఖ్య అతిథులుగా, రాష్ట్ర మహిళా జనరల్ సెక్రటరీ పుష్ప రెడ్డి, మేడ్చల్ జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ జ్యోతి, కూకట్ పల్లి మహిళా ఇన్‌చార్జి రాజ్య లక్ష్మి, ఏ బ్లాక్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి లు హాజరై వారి చేతుల మీదుగా కమిటీ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో, డివిజన్ ప్రెసిడెంట్‌లు రేణుక, విజయ్ లక్ష్మి, భారతమ్మలు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా మల్కాజిగిరి అభివృద్ధి



- ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

రాజకీయాలకతీతంగా మల్కాజిగిరి అభివృద్ధి చేస్తున్నా నని ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. వినాయకనగర్ డివిజన్ పరిధిలోని డీపీవీ స్కూల్ దగ్గర, అదే విధంగా వినోభ నగర్ ఏరియాలలో సుమారు రూ 35 లక్షలతో నూతనంగా చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మితో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని డివిజన్ లలో అభివృద్ధి పనులు వేగవంతం చేశానన్నారు. అవసరమైన ప్రతీ బస్తి ,కాలనీలలో మౌలిక సదుపాయాలు కల్పనకు తన వంతు కృషి చేస్తున్నానని తెలిపారు. ఆయా పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించి, సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి, ప్రజలకు వినియోగంలోకి తీసుకుని వస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు , ఈఈ లక్ష్మణ్, డీఈ లౌక్య ఏఈ దీపక్, సతీష్ కుమార్, గుండా నిరంజన్, డివిజన్ అధ్యక్షుడు సూరి, ఓమ్ ప్రకాష్, ఫరీద్,ప్రభాకర్ రెడ్డి,బాలకష్ణ గుప్త,పేపర్ శ్రీను, భాస్కర్,పిట్ల, గోపాలకష్ణ, నాగరాజు, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

మెట్ల నిర్మాణ పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే

మల్కాజిగిరి : గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని హిల్ టాప్ కాలనీలో రూ. 15 లక్షలతో గుట్ట పైకి మెట్ల నిర్మాణ పనులను ఎమ్మెల్యే మైనం పల్లి హన్మంతరావు కార్పొరేటర్ మేకల సునీత రామూయాదవ్ తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని డివిజన్లలో అభివృద్ధి పనులు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈ లౌక్య, ఏఈ దివ్య జ్యోతి, సీనియర్ నాయకుడు మేకల రామూయాదవ్, వర్క్ ఇన్స్పెక్టర్ నరేందర్ నాయకులు కార్యకర్తలు హిల్ టాప్ కాలనీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ బీజేఆర్ నగర్‌లో ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు కార్పొరేటర్ ప్రేమ్ కుమార్ రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్ వర్క్, ఇన్‌స్పెక్టర్ రజినీకాంత్, బాబు, సత్యనారాయణ, సంపత్ రావు, ఉమాపతి, ఆంజనేయులు, శ్రీనివాస్, సుధార్షన్, భాస్కర్, సంపత్,పాల్గొన్నారు.



ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మల్కాజ్గిరి డివిజన్ పరిధిలోని శివపురి కాలని శివాలయంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గుడి మెట్ల మార్గం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, అధికార ప్రతినిధి జీఎన్‌వీ సతిష్ కుమార్, రామూయాదవ్, సంతోష్ రాందాస్, ఆలయ కమిటీ సభ్యులు మూర్తి, సోమా శ్రీనివాస్, మోహన్ రెడ్డి, లోకేష్, మల్లికార్జున్, రామ్ శర్మ, సుబ్రమణ్యం,తదితరులు పాల్గొన్నారు.

వంశీ కృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో 'ప్రాజెక్ట్ బేస్ లర్నింగ్'



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

పీబీఎల్ (ప్రాజెక్టు బేస్ లర్నింగ్) విద్యా విధాన నిర్వహణ... టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ మేనేజింగ్ డైరెక్టర్ టీ. వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. కార్యక్రమాన్ని టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ డైరెక్టర్ "దీప్తి రెడ్డి" పర్యవేక్షించారు. టీవీఆర్ మోడల్ హై స్కూల్ అపురూప కాలనీ నుంచి 120 మంది , "సత్యవాణి విద్యా నికేతన్ హై స్కూల్ " ఎస్.ఆర్ నాయక్ నగర్ నుంచి 95 మంది.. సుమారు 215 మంది 9వ తరగతి విద్యార్థులు వివిధ ప్రాజెక్ట్ తయారీ చేయడంలో పాల్గొని గణితంలోని సాంఖ్యక శాస్త్రం ఉపయోగాలు జీవ వైజ్ఞానిక శాస్త్రాలు మానవ మనుగడకు ఎలా దోహదపడతాయి అన్న విషయాలను తరగతిలో అధ్యాపకులు బోధించిన గణిత జీవ విజ్ఞాన శాస్త్రాలలో నుంచి నేర్చుకొని తమకున్న పరిజ్ఞానంతో నమూనాలు తయారు చేసి ప్రదర్శించారు. తల్లిదండ్రులు పలు విషయ పరిజ్ఞానంపై ప్రశ్నలు వేసి తమ పిల్లల పరిజ్ఞాన శక్తిని పరీక్షించారు. గణితసంఖ్యాక శాస్త్రం ద్వారా సర్వే చేసి ఎవరు ఏ టీవీ చానల్స్ ఎంతమంది ఎక్కువగా చూస్తున్నారు. వాటి ప్రయోజనాలు నష్టాలను తెలిపారు. కరోనా తర్వ పరిణామాల నుంచి మనిషి ముట్టుకున్న పట్టుకున్న వాసన చూసినా వ్యాపించే జబ్బుల నుండి అత్యంత ముఖ్యమైన జ్ఞానేంద్రియాలను ఇలా సంరక్షిం చుకోవాలి.. రోగనిరోధక శక్తిని ఎలా పెంపొందించుకోవాలి అన్న విషయాలపై తయారుచేసిన నమూనాల ద్వారా విద్యార్థులు వివరించారు. వారు చెప్పిన సమాధానాలకు తల్లిదండ్రులు అబ్బుర పడ్డారు నూతన విద్యా విధానం ద్వారా జ్ఞాన సంపదని అందిస్తున్న టీవీఆర్ యాజమాన్యం పట్ల హర్షం వ్యక్తం చేశారు . టీవీఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ టీ. కోటి రెడ్డి అకాడమిక్ డైరెక్టర్, డాక్టర్ సురా రవిచంద్ర రెడ్డి లు విషయ పరిజ్ఞానంలో నిష్ణాతులైన విద్యార్థులను వారిని తీర్చిన దిద్దిన ఉపాధ్యాయ బందాన్ని అభినందించారు.

గులాబి గూటికి చేరిన బీజేపీ నాయకులు



నవతెలంగాణ - కూకట్ పల్లి

బీజేపీ మేడ్చల్ జిల్లా ఎస్సీ మోర్చ ఉపాధ్యక్షుడు జక్కుల రాజు, బీజేపీ కూకట్ పల్లి డివిజన్ కార్యదర్శి కూతురు సాయి కిరణ్ బీజేపీకి రాజీనామా చేసి మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు సమక్షంలో బీఆర్ఎస్ కండువా కప్పుకుని గులాబి గూటికి చేరారు. బీజేపీ గ్రూప్ రాజకీయాలకు ఇమడలేకే పార్టీకి రాజీనామా చేస్తున్నామని వారు తెలిపారు. అలాగే కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎమ్మెల్యే చేస్తున్న అభివద్ధిని చూసి బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నాం అని తెలిపారు. గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఎమ్మెల్యే స్వాగతించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారయణ, కూకట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొట్టు విష్ణు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యం



- బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ డివిజన్ పరధిలోని ప్రతి కాలనీలో తాగునీటి సమస్య, డ్రయినేజీ సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నామని, గతంలో కంటే అధికంగా మంచినీటి సరఫరా విషయంలో ప్రత్యేక దష్టి సారించినట్టు బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని కార్పొరేటర్ తెలిపారు. బాలానగర్ డివిజన్ పరిధిలోని సాయినగర్, కళ్యాణి నగర్ లలో నెలకొన్న ప్రధాన నీటి సమస్య పరిష్కారం దిశ చర్యలో భాగంగా జలమండలి మేనేజర్ అనిల్ కుమార్, కాంట్రాక్టర్ స్వామితో పాటు స్థానికులు చంద్రపాల్‌తో కలిసి కార్పొరేటర్ మంగళవారం పనులను పరిశీలించారు. నీటి సమస్యలు తలెత్తకుండా నీటి సరఫరా మెరుగుప ర్చాలని, పురాతన పైపులైన్లను ఆధునీకరించాలని సూచించారు. భూగర్భ డ్రయినేజీ సమస్యలు ఉంటే పరిష్కరించి, డ్రయినేజీ నుంచి తీసిన సిల్ట్‌ను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మనోహర్ రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్లు, ప్రేమ్ కుమార్, దగ్గుబాటి వెంకటేష్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన పంజాగుట్ట చౌరస్తాలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బోరబండ కు చెందిన రమ్య ఎర్రమంజిలోని ఓ సంస్థలో హౌస్ కీపింగ్ ఉద్యోగం చేస్తున్నది. పంజాగుట్ట చౌరస్తాలో ఆమె రోడ్డు దాటుతున్న కాలంలో జగదిరిగుట్ట నుంచి మెహిదీపట్నం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్ర రక్తస్రావమైన ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. రమ్యకు ఇద్దరు ఆడపిల్లలు, 8 ఏండ్ల బాబు ఉన్నాడు. మృతురాలి భర్త అనారోగ్యంతో ఇంటి వద్ద ఉంటుండగా కుటుంబ పోషణ మొత్తం రమ్యనే చూసుకుంటుందని, ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని బంధువులు వేడుకున్నారు.

నవతెలంగాణ - బాలానగర్

ఎమ్మెల్సీని కలిసిన కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్



నవతెలంగాణ - కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ సబ్ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు తీసుకున్న మహేందర్ మంగళవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును మంగళవారం శంభీపూర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ సబ్ రిజిస్ట్రార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్సీతో ఎమ్మెల్యే భేటీ

- విభేదాల సమస్య ఒక కొలిక్కి..!



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు సోమవారం మంత్రి హరీశ్ రావుతో భేటీ అయినా నేపథ్యంలో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ మధ్య విభేదాల సమస్య ఒక కొలిక్కి వచ్చినట్లు తెలుస్తున్నది. మంగళవారం ఉదయం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును ఆయన నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య చర్చలు జరిగాయి. దీంతో ఇన్నాళ్లు సందిగ్ధంగా ఉన్న వీరి మధ్య విభేదాలకు శుభం కార్డు పడినట్టేనని బీఆర్ఎస్ వర్గాలు భావిస్తున్నాయి. ఇద్దరు కలవడంతో ఎమ్మెల్యే వివేకానంద్ ముచ్చటగా మూడోసారి గెలుపు సులభతరంగా మారపోతుందని గులాబీ శ్రేణులు,, అభిమానులు, శ్రేయోభిలాషులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి హరీశ్‌రావు భేటీతో కొలిక్కి...

గత రెండు సంవత్సరాల నుంచి ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు , ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ లు దూర దూరంగా ఉంటూ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఎమ్మెల్యే కార్యక్రమాలకు డివిజన్‌లోని కొందరు కార్పొరేటర్లు రాకపోవడంతో ప్రజలలో చర్చనీ అంశంగా మారింది. ఈ క్రమంలో అధిష్టానం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్‌కు కేటాయించిన అనంతరం వీరి ఇరువురి మీద అనేక వార్తలు ప్రచారం అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం శంభీపూర్ రాజు స్వయంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ నివాసానికి శుభాకాంక్షలు తెలిపేందుకు వెళ్లారు. ఆ సమయంలో ఎమ్మెల్యే లేకపోవడంతో ఎమ్మెల్సీ తిరిగి వెళ్లిపోయారు. అదేవిధంగా టికెట్ కేటాయించిన తర్వాత మూడుసార్లు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీ ని కలవడానికి ఆయన నివాసానికి వెళ్లినట్టు సమాచారం. అప్పటికే ఎమ్మెల్సీ బయటికి వెళ్లినట్టు తెలిసింది. వీరి మధ్య కొనసాగుతున్న విభేదాలు మంత్రి హరీశ్‌రావు వద్దకు చేరగా మంత్రి చొరవతో ఆయన సమక్షంలో చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో ప్రధాన అంశంగా మారిన ఎమ్మెల్సీ - ఎమ్మెల్యే వివాదం మంగళవారం అంతా క్లియర్ అయినట్టుగా కనిపిస్తోంది. అయితే ఇన్నాళ్ల తారస్థాయిలో ఉన్న విభేదాలు పక్కన పెట్టి కలిసికట్టుగా ఎన్నికలలో పని చేస్తారా అనే అంశాలపై ప్రశ్నార్థంగా ఉందని కొందరు చెబుతున్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ముఖ్య అనుచరులు, అభిమానుల సైతం ఎమ్మెల్యే వివేకానంద్ వ్యవహార శైలిపై గుర్రుగా ఉన్న నేపథ్యంలో వారిని కూడా ఎమ్మెల్యే కలుపుకొని పోయినప్పుడే సమస్యకు పూర్తిగా పరిష్కారం లభిస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

చీఫ్ సిటీ ప్లానర్‌ను కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ - కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం హైదరాబాద్ చీఫ్ సిటీ ప్లానర్ రాజేంద్రప్రసాద్ నాయక్‌ను కలిసి బోయిన్ పల్లిలోని రోడ్డు వెడల్పు పనుల గురించి చర్చించారు. ఈ పనులు త్వరగా పూర్తి చేసేటట్టు చర్యలు తీసుకోవాలని ,అలాగే రోడ్డుకి ఇరువైపులా దుకాణదారులు ఉన్నారని.. వారికి నష్టపరిహారం కూడా త్వరగా అందించేలా ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించి ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా అందరికీ న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

'ప్రజలు ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోరా..'

నవతెలంగాణ - బాలానగర్



కొంపల్లి మున్సిపాల్టీ 11 వ వార్డ్ శర్మా లేన్‌లో డ్రయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని స్థానికులు తన దృష్టికి తెచ్చారని,ప్రజల ఇబ్బం దులు పడుతుంటే పట్టించుకోరా అని కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కందాడి జ్యోత్స్న శివారెడ్డి అధికారులపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె ఆయా ప్రాంతాల్లో సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. వర్షాలు కురిసే సమయంలో డ్రయినేజీ నుంచి మురుగు పొంగి పొర్లుతూ రోడలపై ప్రవహిస్తూ దుర్గంధం వెదజల్లుతూ దోమలబారిన పడుతుంటే ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు సమాచారం అందించి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ మేరకు స్పందించిన అధికారులు తక్షణమే సమస్యను పరిష్కరిస్తామని వారు తెలిపారని జ్యోత్స్న శివారెడ్డి చెప్పారు.

లబ్దిదారుల ఎంపిక యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

- హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్



నవతెలంగాణ-సిటీబ్యూరో

గృహలక్ష్మి లబ్దిదారుల ఎంపిక యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో క్షేత్ర స్థాయి ప్రత్యేక అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్థానిక ప్రజా ప్రతినిధులతో చర్చించి త్వరగా లబ్దిదారుల జాబితాను సేకరించాలని సూచించారు. దీనిపై ప్రతి వారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్షా నిర్వహిస్తున్నారని, ఈ పథకం ప్రాధాన్యతను గుర్తించి త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన జీవో 25 ప్రకారం అర్జీదారులు, ఆహార భద్రతా కార్డు, స్థలం భార్య పేరు మీద ఉండాలని, భార్య చనిపోతే భర్తకు ఇస్తారని, సంబంధిత నియోజకవర్గంలో నివాసం ఉండేవారు మాత్రమే అర్హులని తెలిపారు. ఆర్‌సీ రూఫ్ ఉన్న ఇల్లు, జీవో 59 కింద లబ్ది పొందిన వారు అర్హులు కారని తెలిపారు. అర్హతలు ఉన్నవారిని వెంటనే పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ప్రభుత్వం ఈ పథకం కింద ఒక్కొక్కరికి మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయం చేస్తుందని, మొదటగా బేస్‌మెంట్ పూర్తి చేస్తే ఒక లక్ష, స్లాబ్ పూరైతే మరో లక్ష, ఇల్లు పూరైయిన వెంటనే ఇంకొక లక్ష లబ్దిదారుల ఖాతాల్లో జమ చేస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్, డీఆర్వో వెంకటాచారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లక్ష్యాలకు అనుగుణంగా రుణాలు అందించాలి



- బ్యాంకర్లు అర్హులైన లబ్దిదారులను గుర్తించాలి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

నవతెలంగాణ-సిటీబ్యూరో

లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకర్లు అర్హులైన లబ్దిదారులను గుర్తించి రుణాలు అందించాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలోని బ్యాంకర్లు, సంబంధిత అధికారులతో డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశం నిర్వహించారు. అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అధ్యక్షతన గత జూన్ త్రైమాసికంలో జిల్లా పనితీరును సమీక్షించడానికి ఈ సమావేశం జరిగింది. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు బ్యాంకులు జూన్ త్రైమాసికంలో 67.70శాతం లక్ష్యాన్ని సాధించినదుకు బ్యాంకర్లందరినీ అభినందించారు, లక్ష్య సాధనలో వెనుకబడిన బ్యాంకర్లు తమ పనితీరును మెరుగుపర్చుకోవాలన్నారు. రైతులకు పంట రుణాలు, టర్మ్ లోన్‌లు, వ్యవసాయ అనుబంధ రుణాలు విరివిగా అందించాలని సూచించారు. ఎస్సీ, ఓస్టీ, బీసీ మైనారిటీ, పరిశ్రమలు, డీఆర్‌డీఓ తదితర శాఖల ద్వారా ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు బ్యాంకులు ఉపాధి యూనిట్ల స్థాపన, చిన్న, మధ్య తరహా, విద్య, గృహ నిర్మాణం, ఇతర ప్రాధాన్యత రంగాలకు అర్హులైన పేద లబ్దిదారులకు మంజూరు చేయాలని కోరారు. చిరు వ్యాపారులు తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి అవగాహన కలిగిస్తూ విరివిగా రుణాలు అందించాలని కోరారు. ప్రభుత్వ శాఖల అధికారులు, బ్యాంకర్లు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు నిర్ణిత గడువులోగా రుణాలు మంజూరు చేయాలన్నారు. బ్యాంకులో దరఖాస్తులు పెండింగులో లేకుండా చూసుకోవాలని, తిరస్కరణకు గురైన వాటిని పరిశీలించి తగు రీతిలో బ్యాంకులు పంపాలని అధికారులకు సూచించారు. నెలకోసారి లేదంటే రెండు నెలలకోసారి తప్పనిసరిగా బ్యాంకర్స్ బెనిఫిషరీ మీటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల రుణాలను సకాలంలో తిరిగి చెల్లించే విధంగా బ్యాంకర్లు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వన్ టైం సెటిల్మెంట్‌పై ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆర్థిక అక్షరాస్యత, నగదు రహిత డిజిటల్ లావాదేవీలపై అవగాహనా కల్పించాలని బ్యాంకర్లకు సూచించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులు, ఆర్బీఐ ఎల్‌డీఓ తాన్య, నాబార్డ్ డీడీఎం సురభి, జీఎండీఐసీ రవీందర్, జెడ్పీ సీఈఓ దేవ సహాయం, జిల్లా వ్యవసాయ అధికారిణి మేరీ రేఖ, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి నీరజా గాంధీ, ఆయా బ్యాంకుల మేనేజర్లు, డీఆర్డీఓ పద్మజారాణి, మెప్మా, ఎస్సీ కార్పొరేషన్, డీఐసీ, కేవీఐసీ, ఆర్బీఐ, నాబార్డుతోపాటు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగదీష్‌రెడ్డిని మంత్రి పదవి నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలి

- వట్టే జానయ్య యాదవ్‌పై కేసులను ఎత్తేయాలి
- ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డిని మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. వట్టే జానయ్య యాదవ్‌పై ఉన్న కేసులను వెంటనే ఎత్తేయాలని కోరుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ బీసీలు, యాదవులను రాజకీయంగా ఎదగనీయకుండా అణచివేస్తుందన్నారు. వట్టే జానయ్య యాదవ్‌పై ఉన్న కేసులను వెంటనే ఎత్తేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి బీఆర్ఎస్‌లో క్రియాశీలకంగా పని చేసిన నాయకుడు వట్టే జానయ్య యాదవ్ అన్నారు. జానయ్య యాదవ్ రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛను మంత్రి జగదీష్ రెడ్డి అణచివేస్తున్నాడన్నారు. బీఆర్ఎస్‌లో బీసీలు, యాదవులకు తగిన గుర్తింపు లేదన్నారు. 2023లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బీసీలు, యాదవులు బీఆర్ఎస్‌కు ఓటు రూపంగా తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర అధి నాయకత్వం మంత్రి జగదీశ్ రెడ్డి పై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ జగదీశ్ రెడ్డిని మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. జానయ్య యాదవ్‌కు అండగా ప్రజా పార్టీ ఉంటుందన్నారు. జానయ్య యాదవ్‌కు ఇష్టం ఉంటే ప్రజా పార్టీ తరుపున సూర్యాపేట అసెంబ్లీ అభ్యర్థిగా ప్రకటిస్తామన్నారు.

ఉద్యోగుల పదోన్నతుల్లో ముజీబ్ కృషి, సహకారం మరువలేనిది

- పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్
- డాక్టర్ ముజీబ్‌ను సన్మానించిన కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

పౌరసరఫరాల శాఖ ఉద్యోగుల(జూనియర్ అసిస్టెంట్లు) పదోన్నతుల విషయంలో తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేనీ ముజీబ్ కృషి, సహకారం మరువలేనిదని పౌరసరఫరాల శాఖ కమిషనర్ అనిల్ కుమార్ కొనియాడారు. ఈ మేరకు మంగళవారం కమిషనర్ అనిల్ కుమార్‌తో పాటు సంయుక్త సంచాలకులు ఉషారాణి, ఆ శాఖ సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిని ముజీబ్ మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు. అనంతరం కమిషనర్ ఉద్యోగుల సమక్షంలో డాక్టర్ ముజీబ్‌కి బోకే అందించి శాలువాతో సన్మానించారు. ఆతర్వాత టీఎన్జీవో భవన్‌లో జిల్లా విద్యా శాఖ, పౌరసరఫరాల శాఖ ఉద్యోగులు ముజీబ్, సెక్రటరీ విక్రమ్ కుమార్‌ను సన్మానించారు. ముఖ్యంగా విద్యాశాఖలో 48 మందికి ఒకేసారి కారుణ్య నియామకాలు రావడం, ఈ విషయంలో అధ్యక్షుడు ముజీబ్ గత రెండేండ్లుగా విశేష కృషి చేశారని, నేడు చనిపోయిన ఉద్యోగుల కుటుంబాలకు ఆసరా దొరికిందని జిల్లా సహాధ్యక్షుడు, స్కూల్ ఎడ్యూకేషన్ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్ రాజ్ కుమార్ కొనియాడారు. పౌరసరఫరాల శాఖలో మరో ఎనిమిది మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించడంలో నెలకొన్న సందిగ్ధతను తొలగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డాక్టర్ ముజీబ్ మాట్లాడుతూ జీవో నెంబర్ 79 విడుదల చేసి కారుణ్య నియామకాలు జరిగేలా చేసిన సీఎం కేసీఆర్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, రాష్ట్ర అధ్యక్షులు ఎం.రాజేందర్, ప్రధాన కార్యదర్శి ఎం. జగదీశ్వర్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా ఉద్యోగంలో చేరినవారు బుద్ధిగా క్రమశిక్షణతో పనిచేస్తూ కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుర్రాడి శ్రీనివాస్ ఖాలెద్ అహ్మద్, వైదిక్ శస్త్ర, ముఖీమ్ ఖురేషి, పౌరసరఫరాల యూనిట్ సభ్యులు రజ్వి, సుధీర్, నందరాజు, విద్యాశాఖ కార్యదర్శి ఎం.భాస్కర్ అసోసియేట్ ప్రెసిడెంట్ డేవిడ్, సంఘం నాయకులు ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు విస్తరణ చేపట్టి డివైడర్లు నిర్మించాలి : సురభి రవీందర్ రావు



నవతెలంగాణ-కూకట్ పల్లి

ఉషా ముళ్ళపూడి కమాన్ నుంచి ఎల్లమ్మబండ మీదుగా గాజులరామారం వెళ్ళే రహదారి మధ్యలో డివైడర్ నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు చేయకుండానే ఏర్పాటు చేయడం నిరసిస్తూ, ఉషా ముళ్ళపూడి కమాన్ నుంచి మహంకాళి నగర్ చౌరస్తా వరకు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు, డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సురభి రవీందర్ రావు మాట్లాడుతూ రోడ్డు విస్తీర్ణం చేపట్టకుండా, విశాలమైన డివైడర్‌లు నిర్మించడం వల్ల నిత్యం ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుందని, అలాగే ప్రమాదాలకు కారణమవుతుందన్నారు. కాబట్టి ముందు రోడ్డు విస్తరణ చేపట్టి సమస్యను పరిష్కరించాలని కోరారు. బీజేపీ నాయకులు నరేందర్ రెడ్డి, బీజేవైఎం నాయకులు కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

టాంక్ బండ్‌పై ఏఎన్‌ఎంల రాస్తారోకో

నవతెలంగాణ-అంబర్‌పేట



కాంట్రాక్ట్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో 15వ రోజు సమ్మె సందర్భంగా హైదరాబాద్ నగరంలో ఏఎన్ఎంలు టాంక్ బండ్ వద్ద రాస్తా రోకో చేశారు. పోలీస్‌లు బలవంతంగా అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో కాస్త ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన యూనియన్ నగర అధ్యక్షులు జే కుమారస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఏఎన్ఎం అందర్నీ డైరెక్ట్ గా రెగ్యులర్ చేయడానికి అవకాశాలు ఉన్నా యన్నారు. కానీ రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టకుండా మొండిగా రాత పరీక్ష ద్వారానే రిక్రూట్మెంట్ చేస్తామని అంటున్నదన్నారు. గతంలో లేని పోస్టులు చర్చల అనంతరం ఎలా పెరిగాయని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర జనాభా ప్రాతిపదికన, సబ్ సెంటర్ ప్రాతిపదికన గనుక లెక్కలు తీస్తే ఏఎన్ఎం పోస్టులు పెరగడానికి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయన్నారు. దీనివల్ల రాష్ట్రంలో ఉన్న ఏఎన్ఎం లందరినీ రెగ్యులర్ చేయడానికి అవకాశం ఉంటుంది అన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో గతంలో పారామెడికల్ సిబ్బందిని, మెడికల్ ఆఫీసర్లను ఎలాంటి రాత పరీక్ష లేకుండా రెగ్యులర్ చేసినప్పటికీ ఏఎన్ఎంల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ద్వంద వైఖరి ఎందుకు అవలంబిస్తున్నది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఏఎన్ఎం అందరిని రెగ్యులర్ చేయాలని, లేని పక్షంలో సమ్మె ఉధృతంగా ముందుకు వెళుతుందని, ఏదైనా జరిగితే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు తెలంగాణ యునైటెడ్ మెడి కల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కోశాధికారి ఎ. కవిత ,నగర ప్రధాన కార్యదర్శి కిరణ్మ యి, నగర నాయకులు రాజేశ్వరి, లక్ష్మి, అమ్మాజీ, విజయ, ప్రణయ శీల తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దురుసుగా ప్రవర్తించిన డీసీపీపై చర్యలు తీసుకోవాలి

- హెచ్‌యూజే డిమాండ్

నవతెలంగాణ-సిటీబ్యూరో

మెగా డీఎస్సీ కోరుతూ నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనను కవరేజీ చేస్తున్న మీడియా ప్రతినిధులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడాన్ని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (హెచ్‌యూజే) తీవ్రంగా ఖండించింది. మంగళవారం నిరుద్యోగుల ఆందోళన సమయంలో డీసీపీ వెంకటేశ్వర్లు మీడియా ప్రతినిధులపై దురుసుగా ప్రవర్తించారని, ఆయనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని హెచ్‌యూజే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.అరుణ్‌కుమార్, బి.జగదీశ్వర్ డిమాండ్ చేశారు. వార్త కవరేజికి వెళ్లిన పలువురు జర్నలిస్ట్‌లను డీసీపీ తోసేసి కేసులు పెడ్తామని, అరెస్ట్ చేస్తామని బెదిరించడం సరికాదన్నారు. డీసీపీ తీరుపై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. నిరుద్యోగుల ఆందోళన కవరేజీ మీడియా ప్రతినిధుల బాధ్యత అని, ఆందోళనలను శాంతియుతంగా విరమింపజేయడం పోలీసుల బాధ్యత అని గుర్తు చేశారు. కానీ మీడియా ప్రతినిధులు తమ బాధ్యతను నిర్వహిస్తుంటే పోలీసులు అతిగా ప్రవర్తించడం సరికాదన్నారు. గతంలోనూ పలుమార్లు ఇదే విధంగా మీడియాపై, ప్రజాసంఘాల లీడర్లపై దురుసుగా ప్రవర్తించారని, ఇప్పటికైనా ఆయన తన పద్ధతి మార్చుకోవాలని సూచించారు.

నూతన సీసీ రోడ్డు పనులను పర్యవేక్షించిన కార్పొరేటర్, అధికారులు



నవతెలంగాణ-బాలానగర్

మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలో చిన్నపాటి వర్షానికే ఇండ్లు జలమయం అవుతున్నాయని, శివాలయం రోడ్డు, భరత్ నగర్ రోడ్డు లో ఉన్న గుడిసె వాసులు గతంలో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌ను కలసి తమ ఆవేదన వ్యక్తం చేసుకున్నారు. వెంటనే స్పందించిన కార్పొరేటర్ జీహెచ్ఎంసీ అధికారులకు సమాచారం అందించడంతో సంబంధిత అధికారులు ఆయా ప్రాంతాల్లోని పరిసరాలను పర్యవేక్షించి, వెంటనే రూ. 15 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అట్టి పనులను పూర్తి చేసిన నేపథ్యంలో కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. సనత్‌నగర్ ఐడీఏ నుంచి వస్తున్న మురుగునీటిని కూడా దారి మళ్లింపునకు ప్రణాళికను రూపొందించాలని అధికారులను కార్పొరేటర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, డివిజన్ పరిధిలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సమస్యలను పరిష్కరించే విధంగా అధికార యంత్రం ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అభివృద్ధి పనులకు నిధుల కొరత లేదని, డివిజన్ ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అవసరమైన చోట మెరుగైన వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ రోడ్డును నిర్మిస్తే తమకు ఎలాంటి కష్టాలు ఉండవని, సౌకర్యాలు,వసతులు కల్పించిన నాయకులకు రుణపడి ఉంటామన్నారు. స్థానిక మహిళలు, వద్దులు కార్పొరేటర్‌కు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు డిఈ శ్రీదేవి, ఏఈ పవన్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు కురుమయ్య, నరసయ్య, వీరేశం, మాలిక్, రవీంద్రనాథ్ గౌడ్, సురేందర్ నాయుడు ఇతరులు పాల్గొన్నారు.





దివంగత మాజీ ముఖ్యమంత్రి, మహా నటుడు, టీడీపీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు ముఖచిత్రంతో రూపొందించిన రూ.100 నాణేన్ని సోమవారం ఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఎన్టీఆర్ ఆవిష్కరించిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా హైదరాబాద్ మింట్ కాంపౌండ్ లో ఎన్టీఆర్ నాణేలను మంగళవారం అమ్మకానికి పెట్టగా అదిరిపోయే స్పందన లభించింది. చాలా మంది ప్రజలు నాణేల కోసం మింట్ కాంపౌండ్‌కు చేరుకుని క్యూ కట్టారు.

'జీవితం చాలా కష్టమైన పరీక్ష, దానిలో చాలామంది విఫలం చెందటానికి కారణం, ప్రతీ ఒక్కరి ప్రశ్నాపత్రం వేరని గ్రహించకపోవటమే'

కంటోన్మెంట్ నియోజకవర్గ ఎన్నికల బరిలో డాక్టర్ జాన్‌బాబు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ నియోజకవర్గం నుండి ఈసారి తాను కూడా ఎన్నికల బరిలో ఉంటున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వైస్ చైర్మెన్ డాక్టర్ జాన్ బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళ వారం విలేకరులతో మాట్లాడుతూ తాను ఇటీవలనే పార్టీ కార్యాలయంలో టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. గత 30 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడుగా ఉంటూ అనేక కార్యక్రమాలు చేపట్టానని, ప్రస్తుత చీఫ్ రేవంత్‌రెడ్డి అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం పని చేస్తున్నట్లు తెలిపారు తనకు టికెట్ వచ్చే అవకాశాలుగా ఉన్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

ఘనంగా గిడుగు రామమూర్తి జయంతి



నవ తెలంగాణ - ముషీరాబాద్

గిడుగు రామమూర్తి పంతులు 161 వ జయంతి వేడుకలు బాగ్ లింగం పల్లి లోని గిడుగు రామమూర్తి పంతులు ఫౌండేషన్, శంకరం వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగాయి ఈ వేడుకలలో బీసీ కమీషన్ చైర్మన్ వాకులాభరణం కృష్ణ మోహన్ రావు, కళా రత్న బిక్కి కృష్ణ, అధ్యక్షురాలు గిడుగు కాంతి కృష్ణ, శంకరం వేదిక అధ్యక్షురాలు యల వర్తి దన లక్ష్మీ, ఇన్కమ్ టాక్స్ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ నరసింహప్ప, అధికార భాష సంఘం అధ్యక్షురాలు మంత్రి శ్రీదేవి, తదితరులు హాజరయ్యారు

బీసీ విద్యార్థులకు ఫీజుల పునరుద్ధరణ చేయాలి





- తెలంగాణ బీసీ స్టూడెంట్ అసోసియేషన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

రాష్ట్రంలో ఇంజనీరింగ్/ఎంబీఏ/ఎంసీఏ/పీజీ/డిగ్రీ/ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ విద్యార్థుల మొత్తం ఫీజుల స్కీమును పునరుద్ధరించి, ఫీజు నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ బీసీ స్టూడెంట్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్ రోడ్ నెంబర్- 2లో మంత్రుల నివాసం ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టా రు. పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అసోసి యేషన్ ప్రధాన కార్యదర్శి వేముల రామకృష్ణ మాట్లా డుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న ఫీజుబకాయి రూ.5వేలకోట్ల రుణాలను ఇంత వరకు మంజూరు చేయలేదన్నారు. దీంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురువుతున్నట్లు తెలి పారు. పెరిగిన ధరల ప్రకారం ఎస్సీ/ఎస్టీ/బీసీ కాలేజీ హాస్టల్ విద్యార్థుల మెస్‌చార్జీలను కూడా పెంచాలన్నారు. అదనంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి గురుకుల పాఠశాలలు మంజూరు హామీని విస్మరించిందని, నిరుద్యోగ భృతి ఉద్యోగ నియమకాలు చేపట్టడం లేదని విమర్శిం చారు. గురుకులాలలో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి ప్రవేశ పరీక్షతో సంబంధం లేకుండా విద్యను అందించాలని, దానితో పాటుగా విదేశీ విద్యా నిధులు మంజూరు చేయాలన్నారు. రాష్ట్రంలో కాలేజీ హాస్టళ్ళకు సొంత భవనాలు నిర్మించాలని, పాత కలెక్టర్ భవనాలను కాలేజీ హాస్టల్‌లకు వినియోగించుకొని జూనియర్ అడ్వకేట్లకు ఇచ్చే స్టైఫండ్ నెలకు రూ.1000 నుంచి రూ.10 వేలకు పెంచాలని తెలంగాణ బీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వేముల రామకృష్ణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అరెస్టులతో నిరసనలను అనుగదొక్కలేరని మంత్రుల నివాసం, రేపు ప్రగతి భవన్, ఎల్లుండి అసెంబ్లీ ముట్టడి చేపడతామని, ఈ సమస్యలు పరిష్కరించకపోతే నిరంతరాయంగా నిరసనలు కొనసాగుతాయన్నారు.

ఉద్యమం కాలం నుంచి పార్టీకి విధేయుడుగా ఉన్నా..!!

- పార్టీ హై కమాండ్ నాకు టికెట్ ఎందుకివ్వలేదు?
- నన్నెందుకు ప్రశ్నించలేదు సమాధానమివ్వాలి.
- ఒక్కరోజు జెండా పట్టని వారికి సీటు..
- 10 రోజుల తరువాత నిర్ణయం ప్రకటిస్తా
- ఉప్పల్ ఎమ్మెల్యే బెతి సుభాష్ రెడ్డి



నవతెలంగాణ-ఓయూ

గత 23 సంవత్సరాలుగా బీఆర్ఎస్‌కి సేవ చేశానని, ప్రతీ బాధ్యతను బాధ్యతాయుతంగా పనిచేశానని, ఏ నియోజకవర్గంలో నాకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినా అక్కడి వ్యక్తుల గెలుపునకు కృషి చేసానని ఉప్పల్ ఎమ్మెల్యే బెతి సుభాష్‌రెడ్డి అన్నారు. పార్టీ కోసం ఎంతో కష్టపడి గెలుపుకోసం పనిచేశానని, 2009 తరువాత ఉద్యమ బాటలో నడిచానని, ఎన్నో బందులకు పార్టీ పిలుపునిచ్చినా భయపడకుండా పనిచేశానని జీవితమంతా పార్టీకి పణంగా పెట్టిన, తనకు టిక్కెట్ ఇవ్వలేదని, కనీసం తనను పిలిచి పార్టీ హై కమాండ్ ప్రశ్నించడం కానీ హెచ్చరించడం కూడా ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం హబ్సిగూడాలో తన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో తన బాధను వెళ్ళబుచ్చారు. 2019లో టికెట్ ఇస్తే నలభై వేల పై చిలుకు ఓట్లతో గెలుపొందానని, నేను ఎమ్మెల్యేగా ఉండి జీహెచ్ఎంసి కార్పొరేటర్లను గెలిపించుకున్నాను, ఒక ఎమ్మెల్యేగా ఉప్పల్‌ను అన్ని రకాలుగా అభివృద్ధి చేసానని నాకు టికెట్ రాకపోతే ఇతర పార్టీ వాళ్ళు వచ్చి పరామర్శించారన్నారు. టికెట్ వేరే వాళ్లకు ఇచ్చారని, టికెట్ కేటాయించిన వ్యక్తి ఏ రోజు జెండా మోసినోడు కాదని, ఏ రోజు పార్టీ కోసం పని చేయని వ్యక్తి కేటాయించారని బాధను వెల్లగక్కారు. మొత్తం 29 నియోజకవర్గాల్లో ఏఒక్క అభ్యర్థిని మార్చకుండా సిట్టింగ్‌లకు అవకాశం ఇచ్చి నా ఒక్కని టికెట్ ఎందుకు ఇవ్వలేదన్నారు. నాపై భూకబ్జాలు ఏమీ లేవని, ఎందుకు నన్ను పిలిచి అడగలేదనీ పార్టీ హై కమాండ్‌ను ప్రశ్నించారు. ఇంకా నేను ఏవిధంగా ప్రజలలోకి వెళ్ళాలి అని తన బాధను వ్యక్తం చేశారు. నును పార్టీకోసం ఎంతో చేశానని కానీ అధి స్థానం నన్ను గుర్తించకపోవడం బాధకరమ న్నారు. తప్పు చేసిన వాళ్లకు టికెట్ ఇస్తారా? ఇంకా అభ్యర్థుల మార్పు చేర్పులు ఉన్నాయి. కనుక ఇంకా సంయమనం పాటించాలని కార్యకర్తలను శాంతిపజేశానని ఆయన అన్నారు. వారం పది రోజులు చూసి, నాకు పార్టీ ఏమి కార్యాచరణ ఇస్తుంది చూసి దాని తరువాత నిర్ణయం తీసుకుంటానని ఆయన అన్నారు. నేను ప్రజల కోసం పని చేస్తానని, ప్రజలలోనే ఉంటానని.. నేను ఏది చేసినా ప్రజల కోసం చేస్తానని ఆయన తెలిపారు. పది రోజుల తరువాత కార్యకర్తలతో సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణను ప్రకటిస్తానని తెలిపారు.

'అపోలో కనెక్ట్' ప్రోగ్రామ్ విస్తరణ, సంరక్షించడంపైనే దృష్టి

- భారతదేశంలో అతిపెద్ద అనుసంధానిత ఆరోగ్య , పర్యావరణ వ్యవస్థను నిర్మించాలనేది లక్ష్యం

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

ప్రపంచంలోనే అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్ అపోలో మంగళవారం తమ ఒక ఆఫ్-ఏ- రకమైన కనెక్ట్ చేసిన కేర్ ప్రోగ్రామ్ పాన్ ఇండియా విస్తరణను ప్రకటించినట్లు దీంతో అపోలో భారతదేశంలో అతిపెద్ద పర్యావరణ వ్యవస్థను సృష్టించడం, మెట్రోలు, నాన్ మెట్రోలలోని ఆసుపత్రులు, నర్సింగ్ హెూమ్లను సంపూర్ణమైన రోగుల సంరక్షణ అందించడం లక్ష్యంగా పెట్టుకుందని అపోలో వ్యవస్థాపకుడు, చైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సీ.రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ అపోలో కనెక్ట్ భారతదేశం అంతటా ఈఐసీయూ, డయాగ్నోస్టిక్, సర్జికల్, కన్సల్టేషన్, రిమోట్ మోనటరింగ్ క్లినికల్ అండ్ క్వాలిటీ ట్రెనింగ్‌తో పాటు అక్రిడిటేషన్ సపోర్ట్ వంటి సేవలను అందించనుందని, బలమైన కేర్ పార్టనర్ నెట్‌వర్క్ ను నెలకొల్పడం ద్వారా, అపోలో కనెక్ట్ చివరిమైలు రాయి రోగి యాక్సెస్, స్థోమత, అనుభవాన్ని మెరుగుపరచడం ద్వారా భారతదేశంలో ఆరోగ్య సంరక్షణ పర్యవరణ వ్యవస్థను బలోపేతం చేయడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అపోలో భాగస్వామ్యంలో ఆసు పత్రులు రోగులకు అందించే సేవలను మెరుగుపరుస్తాయని, ఉన్నతమైన క్లినికల్ ఫలితాలను సాధించగలరని, రోగి నిలుపుదలను మెరుగుపర్చి, ఖర్చులు, సమయం ఆదా చేయవచ్చన్నారు. నాణ్యమైన సంరక్షణ అందుబాటులో లేక జబ్బు పడిన వ్యక్తి చికిత్స సకాలంలో పొందేందుకు ఒక సంరక్షణ ప్రదాతలుగా పరస్పరం సహకరించుకో వడం, మద్దతు ఇవ్వడం అత్యవసరం అన్నారు. దీని కోసమే ఈ కార్యక్రమం రూపొందించా మన్నారు. రెండేళ్లుగా అపోలో స్పెషాలిటీ ఆసుపత్రులు, నర్సింగ్ హెూమ్‌లతో 'అపోలో కనెక్ట్'ను ప్రయోగాత్మకంగా నిర్వహిస్తున్నా మని తెలిపారు. ఇది అంతటా అపారమైన విజయాన్ని సాధించిందన్నారు. ఈ సందర్భంగా అపోలో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీత రెడ్డి మాట్లాడుతూ, అత్యుత్తమ ఆరోగ్య సంరక్షణ అందించడం ద్వారా భారతదేశాన్ని ఆరోగ్యవంతంగా మార్చడానికి కట్టుబడి ఉన్నామని, ఆ దిశలో అపోలో కనెక్ట్ మరో ముందడుగు వేసిందన్నారు. ఇక్కడ రోగులకు వీలైనంత దగ్గరగా నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను పొందడంలో సహాయం చేస్తామన్నారు. ఇందులో అత్యవసర సంరక్షణ, డయాగ్నస్టిక్‌లు, రిమోట్ మానిటరింగ్, ఇతర సర్జికల్ కన్సల్ట్‌లతో సహా అందుబాటులో ఉన్నాయన్నారు. 'అపోలో కనెక్ట్' భాగస్వామ్య ఆసుపత్రులకు నాలుగు ముఖ్య ప్రయో జనాలను, సేవలను అందిస్తుందని, అందులో ఆదాయాన్ని పెంచడం, పొదుపు ఖర్చులు, వ్యూహాత్మక వ్యాపార మద్దతు, శిక్షణ, మార్గదర్శక కార్యక్రమాలు, కోర్సులకు సహాయం చేయడానికి ఉన్నతమైన సంరక్షణ మార్గదర్శకాలను అందిస్తున్నామని తెలిపారు.

తెలుగు వారీగా పుట్టడం మనందరి అదృష్టం : రాజగోపాల్ నాయుడు



నవతెలంగాణ-అంబర్‌పేట

డివిజన్‌ల పరిధిలో ట్విన్‌సిటీస్ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని మంగళ వారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా రాజగోపాల్ నాయుడు హాజరయ్యారు.ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని చిన్నారులు ప్రదర్శించిన కార్యక్ర మాలుఎంతో ఆకట్టుకున్నాయన్నారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌నాయుడు మాట్లాడుతూ తెలుగు వారందరూ తెలుగులోనే మాట్లాడుదామని, తెలుగుభాష మర్చిపోకుండా చూడాలని, తెలుగు విభాగంలో కూడా అనేక ఉపాధి అవకాశాలు ఉన్నాయని, తెలుగుభాషను ప్రేమించిన వారు గొప్ప కీర్తిని గడిచారని ఈ సందర్భంగా తెలిపారు. ప్రపంచంలో నలుమూలల తెలుగువారి తమ కీర్తిని చాటుతున్నారన్నారు. అనంతరం తెలుగు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పా ండెంట్ డాక్టర్ చంద్రమౌళి, పాఠశాల ప్రిన్సిపల్ శశికళ పాఠశాల ఇన్‌చార్జి భాగ్యలక్ష్మి, కొండా లోకేష్‌శెట్టి చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

- ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్ రాజు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన ఉండాలని ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ జి.శంకర్ రాజు అన్నారు. బేగంపేట ట్రాఫిక్ ట్రెనింగ్ ఇని స్టిట్యూట్ ఆధ్వర్యంలో మంగళవారం అబిడ్స్ లోని సెయింట్ జార్జ్ డిగ్రీ పీజీ కళాశాలలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం .పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసిపి శంకర్ రాజు మాట్లాడుతూ విద్యార్థులు చిన్న వయసులో డ్రైవింగ్ చేయడం ప్రమాదకరమన్నారు. సెల్ ఫోన్ డ్రైవింగ్, అతివేగంతో ర్యాష్ డ్రైవింగ్ చేయడం సరికాదన్నారు. మైనర్ డ్రైవింగ్, స్టాప్ లైన్, రాంగ్ రూట్, ట్రిబల్ రైడింగ్, ఫోన్ డ్రైవింగ్, జీబ్రా క్రాసింగ్ వాటిపై. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. చిన్న వయసు నుంచే క్రమశిక్షణ, ఏకగ్రత, సమయం వృధా కాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్. కళాశాల ప్రిన్సిపల్ జిఎస్ అధ్యాపకురాలు సురేఖ. టిటిఐ బేగంపేట్ సిబ్బంది. ట్రాఫిక్ పోలీసులు 150 మంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయులుకు మదర్ థెరిస్సా మెమోరియల్ అవార్డు



నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆంజనేయులు మదర్ తెరిసా మెమోరియల్ అవార్డు అందుకున్నారు. మంగళ వారం మదర్ తెరిసా జయంతి ముగింపు ఉత్సవాల్లో తెలంగాణ శాసనమండలి డిప్యూటీ స్పీకర్ బండ ప్రకాష్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ హాజరై తెలంగాణ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్ర మాలు చేస్తున్న స్టేట్ ప్రెసిడెంట్ ఆంజనేయులుకు ఈ అవార్డును ప్రదానం చేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ హైకోర్టు రిటైర్డ్ జడ్జి చంద్ర కుమార్, సిటిజన్ కౌన్సిల్ ప్రెసిడెంట్ రాజ్ నారాయణ ముదిరాజ్, కో ఆర్డినేటర్ శివకుమార్, ఉదయ్, అనిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను రెగ్యులర్ చేయాలి

- తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఉద్యోగస్తుల డిమాండ్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల ప్రతినిధులు సుందర్ నరేందర్, జ్యోత్స్న , శ్రీనివాస్‌లు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం అబిడ్స్ బుగ్గల కుం టలోని వైడబ్ల్యుసీఏ హాల్లో నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర మెడికల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఆస్పత్రులలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగస్తులను పర్మినెంట్ చేయాలని, ఉమ్మడి రాష్ట్రంలో 2005 సంవత్సరంలో అవుట్ సోర్సింగ్ విధానాన్ని తీసుకొచ్చార న్నారు. ల్యాబ్ టెక్నీషియన్లు, రెడియో గ్రాఫర్స్, ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్స్, ఓటి టెక్నీషియన్లు, అనస్థీషియా టెక్నీషియన్లు, డాటా ఎంట్రీ ఆపరేటరు, ఈఈజీ, అప్నాలిక్ టెక్నీషియన్లు, నాలుగో తరగతి సిబ్బంది లను ప్రభుత్వం పర్మినెంట్ చేసి, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై డిఎంఈ. డిహెచ్. టీవీ వీకమిషనర్. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ లను త్వరలోనే కలిసి తమ సమస్యలు వివరిస్తామని తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే కార్యాచరణ రూపొందిస్తామన్నారు. బుధవారం నుండి ప్రభుత్వ ఆస్పత్రులలో ఉద్యోగస్తులందరూ ఒక గంటపాటు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో తెలంగాణ రాష్ట్ర మెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగస్తుల ప్రతినిధులు సుందర్, జ్యోత్స్న, శ్రీనివాస్, సత్యం, రాజు , విజయలక్ష్మి , మౌనిక, సంధ్య వినోద, భారీ ఉద్యోగస్తులు పాల్గొన్నారు.

డిక్లరేషన్‌లో ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తొలగించాలి



మాలమహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య

నవతెలంగాణ-బంజారాహిల్స్

ఈ నెల 26న జరిగిన దళిత గిరిజన ఆత్మగౌరవ సభలో కాంగ్రెస్ పార్టీ 12 అంశాలతో విడుదల చేసిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌లను తొలగించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జీ.చెన్నయ్య డిమాండ్ చేశారు. మంగళవారం బంజారాహిల్స్ మాల మహానాడు రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా అపారమైన గౌరవం ఉందని, ఎస్సీ వర్గీకరణపై పూర్తిగా అవగాహన కల్గిన వ్యక్తిని, ఇటీవల జరిగిన వర్షాకాల సమావేశాల్లో రాజ్యసభలో ఎస్సీ వర్గీకరణ అసాధ్యని, మెజార్టీ రాష్ట్రాలు వ్యతరేకించిన విషయం ఆయనకు తెలుసన్నారు. తెలంగాణలో కొంత మంది కాంగ్రెస్ పార్టీ వాళ్ళు స్వార్ధ ప్రయోజనాల కోసం ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి తెచ్చి డిక్లరేషన్‌లో చేర్చినట్లు, తక్షణమే పునపరిశీలన చేసుకొని,12 అంశాలలో ఎస్సీ వర్గీకరణ అంశం మినహా మిగత వాటిని స్వాగతిస్తూన్నమన్నారు. త్వరలోనే డిల్లీలో ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని కలసి వివరిస్తామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మన్నే శ్రీదర్ రావ్, సిటీ ప్రెసిడెంట్ బైన శ్రీనివాస్, సిటీ వైస్ ప్రెసిడెంట్ గోకుల కళ్యాణ్, నేతలు కమల్ కుమార్, అదర్స్ మౌర్య, జగదీష్ రంగముని, వరప్రసాద, మునిస్వమి, వెంకటేశ్, గోవింద్ రాజ్, పాల్గొన్నారు.

అన్ని అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి : డిప్యూటీ స్పీకర్ ఆదేశం



నవతెలంగాణ-ఓయూ

డివిజన్ పరిధిలోని పలు అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని డిప్యూ టీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశిం చారు. తమకు నియోజకవర్గం లోని అన్ని ప్రాంతాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, వారి ఆకాంక్షలను తాము నెరవేరు స్తామని ఆయన అన్నారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలో డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ మంగళవారం విస్తృతంగా పర్యటించారు. రూ.1.8కోట్ల ఖర్చుతో చేపడుతున్న వివిధ రహదారుల పునర్నిర్మాణం, సివరేజి లైన్ల నిర్మాణం పనులను డిప్యూటీ స్పీకర్‌స్థానిక కార్పొరేటర్ రాసూరి సునీత, బీఆర్ఎస్ నేతలు కిషోర్ కుమార్ గౌడ్, రామేశ్వర్ గౌడ్, అధికారులు, నాయ కులతో కలిసి ప్రారంభించారు. మెట్టుగూడ, కేశవ నగర్ కాలనీ, విజయపురి కాలనీ, ముదిరాజ్ సంఘం, యూత్ క్లబ్, వైట్ హౌస్, దాదర్ కాంపౌండ్, మైలారగడ్డ, ఎంటీఆర్‌నగర్, చిలకలగుడా, చింతబవి ప్రాంతాల్లో పద్మారావు గౌడ్ ఈ సందర్భంగా పాదయాత్ర నిర్వహించారు. కేశవ నగర్ కాలనీ, విజయపురి కాలనీసంక్షేమ సంఘాలు చేసిన వివిధ విజ్ఞాపనలకు అయన స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెట్టుగూడ డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

శ్రీరామ్‌నగర్ ప్రభుత్వ దవాఖానాలో నెలలో 100 సాధారణ కాన్పులు



- ఒక్కరోజు 9 మందికి సాధారణ కాన్పులు

నవతెలంగాణ- జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గం, ఎర్రగడ్డ డివిజన్ రాజీవ్ నగర్‌లోని ప్రభుత్వ దవాఖానాలో, ఆగస్టు నెలలో 100 సాధారణ ప్రసవాలు నిర్వహించి డాక్టర్లు సిబ్బంది రికార్డ్ సృష్టించారు. అందులో ఆగస్టు 28 సోమవారం ఒక్కరోజు 9 మందికి సాధారణ కాన్పులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం రమారాణి సీనియర్ గైనకాలజిస్ట్ తెలిపిన వివరాల ప్రకారం ఆస్పత్రి పరిధిలో మహిళలు గర్భం దాల్చగానే ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు ప్రసవానికి ఏ విధంగా ఆహారం తీసుకోవాలి, శారీరకంగా దృఢంగా ఉండటానికి కావలసిన మందులను అందిస్తూ, వారికి అవగాహన కల్పించారన్నారు. అందు వలన ఈ విధంగా సాధారణ కాన్పులు చేయటానికి గర్భిణీలు కూడా సహకరించారని అన్నారు. ఇప్పుడిప్పుడే ప్రభుత్వ ఆస్పత్రి పై రోగులకు నమ్మకం పెరుగుతుందని, ప్రయివేటు హాస్పటల్ కి వెళ్లి డబ్బు వృధా చేసుకొనుట లేదని, ఎలాంటి చిన్న ఆపరేషన్ కూడా లేకుండా కాన్పులు చేసి తల్లి, బిడ్డలను ఇంటికి పంపిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే.శిల్పారెడ్డి గైనకాలజిస్ట్, డాక్టర్ వి.సువర్ణ రేడియాలజిస్ట్, డాక్టర్ సి ఝాన్సీ పీడియాట్రీషియన్, హెడ్ నర్సులు, విజయ్ కుమారి, మహమ్మద్ రోషన్,సుజాత, స్టాఫ్ నర్సులు అనురాధ, మనోరంజని, విమల, భాగ్యప్రియ, అనిత, కరుణ, ఏఎన్‌ఎం సిబ్బంది ప్రధాన పాత్ర ఉందన్నారు.

అన్ని సంస్కృతుల సమ్మేళనం మన భారతదేశం

- చైర్మెన్ బాలకృష్ణ



నవతెలంగాణ-బంజారాహిల్స్

అన్ని సంస్కృతులకు సమ్మేళనాలకు భారతదేశం పుట్టినిల్లని బసవతారకం ఇండో అమెరికన్ చైర్మెన్ హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అన్నారు. రోడ్ నెంబర్-14లోని బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రిలో భాగంగా కొనసాగుతున్న యాడ్ లైఫ్ యోగ జిమ్ నేచురోపతి 20 సంవత్సరాలు పూర్తి చేసుకొని, ఎందరో క్యాన్సర్ రోగులకు, వివిధ వ్యాధు లతో బాధపడుతున్న వారికి చికిత్సలు అందిస్తూ ప్రత్యేక గుర్తింపును సంతరించుకున్న సేవా కేంద్రంగా పేరుపొందిందన్నారు. 20 సంవత్సరాలుగా నగరంలో ఎక్కడ లేనివిధంగా ప్రత్యేకంగా పూలతో అలంకరణ నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రతి ఏటా సుమారు వందల మందికి పైగా ఉన్న సిబ్బందికి ప్రత్యేక కేరళ వంటలతో భోజనాలు ఏర్పాటు చేసి ఓనం పండగను ఘనంగా నిర్వహిస్తారన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఈవో ఆర్.వి.ప్రభాకర్‌రావు అసోసియేట్ డైరెక్టర్ నర్సింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ యాడ్ లైఫ్ హెడ్ డాక్టర్ కల్పనా రఘునాథ్,మెడికల్ డైరెక్టర్ పని కోటేశ్వరరావు, కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ సమాజహితం కోసం క్యాన్సర్ రోగులకు ప్రత్యేక సేవనందిస్తున్న యాడ్ లైఫ్ యోగ నేచురోపతి వైద్యులు సిబ్బందికి ముందుగా ఓనం శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యుల బృందం నీచురోపతి వైద్యులు డాక్టర్ సుమతి, డా॥సుభద్ర, డా॥శింబు, డా॥కిరణ్, డాక్టర్॥ఉదయ్, యాడ్ లైఫ్ మేనేజర్ ఆదిత్య జిమ్ ట్రైనర్స్ సిబ్బంది టెక్నీషియన్స్ తదితరులు పాల్గొన్నారు.

రెండు నిండు ప్రాణాలను కాపాడిన విరంచి ఆస్పత్రి




నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రాణాలపై ఆశలు వదిలేసి వివిధ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకుని దిక్కు తోచని పరిస్థితులలో 34 సంవత్సరాల గర్భిణి మహిళను సేవా దృక్పథంతో చికిత్స అందించి రెండు నిండు ప్రాణాల వీరంచి ఆసుపత్రి వైద్యుల బృందం కాపాడారు. 22 వారాల గర్భంతో ఉన్న జి.సునీత భర్తతో బైకుపై వెళుతుంటే యాక్సిడెంట్‌కు గురై తీవ్రమైన గాయాలతో ప్రముఖ కార్పొరేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. తలకు తగిలిన గాయాల కారణంగా ఆమెకు మెదడులోని నరాలు చిట్లడం రక్తం గట్టకట్టడంతో చికిత్స పొందుతున్న ఆమెకు తక్షణం శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. దిక్కు తోచని స్థితిలో ఉన్న ఆమె భర్త ఆమె బ్రతకడం కల్లా అనుకున్నాడు. లతామా ఫౌండేషన్ అండ్ చైర్ పర్శన్, విరించి హాస్పిటల్ మేనేజింగ్ ట్రస్టీ, మాధవి లత, దృష్టికి విషయాన్ని తీసుకొని రాగా రోగికి ఆసుపత్రిలో వైద్యాన్ని అందించడానికి సిద్ధమయ్యారు. అవన్నీ ఇలా ఉంటే ఆమె గర్భిణి కావడంతో పాటూ ఆమె కడుపులో ఉన్న శిశువు ఆరోగ్యాన్ని కూడా కాపాడుతూ మహిళకు ప్రాణదానం చేయడం విరించి హాస్పిటల్ వైద్యులకు సరికొత్త సవాల్‌ను విసిరింది. కడుపులోని బిడ్డకు హాని కలుగకుండా చూడాలంటే తీవ్రమైన స్థాయిలో యాంటి బయాటిక్స్‌ను వైద్యులు వినియోగించలేకపోవడం వారి ముందున్న సమస్య. ఈ సవాల్‌ను స్వీకరించిన విరించి వైద్య బృందం అడ్మిషన్ సయమం నుండి డిశ్చార్జి చేసే వరకూ ఎంఐసీయూలోనే చికిత్స నిర్వహించారు. చికిత్స అనంతరం సదరు మహిళ పూర్తిగా కోలుకుంది. ప్రస్తుతం మెదడుకు తగిలిన గాయాలతో ఏర్పడిన సమస్యలకు సంబంధించి ప్రత్యేకమైన రిహాబిలిటేషన్ కోసం ఫిజియో థెరపీ కేంద్రంలో సదురు రోగికి ఐసీయులో ప్రత్యేక వైద్యం అందించి ప్రాణాలను కాపాడారు. సీఈఓ డా.సాయి రవి శంకర్ మాట్లాడుతూ వైద్య పరిభాషలోనే ఎంతో క్లిష్టమైన రోగికి చికిత్స అందించి బాగు చేయడమే కాకుండా పూర్తిగా ఉచితంగా వైద్యం అందించడంతో విరించి హాస్పిటల్ మరోమారు తన నైపుణ్యాన్ని, మానవత్వాన్ని చాటుకొందన్నారు. పూర్తిగా ఉచిత వైద్యం అందేలా తోడ్పడిన మేనేజింగ్ ట్రస్టీ, లాతామా ఫౌండేషన్ ఛైర్ పర్శన్, విరించి హాస్పిటల్స్ మాధవీలత కొంపెల్ల, ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రిటికల్ కేర్ వైద్య నిపుణులు డా.బిఎస్‌కే షృస్టీ, డా॥రామకృష్ణలతో పాటూ మెదడుకు తగిలిన గాయాలకు డా. శివరామ్ కృష్ణ, కన్సల్టెంట్ జనరల్ ఫిజిషియన్, విరించి ఆస్పత్రి డా.యం.ఆర్.సి. నాయుడు, కన్సల్టెంట్ న్యూరో సర్జన్, విరించి హాస్పిటల్స్ కడుపులో చిన్నారిని కాపాడిన గైనకాలజీ వైద్య నిపుణురాలు డా.బేలులూలు చికిత్స అందించి దీనిలో భాగస్వాములయ్యారు.

మంత్రి నివాసానికి వెళ్తున్న ఆశావర్కర్ల అరెస్టు

- సీఐటీయూ నగర కార్యదర్శి ఎం. వెంకటేష్



నవతెలంగాణ-బేగంపేట్

ఆశా వర్కర్లకు ఫిక్స్ వేతనం రూ.18,000లు ఇవ్వాలని కోరుతూ మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మెమోరాండం ఇచ్చేందుకు హైదరాబాద్ మారేడ్‌పల్లిలోని ఆయన ఇంటికి వెళ్తున్న సీఐటీయూ నాయకత్వాన్ని, ఆశా వర్కర్లను మంత్రి ఇంటి సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. పోలీసులకు, ఆశావర్కర్లకు మధ్య జరిగిన తోపులాటలో ఇద్దరు ఆశావర్కర్లు సొమ్మసిల్లి పడిపోగా ఆరుగురికి గాయాలయ్యాయి. పోలీసులు మొత్తం 78 మందిని అరెస్టు చేసి బొల్లారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో సీఐటీయూ నగర కార్యదర్శి ఎం. వెంకటేష్, సహాయ కార్యదర్శులు టి. మహేందర్, ఎం. సత్యనారాయణ, తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎం అనిత, ఉపాధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, లక్ష్మి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి ఎం. వెంకటేష్ మాట్లాడుతూ సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ, ఆశాల పట్ల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, పోలీసులు వ్యవహరించిన తీరును ఖండిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్స్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులకు పరీక్షలు చేస్తూ గుర్తించడం చేస్తున్నారన్నారు. అలాగే ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. వీటితో పాటు గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు, ఇతర ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని.. ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇన్ని పనులు నిర్వహిస్తున్న ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం నిర్ణయించకపోవడం వల్ల ఆశా వర్కర్లు అన్యాయానికి గురవుతున్నారన్నారు. గతంతో పోలిస్తే ఈ కాలంలో ఆశా వర్కర్లకు పనిభారం విపరీతంగా పెరిగిందని చెప్పారు. అయినా ఆశాలకు కేవలం రూ.9,750/-ల పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నదన్నారు. ఆశాల పారితోషికాలను రూ.18,000కు పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆశాలకు ఈఎస్ఐ, పీఎఫ్, హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ప్రతీ ఆదివారం ఆశాలకు సెలవు ఇవ్వాలని కోరారు. ఆశాలకు పని భారం తగ్గించాలని, జాబ్ చార్ట్‌ను విడుదల చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.



ఈ రాఖీ మరింత ప్రత్యేకంగా

రాఖీపండుగ వచ్చిందంటే ఇల్లంతా సందడి, సందడిగా ఉంటుంది. అన్నదమ్ములు, అక్కా చెల్లెళ్లు కలిసి చాలా సంతోషకరమైన భావంతో ఈ పండుగను జరుపుకుంటారు. చిన్న, పెద్ద అన్న తేడా లేకుండా అన్ని యసుల వారు రాఖీ పౌర్ణమిని ఘనంగా జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని మార్కెట్లో రకరకాల రాఖీలు మనకు దర్శనమిస్తాయి. గతంలో కంటే భిన్నంగా ఈ సారి సృజనాత్మకతతో కూడిన రాఖీలు మార్కెట్లోకి వచ్చాయి. అయితే మీరే స్వయంగా తయారు చేసి కడితే ఈ రాఖీ పండుగ మీకు మరింత ప్రత్యేకంగా ఉంటుంది. ఇంకెందుకు ఆలస్యం రాఖీను ఎలా తయారు చేయాలో తెలుసుకుందాం....

సిల్క్ థ్రెడ్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : సిల్క్ థ్రెడ్స్, కత్తెర, బీడ్స్, హార్డ్ బ్రిజిల్స్ ఉన్నటువంటి టూత్ బ్రష్, కాటన్ దారపు రీలు, గ్లూ స్టిక్.

తయారు చేసే విధానం : ముందుగా సిల్క్ థ్రెడ్స్‌ను తీసుకోవాలి. అయితే మీకు నచ్చిన రంగులను ఉపయోగించి ఈ రాఖీలను తయారు చేసుకోవచ్చు. మరింత కలర్ ఫుల్‌గా కనిపించాలంటే మల్టీ కలర్‌ను కూడా ఉపయోగించండి. ఈ రాఖీ కోసం సిల్క్ థ్రెడ్‌ను 20 నుండి 30 ఇంచెస్ ఉండే వరకు తీసుకోండి. ఇలా తీసుకున్నప్పుడు మీకు నచ్చిన కలర్‌తో పాటుగా బంగారు రంగులో ఉండేటువంటి దారం కూడా దీనికి చేర్చడం వల్ల మరింత అందంగా ఉంటుంది. ఇలా దారపు పోగుల తీసుకున్న తర్వాత వాటిని మధ్యకు ఫోల్డ్ చేయాలి. తర్వాత కాటన్ దారాన్ని తీసుకుని సిల్క్ థ్రెడ్స్‌కి వన్ ఫోర్త్ పోర్షన్ ఉండే విధంగా ముడి వేయాలి. ఈ పోర్షన్‌ను రాఖీ చేయడానికి ఉపయోగిస్తాం. మిగిలింది ముడి వేయడానికి ఉపయోగిస్తాం. అంటే స్ప్రింగ్‌గా ఉపయోగిస్తాము అని అర్థం. కాబట్టి మీ అన్నదమ్ములు చేతి మడమ సైజు ప్రకారం ఆ దారాలను ఉంచి మిగిలినవి కట్ చేయవచ్చు. అయితే ఆ చివరి దారపు అంచులు ముడి పడిపోకుండా ఉండాలి అంటే టూత్ బ్రష్ సహాయంతో రబ్ చేస్తే సరైన విధంగా ఉంటాయి. దాన్ని ముడి వేస్తే గట్టిగా ఉంటుంది. పైగా చిక్కులు పడకుండా ఉంటుంది. ఇలా టూత్ బ్రష్‌తో చేయడం వల్ల సిల్క్ దారాలు సాఫ్ట్, ఫ్లఫ్పీగా ఏర్పడతాయి. అయితే పొడవాటి దారాన్ని రెండు భాగాలుగా చేసి చివరగా ముడి వేయండి. ఈ విధంగా స్ట్రింగ్ చేసిన తర్వాత మీకు నచ్చిన విధంగా రాఖీను తయారు చేసుకోండి. సీక్వెన్స్‌లో బీడ్స్‌ను గ్లూ స్టిక్ సహాయంతో అతికించండి. అంతే మీకు విధంగా రాఖీ పై భాగాన్ని తయారు చేసుకుంటే మీకు కావలసినటువంటి రాఖీ సిద్ధమైనట్లే. మీ క్రియేటివిటీని ఉపయోగించి మరింత అందంగా దానిని రూపొందించవచ్చు. అంతే కాకుండా ప్రేమతో చేసిన అనుభూతిని కూడా పొందవచ్చు.

ఊలుతో

ముందుగా ఊలు దారాలు తీసుకుని మీ చేతి వేళ్లకు చుట్టాలి. ఇలా ఇరవై రౌండ్లు వచ్చే వరకు చుట్టి చివరగా ఒక ముడి వేయాలి. ఈ ముడి మధ్యకి వచ్చేటట్టు చూసుకోండి. ఆ తర్వాత రెండు వైపులా చివర్లను కట్ చేసి మధ్యకు తీస్తే పువ్వు ఆకారంలో వచ్చే విధంగా పెట్టండి. ఇలా చేశాక మధ్యలో బీడ్‌ను అతికించండి. అంటే పువ్వు ఆకారంలో మధ్యన బీడ్ ఉండేటట్లు చూసుకోండి. ఇప్పుడు స్ట్రింగ్‌ను సపరేట్‌గా తయారు చేసుకోవాలి. తిరిగి రెండు రకాల ఊలు దారాలు తీసుకుని సరైన లెంత్ చూసుకుని మీ అన్నదమ్ముల చేయి సైజు ప్రకారం వాటిని కట్ చేసుకుని ఫ్యాబ్రిక్ గ్లూ సహాయంతో అతికించండి. స్ట్రింగ్‌ను మరింత అందంగా చేసుకోవాలి. అంటే మరికొన్ని బీడ్స్ నైనా ఉపయోగించి స్ట్రింగ్‌లోకి దూర్చి ముడి వేసుకుంటూ ఉండాలి. ఇలా అయితే బీడ్స్ జారిపోకుండా ఉంటాయి. అలాగే రాఖీ కూడా మరింత అందంగా ఉంటుంది. అంతే ఎంతో సులువుగా ఈ ఊలు రాఖీని తయారు చేసుకోవచ్చు.

యానిమల్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : యానిమల్ స్టిక్కర్స్, రంగు క్లాత్‌లు, కత్తెర, గ్లూ స్టిక్, సాటిన్ రిబ్బన్.

తయారు చేసే విధానం : ముందుగా మీకు నచ్చినటు వంటి క్లాత్‌ను తీసుకుని దాన్ని మీకు కావల్సిన సైజులో సర్కిల్ ఆకారంలో కట్ చేసుకోవాలి. ఇప్పుడు ఇంకొక క్లాత్‌ను తీసుకుని దాన్ని కూడా అదే ఆకారంలో కట్ చేసుకోవాలి. తరువాత ఈ రెండిటికి మధ్య ఒక సాటిన్ రిబ్బన్ పెట్టి గ్లూ స్టిక్ సహాయంతో అతికించాలి. తర్వాత సర్కిల్ ఆకారం పైన యానిమల్ స్టిక్కర్‌ను అంటించుకుంటే రాఖీ సిద్ధమవుతుంది. ఎంతో సులువుగా పిల్లలను ఆకర్షించే విధంగా ఈ రాఖీ ఉంటుంది. కాబట్టి ఒకసారి ప్రయత్నించండి. మీరు మళ్లీ మళ్లీ ఇదే పద్ధతిను పాటిస్తారు.

ఫోమ్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : ఫోమ్ బోర్డ్స్ లేక షీట్స్, కార్టూన్ స్టిక్కర్, సాటిన్ దారం, కత్తెర, గ్లూ స్టిక్.

తయారు చేసే విధానం : మీరు ఎంపిక చేసుకున్న రెండు రంగుల ఫోమ్ బోర్డ్స్ లేక షీట్స్‌ను తీసుకుని మీకు నచ్చినటువంటి షేప్‌లో కట్ చేసుకోవాలి. ఇలా కట్ చేసుకున్న రెండు ఆకారాలను ఒక దానిపై ఒకటి పెట్టి అతికించాలి. ఇలా చేశాక కార్టూన్ స్పీకర్‌ను రాఖీ పై భాగంలో అతికించాలి. చివరగా సాటిన్ రిబ్బన్‌ను తీసుకొని రాఖీ అడుగు భాగంలో అతికించి, అధనంగా ఉన్న సాటిన్ రిబ్బన్‌ను కట్ చేసుకుంటే సరిపోతుంది.

క్విల్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : పేపర్ క్విల్స్, డెకరేటివ్ స్టిక్కర్స్, సాటిన్ రిబ్బన్, కత్తెర, గ్లూ స్టిక్.

తయారు చేసే విధానం : ముందుగా సిద్ధం చేసుకున్న పేపర్ క్విల్స్‌ను తీసుకోవాలి. వాటిని ఎన్నో రకాలుగా, ఆకారాలుగా తీసుకోవచ్చు. క్విల్లింగ్ కిట్‌ను ఉపయోగించి మీకు నచ్చిన విధంగా తయారు చేసుకోవచ్చు. ఇలా చేసిన తర్వాత వాటికి డెకరేటివ్ స్టిక్కర్స్‌ను అతికించి ప్రతి పేపర్ క్విల్‌కు మధ్యన కుందన్ స్టిక్కర్స్ ఉండే విధంగా చూసుకోండి. ఇలా చేసిన తర్వాత సన్నటి సాటిన్ రిబ్బన్‌ను అడుగు భాగంలో అతికిస్తే సరిపోతుంది. అంతే మీ రాఖీ సిద్ధమయినట్లే. మరింత అందంగా ఉండాలంటే డెకరేటివ్ స్టిక్కర్స్‌తో పాటు వివిధ రకాల స్టోన్స్, కుందన్స్ లేక ఇతర మెటీరియల్స్ ను ఉపయోగించి కూడా తయారు చేసుకోవచ్చు.

థ్రెడ్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : దళసరి కాటన్ దారాలు 3, గోల్డ్ కలర్ సిల్క్ దారం, కత్తెర.

తయారు చేసే విధానం : మీరు తీసుకున్న 3 దారాలను ఉపయోగించి జడ అల్లినట్టుగా అల్లుకోవాలి. తర్వాత దారం రెండు వైపులా ముడి వేయాలి అంతే థ్రెడ్ రాఖీ సిద్ధమైనట్లే. ఇలా చేస్తున్నప్పుడు మధ్యలో ఒక దారాన్ని గోల్డ్ కలర్‌లో తీసుకుంటే చూడటానికి మరింత ఆకర్షణీయంగా ఉంటుంది.

బటన్ రాఖీ

కావాల్సిన మెటీరియల్ : కలర్ ఫుల్ బటన్స్, దళసరి క్లాత్ పీసెస్, సాటిన్ రిబ్బన్, కత్తెర, సూది, దారం.

తయారు చేసే విధానం : ముందుగా దళసరి క్లాత్ పీసెస్‌ను తీసుకుని మీకు నచ్చినటువంటి ఆకారంలో కట్ చేసుకొని ఉంచుకోవాలి. అంటే పువ్వులు, నక్షత్రాలు, ఆకులు, సీతాకోకచిలుక వంటి ఆకారాలులో కట్ చేసుకోవచ్చు. ఇలా రెండు పీసెస్ సిద్ధమైన తర్వాత వాటిని రెండు జోడించి సూది దారం సహాయంతో కుట్టాలి. ఇలా కుట్టిన తర్వాత దానిపై బటన్స్ పెట్టి మళ్లీ కుట్టాలి. చివరగా అడుగు భాగంలో సాటిన్ రిబ్బన్ పెడితే సరి పోతుంది.


ఫోమ్ రాఖీ


యానిమల్ రాఖీ


క్విల్ రాఖీ


బటన్ రాఖీ


థ్రెడ్ రాఖీ


ఉన్ని రాఖీ


సిల్క్ థ్రెడ్ రాఖీ



సోదర ప్రేమకు ప్రతిరూపం

మానవీయ సంబంధాలను పటిష్టం చేస్తూ.. సోదర ప్రేమకు ప్రతిరూపంగా నిలిచే 'రక్షా బంధన్' సంప్రదాయబద్ధమైన మన విలువలను మరింత ఉట్టిపడేలా చేస్తుంది. అమ్మాయిల పట్ల ఉన్మాదత్వం, విచక్షనా వంటి వెకిలి చేష్టలు పేట్రేగి, మనవతా విలువులు మంటగలుస్తున్న ప్రస్తుత యుగంలో 'రాఖీ పౌర్ణమి' తన విశిష్టతను చాటిచెబుతూ సోదర ప్రేమ పటిష్టతకు దోహదపడుతుంది. సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమిని ప్రతి ఏడాది ఘనంగా జరుపుకొంటాము. కేవలం అన్నాచెల్లెళ్లు.. అక్కాతమ్ముళ్లకే రక్షాబంధన్ పరిమితం కాదు స్నేహానికి ఈ బంధం ప్రతీకగా నిలుస్తుంది. విలువలతో కూడిన ప్రేమను ఆస్వాదించే వారు ఎవరైనా సరే రాఖీ వేడుకల్లో మునిగితేలాల్సిందే.

ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే రాఖీ పర్వదినాన్ని కులమతాలకు అతీతంగా మన రాష్ట్రంతో పాటు దేశ వ్యాప్తంగా లక్షలాది మంది ప్రజలు జరుపుకుంటారు. శ్రావణ మాసంలో వచ్చే పండుగ కాబట్టి ఈ పండుగను శ్రావణ పౌర్ణమిగా మరి కొందరు రాఖీ పౌర్ణమిగా పిలుస్తారు. కేరళ, తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాల్లో 'ఆవని ఆవిట్టం', బిహార్, మధ్యప్రదేశ్, జార్ఖండ్, చత్తీస్‌గడ్ రాష్ట్రాల్లో 'కజరి పూర్ణిమ'గా రక్షాబంధన్‌ని నిర్వహిస్తారు. గోవా, కర్నాటక, గుజరాత్, మహారాష్ట్రాల్లో ఈ పండుగతోనే కొత్త రుతువు ప్రారంభమైనట్లు అక్కడ ప్రజలు భావిస్తారు. రాఖీ వెనుక ఎన్నో పురాణ కథలున్నాయి. ఏది ఏమైనా ఆత్మీయ బంధాలను గాలికొదిలేస్తున్న ప్రస్తుత కాలంలో బ్రిటన్, నేపాల్, కెనడా తదితర దేశాల్లో కూడా రాఖీ పౌర్ణమిని జరుపుకుంటున్నారు.

ఇట్ల చేద్దాం

టైల్స్ మధ్యలో ఉన్న గ్రౌట్ లైన్స్ మురికిపట్టి ఉంటే బేకింగ్‌సోడాలో బ్లీచ్ కలిపి పేస్ట్‌లా చేసి ఆ లైన్ల మధ్యలో రాయాలి. పది నిమిషాల తర్వాత తుడిచేయాలి.



మోడీ మోసం!

(మొదటిపేజీ తరువాయి)

నానో యూరియాపై పరిశోధనలు చేసి అంతా అంబక్కని తేల్చారు. అశాస్త్రీయమని పత్రాలు ప్రకటించారు. ఈ విషయాన్ని ప్రముఖ వెబ్ మీడియా సంస్థ 'ది వైర్' తెలిపింది. నానో యూరియాకు శాస్త్రీయత లేదని, యూరియాపై సరైన పరిశోధనలు జరగలేదని, నిర్ధారణలు లేవని తాజాగా కథనాన్ని ప్రచురించింది. నానో ఎరువుల వలన భవిష్యత్తులో పంటల ఉత్పత్తిలో క్షీణత నెలకొని ప్రజల ఆహార భద్రతకు ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొంది. నానో యూరియాపై మోడీ ప్రభుత్వం చేసిన ప్రచారంలో ఎంత మాత్రం నిజం లేదని వారి అధ్యయనంలో తేలింది. దేశంలోనూ అటువంటి అధ్యయనాలు జరగ్గా పేలవ ఫలితాలే వెలువడ్డాయి.

ఇఫ్కో ఉత్పత్తి

సహకార రంగంలోని ఇఫ్కో సంస్థలో కేంద్ర ప్రభుత్వ వాటాలు 41 శాతం ఉన్నాయి. ఇఫ్కో సంస్థ నానో యూరియాను కనుగొన్నట్టు వెల్లడించింది. రైతులు నానో యూరియాను ఉపయోగిస్తే మొక్కలు యూరియాను త్వరగా సంగ్రహిస్తాయని, భూమిలో నత్రజని నిల్వలు పెరుగుతాయని, దిగుబడి 8 శాతం అధికంగా లభిస్తుందని, ఖర్చు తక్కువని పర్యావరణ హితమని ప్రకటించింది. సంప్రదాయ యూరియాతో పోల్చితే పంటలపై అత్యంత ప్రభావవంతంగా పని చేస్తుందని తెలిపింది. సాధారణ యూరియా 45 కిలోల బస్తాకు ప్రత్యామ్నాయంగా ద్రవ రూపంలోని నానో 500 మిల్లీలీటర్ల బాటిల్‌ను స్ప్రే చేస్తే సరిపోతుందని సిఫారసు చేసింది. ఇఫ్కో సమాచారంపై ఆదారపడి నానో యూరియా ఉత్పత్తికి కేంద్ర ప్రభుత్వం గుజరాత్‌లో ప్రత్యేకంగా కర్మాగారాన్ని నెలకొల్పింది. ఇక్కడ నానో డిఎపిని కూడా ఉత్పత్తి చేస్తోంది. దేశీయంగా నానో ఎరువుల ఉత్పత్తి కారణంగా ఎరువుల దిగుమతులపై ప్రభుత్వం చేసే ఖర్చు తగ్గుతుందని ఆశించారు. ఏడాదికి ఎరువుల దిగుమతులకు రూ.15 వేల నుంచి 20 వేల కోట్ల వ్యయం తగ్గుతుందని అంచనా వేశారు. ఈ ఊపులో 2025 నుంచి విదేశాల నుంచి ఎరువుల దిగుమతులు ఆపేస్తామని మోడీ ప్రభుత్వం చెప్పింది. బలవంతంగా రైతులకు నానో యూరియాను అంటగట్టే ప్రయత్నం చేసింది. సాధారణ యూరియా కేటాయింపులను తగ్గించి ప్రత్యామ్నాయం అంటూ నానో ఎరువులను పంపింది. దాంతో గుజరాత్ రాష్ట్రం కచ్ ప్రాంత రైతుల ఈ ఆగస్టు 15న పెద్ద ఎత్తున నిరసనలు తెలిపారు.

కుల గణనను అడ్డుకుంటే...

- కేంద్రం అగ్నిపర్వతాన్ని ఎదుర్కోవాల్సిందే : బీహార్

న్యూఢిల్లీ : కుల గణన చేపట్టాలన్న బీహార్ ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీంకోర్టులో కేంద్రం గంటల వ్యవధిలోనే రెండు అఫిడవిట్లు దాఖలు చేయడంపై జేడీయూ, దాని మిత్రపక్షం ఆర్జేడీలు ధ్వజమెత్తాయి. బీజేపీ తన నిజ స్వరూపాన్ని బయటపెట్టిందనీ, దాని లక్ష్యం సర్వేను అడ్డుకోవడమేనని ఆగ్రహం వ్యక్తంచేశాయి. కులగణనను అడ్డుకుంటే బీజేపీ అగ్ని పర్వతాన్ని ఎదుర్కోవలసివస్తుందని హెచ్చరించాయి.

'జనగణన లేదా జనగణనకు సమాన చర్య' ఏదైనా కేంద్రం మాత్రమే చేపట్టాలని సోమవారం కేంద్రం సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. కొన్ని గంటల్లోనే మొదటి అఫిడవిట్‌లో ఈ వ్యాఖ్యను కొట్టివేస్తూ మరో అఫిడవిట్ సమర్పించింది. మొదటి దానిలో 'అనుకోని తప్పిదం' జరిగిందంటూ.. ఆ పేరాగ్రాఫ్ అనుకోకుండా వచ్చిందని పేర్కొంది. ఈ అఫిడవిట్‌లపై జేడీయూ, దాని మిత్ర పక్షం ఆర్జేడీ విమర్శలు గుప్పించాయి.

ప్రధాని కార్యాలయం కులగణనను అడ్డుకునేందుకు పుస్తకంలోని ప్రతి ట్రిక్కును ప్రయత్నిస్తోందని ఆర్జేడీ ఎంపీ మనోజ్‌కుమార్ ఝా మండిపడ్డారు. ప్రజల హక్కులను అడ్డుకునేందుకు బీజేపీ, సంఘ్ పరివార్‌లు సర్వాధికారాలను ఒడ్డుతున్నాయనడాన్ని ఈ చర్య నిరూపిస్తోందని అన్నారు. వరుసగా అఫిడవిట్‌లపై స్పందిస్తూ.. ఇది అనుకోకుండా జరిగినది కాదని, బీజేపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాను.. ఈ వర్గం హక్కులను అడ్డుకోవాలని చూస్తే.. అగ్ని పర్వతాన్ని సష్టించినట్టే" అని హెచ్చరించారు. తాము జనగణన కాదని, సర్వే చేపడుతున్నామని బీహార్ ప్రభుత్వం మొదటి నుంచి చెబుతోందని .. కానీ కేంద్రం హాస్యాస్పదంగా వ్యవహరిస్తోందని జెడియు నేత, బీహార్ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి విజరుకుమార్ చౌదరి వ్యాఖ్యానించారు. బీహార్‌లో అఖిల పక్ష సమావేశంలో సర్వేకు బిజెపి మద్దతు తెలిపిందని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు అడ్డుపడుతోందని .. దీంతో బీజేపీ నిజస్వరూపం బయటపడిందని అన్నారు.

ఉండలేక.. వెళ్లలేక..!

- పునరాలోచనలో ఎమ్మెల్యేలు మైనంపల్లి, భేతి
- 'భవిష్యత్ కార్యాచరణ' పేరుతో అధిష్టానానికి మెలిక
- ఇంకా ఎదురు చూసే యోచనలో మరో ఇద్దరు నేతలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయం రోజుకో మలుపు తిరుగుతోంది. అసంతృప్తి తక్కువగా ఉందనుకునే సమయంలో ఒక్కొక్కరుగా ధిక్కార స్వరం వినిపిస్తున్నారు. ఇప్పటి వరకు ఒక్క సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు మాత్రమే అసహనం వ్యక్తం చేయగా.. ఇప్పుడు ఆయనకు మరో ఎమ్మెల్యే తోడయ్యారు. ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి కూడా ధిక్కార స్వరం అందుకున్నారు. ఒకరికి టికెట్ ఇచ్చినా.. ఇంకో టికెట్ కోసం అసంతృప్తి చెందుతుంటే.. మరొకరు అసలు టికెట్ ఎందుకు కేటాయించలేదని అధిష్టానాన్ని ప్రశ్నిస్తున్నారు. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు ఎటూ తేల్చుకోలేకపోతున్నారు. వారి పరిస్థితి 'ఉండలేక.. వెళ్లలేక..' అన్నట్టుగా తయారైంది.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం ఐదు నియోజకవర్గాలు ఉన్నాయి. మేడ్చల్ నుంచి మంత్రి మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తుండగా, కూకట్‌పల్లి నుంచి మాధవరం కృష్ణారావు, కుత్బుల్లాపూర్ నుంచి కేపీ వివేకానంద, మల్కాజిగిరి నుంచి మైనంపల్లి హనుమంతరావు, ఉప్పల్ నుంచి భేతి సుభాష్‌రెడ్డి ఎమ్మెల్యేలుగా కొనసాగుతున్నారు. ఇటీవల బీఆర్ఎస్ అధిష్టానం ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించింది. ఈ టికెట్ల కేటాయింపులో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో నలుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మళ్లీ అవకాశం దక్కింది. ఉప్పల్ అభ్యర్థిని మాత్రమే మార్చారు. ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా కొనసాగుతున్న భేతి సుభాష్‌రెడ్డిని కాదని బండారి లక్ష్మారెడ్డికి అవకాశం కల్పించారు. దాంతో ఆయన తాజాగా తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందే.. మైనంపల్లికి టికెట్ కేటాయించినా.. ఆయన కొడుక్కి మెదక్ టికెట్ ఇవ్వనందున మంత్రి హరీశ్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేయడంతోపాటు వారం రోజుల తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. ఇలా ఎన్నికలకు మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించడంతో అంసతృప్తులు బయటకు వస్తున్నారు. ఒక్కొక్కరుగా వారి ఆవేదనను కార్యకర్తలు, పార్టీ అధిష్టానం ముందు ఉంచుతున్నారు. ఒక పక్క టికెట్ రాని ఆశావాహులు కలిసి పని చేసుకోవాలని అధిష్టానం సూచిస్తుంటే.. మరోపక్క పార్టీలో కొనసాగాలా..? తమ దారి తాము చూసుకోవాలా..? అని సిట్టింగ్ ఎమ్మెల్యేలు మైనంపల్లి, భేతి తర్జనభర్జన పడుతున్నారు. ఎన్నికలు దగ్గరపడుతుండటంతో ఈ ఇద్దరు నేతల్లో అంతర్మథనం మొదలైంది. వారి పొలిటికల్ ఫ్యూచర్‌పై డైలమాలో ఉన్నారు. గులాబీ పార్టీలో ఉండలేక.. మరో పార్టీలోకి వెళ్లలేక.. సతమతమవుతున్నారు. పార్టీ కోసం పని చేసినా టికెట్లు దక్కలేదని వారి ఆవేదన వెళ్లగక్కుతున్నారు.

భవిష్యత్ కార్యాచరణతో మెలిక..

కొడుక్కి టికెట్ ఇవ్వలేదని మైనంపల్లి హనుమంతరావు, తనకు మళ్లీ అవకాశం ఇవ్వలేదని ఆవేదనతో ఉన్న భేతి సుభాష్‌రెడ్డి పునరాలోచనలో పడ్డారు. మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకించిన మైనంపల్లి అధిష్టానంలోని ఓ పెద్ద నాయకుడి నుంచి ఫోన్ రాగానే కాస్త తగ్గారు. వారం, పది రోజుల తర్వాత మెదక్, మల్కాజిగిరిలో పర్యటించి కార్యకర్తలు, అనుచరులను కలిసిన తర్వాత భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని చెప్పారు. ఉప్పల్ ఎమ్మెల్యే భేతి సుభాష్‌రెడ్డి కూడా ఇదే దారిలో వెళ్తున్నారు. ఇన్నాళ్లు సైలెంట్‌గా ఉన్న భేతి, మంగళవారం తెరపైకి వచ్చారు. కార్యకర్తలు, అనుచరులతో తన నివాసంలో సమావేశమై పార్టీ అధిష్టానంపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మారెడ్డిపై కూడా ఘాటు విమర్శలు చేశారు. అధిష్టానం పునరాలోచన చేయకుంటే వారం, పది రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తానని ఈయన కూడా చెప్పడం చర్చనీయాంశమైంది. నిజంగానే కార్యాచరణ ప్రకటిస్తారా..? లేక అధిష్టానం ఓ మెట్టు దిగొచ్చి టికెట్లు కేటాయిస్తుందని ఇలా చేస్తున్నారా..? అని ప్రజల్లో సందేహం మొదలైంది. భవిష్యత్ కార్యాచరణ పేరుతో పార్టీ అధిష్టానాన్ని భయపెడుతున్నారనే టాక్ కూడా జోరుగా వినిపిస్తోంది. కొంత మంది అభ్యర్థులను మారుస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో, ఈ ఇద్దరు ఎమ్మెల్యేలూ ఒకేలా ప్రకటన చేయడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఒకరిని చూసి ఒకరు ఇలా ప్రకటించారా..? లేక ఇద్దరూ కావాలనే అన్నారా..? లేక ఎవరి దారిన వారు మాట్లాడారా..? అనే చర్చ సాగుతోంది. భవిష్యత్ కార్యాచరణ పేరుతో మెలిక పెడితే.. అధిష్టానం దిగొచ్చి, పునరాలోచించి తమకు సీట్లు కేటాయిస్తుందనే ప్లాన్ వేసినట్టు కూడా మరోవైపు గుసగుసలు వినపడుతున్నాయి. వారం, పది రోజుల డెడ్ లైన్ పెడితే ఈ లోపు అధిష్టానం పునరాలోచించి తమను పిలిచి మాట్లాడుతుందని ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు భావిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ఎలక్షన్ స్టంట్

(మొదటిపేజీ తరువాయి)


యోజన (పిఎంయువై) వినియోగదారులకూ ఈ తగ్గింపు వర్తించనున్నదని, ప్రస్తుతం ఉన్న సబ్సిడీతో పాటు మొత్తంగా రూ.400 తగ్గింపు లభిస్తుందని అన్నారు. ఈ నిర్ణయం ద్వారా 33 కోట్ల మంది ఎల్‌పీజీ వినియోగదారులకు లబ్ది కలుగుతుందని కేంద్ర మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ తెలిపారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వానికి రూ.7,680 కోట్ల ఆర్థిక భారం పడనున్నట్టు వెల్లడించారు. కాగా, కేంద్రం అధికారంలోకి వచ్చాక.. గ్యాస్ ధరలను భారీగా పెంచింది. జులైలో ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ.50 పెంచిన విషయం తెలిసిందే. మే నెలలో రెండుసార్లు పెంచారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) అధికారిక సమాచారం ప్రకారం, 2021 ఫిబ్రవరి 4న రూ.25 పెంపుదలకు ముందు వంటగ్యాస్ ధర సిలిండర్‌కు రూ.694గా ఉంది. ప్రభుత్వ యాజమాన్యంలోని రిఫైనర్లు 2021 నుంచి వంట గ్యాస్ ధరలను 13 సార్లు పెంచారు. అయితే అసలు బీజేపీ సర్కారు గ్యాస్ ధర పెంచింది ఎంత.. తగ్గించింది ఎంత అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. 2014లో బీజేపీ అధికారంలోకి రాకముందు ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ ధర రూ.410 మాత్రమే. అందులో కూడా పేదలకు కొంత సబ్సిడీ లభించేది. ఇప్పుడు 2023లో గ్యాస్ సిలిండర్ ధర రూ.1053కి చేరింది. అంటే ఈ పదేండ్ల బీజేపీ పాలనలో గ్యాస్ రేటు దాదాపు 115 శాతం పెరిగింది. పైగా బీజేపీ ప్రభుత్వం గ్యాస్ సబ్సిడీని దాదాపు పూర్తిగా తగ్గించింది. మొన్నటిదాకా గ్యాస్ రేట్లు తగ్గించాలని దేశవ్యాప్తంగా ప్రజలు డిమాండ్ చేస్తే అంతర్జాతీయ మార్కెట్ ప్రకారమే ధరలు పెంచామని బీజేపీ నేతలు కల్లబొల్లి మాటలు చెప్పారు. ఇప్పుడేమో ఎన్నికల ముంగిట తాము పెంచినదాంట్లో కొంచెం తగ్గించి మహిళలనుద్ధరించినట్టు చెప్పుకుంటు న్నారు. అందుకే ఈ సర్కారు తీరు పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విశ్లేషకులు ఇదొక ఎన్నికల స్టంట్‌గా పేర్కొంటున్నారు. ప్రజలు ఇది నమ్మి ఓటు వేస్తే ముందుముందు సిలిండర్ ధర రెండువేలు దాటినా ఆశ్చర్యం లేదని హెచ్చరిస్తున్నారు.

చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయంపై కేంద్ర మంత్రి వర్గం తీర్మానం

చంద్రునికి చంద్రయాన్-3 మిషన్ చారిత్రాత్మక విజయాన్ని జరుపుకోవడం కోసం కేంద్రమంత్రి వర్గం తీర్మానం ఆమోదించింది. అలాగే శాస్త్రవేత్తల స్మారక విజయాన్ని మంత్రివర్గం అభినందించింది. ఇది మన అంతరిక్ష సంస్థకు మాత్రమే విజయం కాదనీ, ప్రపంచ వేదికపై భారతదేశం పురోగతికి ప్రకాశవంతమైన చిహ్నమని పేర్కొంది. చంద్రయాన్-3 విజయవంతమైన ఆగస్టు 23 'జాతీయ అంతరిక్ష దినోత్సవం'గా జరుపుకోవడాన్ని మంత్రివర్గం స్వాగతించింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) కృషికి అభినందనలు తెలిపింది. సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్‌ల ఈ యుగంలో మరింత మంది యువకులను సైన్స్ వైపు ప్రేరేపించాలని విద్యా ప్రపంచంతో అనుబంధానానికి కేంద్ర మంత్రివర్గం విజ్ఞప్తి చేసింది.

కాశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని ఎప్పుడు పునరుద్ధరిస్తారు?


(మొదటిపేజీ తరువాయి)



అనుమతించబోమని స్పష్టం చేసింది. కాగా సోమవారం జరిగిన విచారణలో జస్టిస్ డీవై చంద్రచూడ్ రాజ్యాంగంలోని 35-ఏ అధికరణను ప్రస్తావించారు. ఈ ఆర్టికల్ జమ్మూకాశ్మీర్ వాసులకు ప్రత్యేక హక్కులు కల్పిస్తోందని, అదే సమయంలో ఇతరుల ప్రాథమిక హక్కులను నిరాకరిస్తోందని ఆయన చెప్పారు. 'ఈ ఆర్టికల్ ప్రకారం జమ్మూకాశ్మీర్‌లోని శాశ్వత నివాసితులకు ప్రభుత్వోద్యోగాలు పొందే హక్కు ఉంది. ఆస్తుల కొనుగోలు చేసే హక్కు ఉంది. ఆ రాష్ట్రంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకునే హక్కు ఉంది. అయితే వేరే ప్రాంతాలకు చెందిన వారికి ఈ హక్కులు నిరాకరించారు' అని తెలిపారు. ఈ ప్రత్యేక సదుపాయాలపై న్యాయ సమీక్ష జరగకుండా ఈ ఆర్టికల్ రక్షణ కల్పించిందని ఆయన గుర్తు చేశారు.

మణిపూర్ శాసనసభ వాయిదా

- హింసపై చర్చకు మరింత సమయం అవసరం : కాంగ్రెస్ డిమాండ్



ఇంఫాల్ : సమావేశం ప్రారంభమైన గంటకే మణిపూర్ శాసనసభ నిరవధికంగా వాయిదా పడింది. సభను కేవలం ఒకే ఒక రోజు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే కనీసం ఐదు రోజుల పాటు సభ జరగాలని ప్రతిపక్ష కాంగ్రెస్ సభ్యులు డిమాండ్ చేశారు. జాతి ఘర్షణలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితిపై చర్చించేందుకు ఒక రోజు సమయం చాలదని ప్రతిపక్ష నేత, మాజీ ముఖ్యమంత్రి ఒక్రం ఇబోబి సింగ్ చెప్పారు. కాగా శాసనసభ సమావేశానికి కుకీ తెగకు చెందిన పది మంది ఎమ్మెల్యేలు గైర్హాజరు అయ్యారు. శాసనసభ మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశమైంది. మే 3వ తేదీ నుండి కుకీలు, మైతీల మధ్య జరుగుతున్న ఘర్షణల్లో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాప సూచకంగా సభ్యులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. తొలుత ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ ప్రసంగిస్తూ హింసాకాండలో మరణించిన వారి కుటుంబాలకు సానుభూతి తెలియజేశారు. ఆ కుటుంబాలను ఓదార్చడానికి మాటలు రావడం లేదని చెప్పారు. చర్చలు, శాంతియుత పద్ధతుల ద్వారా విభేదాలను పరిష్కరించుకోవాలని, రాష్ట్రంలో మత సామరస్యాన్ని కాపాడుకోవాలని శాసనసభ తీర్మానించింది. 'కులం, మతం, జాతి, భాష ఏదైనా మణిపూర్ ప్రజలందరి మధ్య సామరస్యం నెలకొల్పేందుకు ఈ సభ కట్టుబడి ఉంది. శాంతి స్థాపనే రాష్ట్ర ప్రాధాన్యత. రాష్ట్రంలో తిరిగి శాంతిని పునరుద్ధరించే వరకూ ప్రజల మధ్య నెలకొన్న విభేదాలను చర్చలు, రాజ్యాంగ పద్ధతుల ద్వారా పరిష్కరించేందుకు ఈ సభ కట్టుబడి ఉంది' అని తీర్మానం తెలిపింది. ఆ వెంటనే కాంగ్రెస్ సభ్యులు 'అవహేళనలు ఆపండి. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ నినాదాలు చేశారు. రాష్ట్రంలో పరిస్థితిపై చర్చించేందుకు కనీసం ఐదు రోజుల పాటు సభను నడపాలని డిమాండ్ చేశారు. ఆందోళన కొనసాగడంతో స్పీకర్ సభను అరగంట పాటు వాయిదా వేశారు. సభ తిరిగి సమావేశమైన తర్వాత కూడా కాంగ్రెస్ సభ్యులు నిరసన కొనసాగించారు. ఇలా అయితే సభను నడపలేమని అంటూ సమావేశాలను నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ప్రకటించారు.

వాటికి.. సంబంధం లేని కథ



శివ నిర్వాణ

'పెళ్లికి ముందు, పెళ్లి తర్వాత వచ్చే సమస్యలతో గతంలో అనేక సినిమాలు వచ్చాయి. అయితే ఈ సినిమాలో టైటిల్‌కు తగినట్లుగా ఎంటర్‌టైన్‌మెంట్‌తో కథతో హార్ట్ టచింగ్‌గా చెప్పాలనుకున్నా' అని అంటున్నారు దర్శకుడు శివ నిర్వాణ.

విజయ్ దేవరకొండ, సమంత జంటగా శివ నిర్వాణ రూపొందించిన సినిమా 'ఖుషి'. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మించారు. ఈ సినిమా సెప్టెంబర్ 1న పాన్ ఇండియా స్థాయిలో రిలీజ్‌కి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో డైరెక్టర్ శివ నిర్వాణ మీడియాతో పలు విశేషాలను తెలిపారు.


- నేను గతంలో తెరకెక్కించిన 'నిన్నుకోరి', మజిలీ' చిత్రాల్లో ఫెయిల్యూర్ లవ్ స్టోరీస్ చూపించాను. కానీ ఈసారి ఒక ఎంటర్‌టైనింగ్, ఎనర్జిటిక్, సరదాగా ఉండే ప్రేమ కథను చెప్పాలనుకున్నా. అలాగే ప్రేమ కథను ఎంత కొత్తగా చెప్పాలి అనే ఆలోచన నుంచి పుట్టిందే కాశ్మీర్ బ్యాక్ డ్రాప్.
- మణిరత్నం 'సఖి'లోని పాయింట్‌తో ఈ సినిమా చేశారనే వార్తలు వచ్చాయి. కానీ ఇందులో ఒక యూనిక్ పాయింట్ ఉంటుంది. ఇవాళ్టి కాంటెంపరరీ సొసైటీలో ఉన్న ఒక ఇష్యూను విజయ్, సమంత లాంటి పాపులర్ స్టార్స్ ద్వారా అడ్రస్ చేయిస్తే బాగుంటుందని నమ్మాను.
- ఈ సినిమా మ్యూజిక్ కోసం హేషమ్‌ను కలిసినప్పుడు ఆయన మంచి మ్యూజిక్ ఇవ్వగలడని అనిపించింది. నేను ఊహించినట్టే తను సూపర్బ్ మ్యూజిక్ ఇచ్చాడు. పాటలన్నీ హిట్. మ్యూజిక్‌కు మంచి పేరొచ్చింది కాబట్టి ఆ మ్యూజిక్‌తోనే సినిమా ప్రమోషన్‌ని గ్రాండ్‌గా స్టార్ట్ చేయాలని అనుకుని, మ్యూజిక్ కన్సర్ట్ పెట్టాం. ఇది విజయ్ చెప్పిన ఆలోచనే. నా గత సినిమాల్లోనూ పాటలు రాశాను. అయితే ఇందులో అన్నీ నేనే రాశాను. అదే తేడా.
- విజయ్‌లో మంచి కామెడీ టైమింగ్ ఉంటుంది. ఇందులో స్టైలిష్ కామెడీ చేశాడు. అమ్మాయిలకు, ఫ్యామిలీ ఆడియెన్స్‌కు విజయ్ క్యారెక్టర్ బాగా నచ్చుతుంది. అలాగే ఇందులో వింటేజ్ సమంతను చూస్తారు. డిఫరెంట్ జోనర్స్ చేసిన సమంత ఇందులో అద్భుతంగా నటించింది. అయితే ఈ సినిమా కథకు సమంత రియల్ లైఫ్‌కు ఎలాంటి పోలికలు, సంబంధం లేదు. విజయ్, సమంతల కెమిస్ట్రీ మిమ్మల్ని మెస్మరైజ్ చేస్తుంది.
- మైత్రీ ప్రొడ్యూసర్స్ డైరెక్టర్స్‌కు మంచి ఫ్రీడమ్ ఇస్తారు. వాళ్ళ సపోర్ట్‌తో మనం ఎంతైనా క్రియేటివిటీ చూపించుకోవచ్చు.

నవచిత్రం

నా సామి రంగ..



నాగార్జున



ధనుష్

కింగ్.. అని ముద్దుగా పిలుచుకునే అభిమానులకు తన బర్త్‌డే సందర్భంగా డబుల్ ధమాకా ఇచ్చారు నాగార్జున. సరికొత్త సినిమా అప్‌డేట్స్‌తో ఫ్యాన్స్‌కు ఫుల్‌జోష్‌నిచ్చారు. పలు ప్రముఖ చిత్రాలకు పనిచేసిన పాపులర్ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకుడిగా పరిచయం అవుతూ నాగార్జునతో తెరకెక్కిస్తున్న చిత్రానికి 'నా సామి రంగ' అనే టైటిల్‌ని ఖరారు చేశారు.

శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ పతాకంపై నిర్మాత శ్రీనివాస చిట్టూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ చిత్ర టైటిల్‌ను నాగ్ బర్త్‌డే సందర్భంగా మేకర్స్ మంగళవారం అధికారికంగా ప్రకటించారు. అలాగే మరో బిగ్ సర్‌ప్రైజ్‌గా మేకర్స్ గ్లింప్స్, ఫస్ట్-లుక్ పోస్టర్ ద్వారా కూడా సినిమా టైటిల్‌ను ప్రకటించారు. బీడీ తాగుతూ మాసీ హెయిర్ స్టయిల్, గడ్డంతో మాస్ అవతార్‌లో ఉన్న నాగ్ లుక్ అందర్నీ విశేషంగా అలరిస్తోంది. ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్ చేయబోతున్నారు. ఇందులో దర్శకుడు కరుణ కుమార్ ఓ కీలక పాత్ర పోషిస్తున్నారు.

ధనుష్ సినిమాలో నాగ్..

ధనుష్, రష్మిక మందన్నా, డైరెక్టర్ శేఖర్ కమ్ముల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సినిమాలో ఓ పవర్ రోల్‌లో నాగ్ నటిస్తున్నారు. ఈ విషయాన్ని ఆయన బర్త్‌డే సందర్భంగా మేకర్స్ అనౌన్స్ చేశారు.

నారాయణ్ దాస్ కె నారంగ్ ఆశీస్సులతో, సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ని శ్రీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పి (ఏషియన్ గ్రూప్)లో అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. సోనాలి నారంగ్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.

నా కెరీర్‌కి ఎంతో ముఖ్యమైన సినిమా



విశాల్

ఎప్పటికప్పుడు వైవిధ్యమైన సినిమాలతో ప్రేక్షకులను అలరించడంలో హీరో విశాల్ ఎప్పుడూ ముందుంటారు. అందుకే ఆయనకి అటు కోలీవుడ్‌లోను, ఇటు టాలీవుడ్‌లోనూ ప్రత్యేక అభిమాన గణం ఉంది. మంగళవారం విశాల్ పుట్టినరోజు. ఈ సందర్భంగా తాను కొత్తగా నటించిన 'మార్క్ ఆంటోని' సినిమా గురించి విశాల్ స్పందించారు.

'ఈ బర్త్ డే నాకెంతో స్పెషల్. సెప్టెంబర్ 15న 'మార్క్ ఆంటోని'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాను. నా కెరీర్లో ఇదెంతో ముఖ్యమైన సినిమా. పీరియాడిక్ మూవీ. ఇప్పటి వరకు నేను చేసిన సినిమాలన్నీ ఓ ఎత్తయితే ఇదొక ఎత్తు. ఇందులో రెండు విభిన్నమైన పాత్రల్లో నటించాను. ఆ రెండు పాత్రలకు సంబంధించిన లుక్స్‌కి కూడా అమేజింగ్ రెస్పాన్స్ వచ్చింది. అలాగే ఓ కీలకమైన పాత్రలో ఎస్.జె.సూర్య నటించారు. జి.వి.ప్రకాష్ సంగీతాన్ని అందిస్తున్నారు. అభినందన్ రామానుజం సినిమాటోగ్రఫీ.. పీటర్ హెయిన్స్, దిలీప్ సుబ్బరాయన్, కనల్ కణ్ణన్, దినేష్ సుబ్బరాయన్ ఫైట్స్ హైలైట్. తప్పకుండా ఆడియెన్స్‌కి ఓ మంచి డిఫరెంట్ థియేట్రికల్ ఎక్స్‌పీరియెన్స్‌ను ఈ మూవీ ఇస్తుంది' అని తెలిపారు.

స్పందన అద్భుతం



అనురాగ్ రెడ్డి, నితిన్ కృష్ణమూర్తి, సుప్రియ, శరత్

అన్నపూర్ణ స్టూడియోస్, చాయ్ బిస్కెట్ ఫిల్మ్స్ కలిసి కన్నడ బ్లాక్ బస్టర్ 'హాస్టల్ హుడుగారు బేకగిద్దరే'ను తెలుగులో 'బాయ్స్ హాస్టల్' పేరుతో గ్రాండ్‌గా విడుదల చేశాయి.

ఈ సినిమా తెలుగులోనూ బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించి 'స్టూడెంట్ ఫిల్మ్ ఆఫ్ ది ఇయర్'గా నిలిచింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ నిర్వహించిన సక్సెస్ మీట్‌లో నిర్మాత సుప్రియ మాట్లాడుతూ,'మంచి కంటెంట్ ఎక్కడున్నా ఆదరించడం తెలుగు ప్రేక్షకుల ప్రత్యేకత. 'హాస్టల్ బాయ్స్' చిత్రంతో అది మరోసారి రుజువైంది. ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇచ్చిన చిత్రమిది. థియేటర్‌లో ప్రేక్షకుల నవ్వులు చూస్తున్నపుడు వచ్చే తృప్తి వేరు. అలాంటి గొప్ప తృప్తి, మజాని ఇచ్చిన చిత్రమిది' అని తెలిపారు.

'ఈ సినిమాని ప్రేక్షకులు, ముఖ్యంగా టార్గెట్ ఆడియన్స్ ఆదరిస్తున్న తీరు నెక్ట్ లెవల్‌లో ఉంది. థియేటర్స్‌లో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఇండియాలోనే ఇలాంటి సినిమా రాలేదు. యూత్ చాలా ఎంజాయ్ చేస్తున్నారు. మంత్ ఎండ్ కావడంతో స్టూడెంట్స్‌కి పాకెట్ మనీ ఇష్యూ వస్తుంది. అందుకే వన్ ప్లస్ వన్ ఆఫర్ పెట్టాలని నిర్ణయించాం. దీనికి సంబంధించిన థియేటర్స్ జాబితా రిలీజ్ చేస్తాం' అని దర్శక, నిర్మాతలు చెప్పారు.

పల్లె మట్టి వాసన తెలిపే చిత్రం



గ్రీన్ ట్రీ ప్రొడక్షన్స్ ఆధ్వర్యంలో విభూది క్రియేషన్స్ పతాకంపై గరుడవేగ మేకింగ్స్ ప్రొడక్షన్ నెం.1 మంగళవారం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది. 'జబర్‌దస్త్' తో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న రాకింగ్ రాకేష్ ఈ చిత్రంతో హీరోగా పరిచయం అవుతున్నారు. 'గరుడవేగ' అంజి ఈ చిత్రానికి దర్శకుడు. అనన్య కథానాయిక.తెలంగాణ ఎంపీ (రాజ్యసభ) సంతోష్ కుమార్ క్లాప్ కొట్టగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ మంత్రి రోజా కెమెరా స్విచాన్ చేశారు. ముహూర్తపు సన్నివేశానికి తనికెళ్ళ భరణి గౌరవ దర్శకత్వం వహించగా, సాయి కుమార్ మేకర్స్‌కి స్క్రిప్ట్ అందజేశారు. పల్లె మట్టివాసన తెలిపే సినిమాగా రూపొందిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత: జయలక్ష్మీ సాయి కుమార్, సంగీతం: చరణ్ అర్జున్, లిరిక్స్ : కాసర్ల శ్యామ్, ఆర్ట్ డైరెక్టర్ : బత్తుల మహేష్, రైటర్ : నవీన్ కోలా.

రిలీజ్‌కి రెడీ

రక్షిత్ అట్లూరి, అపర్ణా జనార్ధన్, సంకీర్తన విపిన్, శత్రు కీలక పాత్రధారులుగా రూపొందుతున్న చిత్రం 'నరకాసుర'. సెబాస్టియన్ దర్శకత్వంలో సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిల్మ్ మేకర్స్‌పై ఆజ్జా శ్రీనివాస్ నిర్మిస్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తయిన ఈ చిత్రాన్ని సెప్టెంబర్ రెండో వారంలో తెలుగు, హిందీ, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. "నరకాసుర' అనే రాక్షసుడి జననం నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన చిత్రమిది. ఇటీవల విడుదలైన టీజర్‌ను చూసిన పలువురు సినీ ప్రముఖులు 'కాంతారా రేంజ్‌లో ఉందని ప్రశంసించడం హ్యాపీగా ఉంది' అని దర్శకుడు అన్నారు.



రక్షిత్ అట్లూరి, అపర్ణా జనార్ధన్

రాష్ట్రాల వారీగానే సర్దుబాట్లు

సీతారాం ఏచూరి ఇంటర్వ్యూ

2024 సార్వత్రిక ఎన్నికల్లో ఓట్ల చీలిక వల్ల బీజేపీ ప్రయోజనం పొందకుండా నివారించేందుకు గానూ ప్రతిపక్షాల మధ్య రాష్ట్రాలవారీగా పొత్తులు పెట్టుకోవడంపైనే ఇండియా బ్లాక్ దృష్టి కేంద్రీకరించనుంది. భారత రిపబ్లిక్ స్వభావాన్ని పరిరక్షించేందుకు ప్రతిపక్ష పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌కి చెందిన పర్వేజ్ సుల్తాన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలోని ముఖ్యాంశాలు

ములాఖాత్



ప్రతిపక్షాల ఓట్లలో చీలిక వల్ల బీజేపీ పొందే ప్రయోజనాలను తగ్గించడానికే ఈ సీట్ల సర్దుబాటు ఆలోచన.

ఇండియా ఫోరమ్ తదుపరి సమావేశం గురువారం జరగనుంది. ప్రతిపక్షాల ఫోరమ్‌కు కన్వీనర్‌ను నియమిస్తారని, కార్యదర్శివర్గాన్ని ఏర్పాటు చేస్తారని, కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందిస్తారని వార్తలు వస్తున్నాయి. ప్రతిపక్షాల ఫోరమ్ ముందున్న మార్గం గురించి మీరేం ఆలోచిస్తారు?

ఈ వేదిక ప్రజల్లో విశ్వాసాన్ని నెలకొల్పుతోంది. అన్ని ప్రతిపక్ష పార్టీలను ఒక్కచోటకు తీసుకువచ్చిన అంశాలు వున్నాయి. మన రిపబ్లిక్ స్వభావాన్ని పరిరక్షించడమనే మౌలిక అంశాలు కూడా ఇందులో వున్నాయి-మనది లౌకిక ప్రజాస్వామ్య రిపబ్లిక్. రాజ్యాంగం హామీ కల్పించిన హక్కులను కాపాడాల్సి వుంది. అదే మా ప్రాధమిక లక్ష్యంగా వుంది. ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే సాధారణంగా కనీస ఉమ్మడి కార్యక్రమం రూపొందుతూ వుంటుంది. ఎన్నికల ముందు ఎప్పుడూ రూపొందలేదు. కానీ, ఇప్పుడు మా ప్రచారం సందర్భంగా ప్రజల వద్దకు తీసుకెళ్లాల్సిన కొన్ని ఉమ్మడి సమస్యలు, అంశాలు కచ్చితంగా వున్నాయి. కార్యదర్శివర్గాన్ని ఏర్పాటు చేయడమా లేక మరే ఇతర రకమైన సమన్వయమా అన్నది ముంబయి సమావేశంలో చర్చిస్తాం. కార్యదర్శివర్గాన్ని, కన్వీనర్‌ను లేదా మరి దేన్నైనా ఏర్పాటు చేయడమన్నది అవసరం కాదు. అలయన్స్ భాగస్వాముల మధ్య సమన్వయం ఎలా వుండాలో మేం చర్చించనున్నాం.

లోక్‌సభ ఎన్నికల కోసం రాష్ట్రాల వారీగా సీట్ల సర్దుబాటు గురించి మాట్లాడుతున్నారు. కొంచెం వివరించండి....

ప్రతిపక్షాల ఓట్లలో చీలిక వల్ల బీజేపీ పొందే ప్రయోజనాలను తగ్గించడానికే ఈ సీట్ల సర్దుబాటు ఆలోచన. కేరళలో, మేం కాంగ్రెస్‌తో నేరుగా పోరాడుతున్నాం. అక్కడ బీజేపీకి ఒక్క ఎంఎల్ఎ కూడా లేరు, ఇక ఎంపీ గురించి ఆలోచనే అక్కర్లేదు. అందువల్ల వామపక్షాలు, కాంగ్రెస్ ముఖాముఖి పోరులో వున్నందువల్ల బీజేపీకి వచ్చే ప్రయోజనమేమీ వుండదు. ఎందుకంటే బీజేపీ అక్కడ అస్సలు లేనే లేదు. ఇకపోతే పశ్చిమ బెంగాల్‌లో, బీజేపీకి, టీఎంసీ (తృణమూల్ కాంగ్రెస్)కి వ్యతిరేకంగా పోరాడుతున్న వామపక్షాలు, కాంగ్రెస్, ఇతర లౌకిక శక్తులు కలిసి బీజేపీని బలహీనపరుస్తాయి. ఉదాహరణకు, పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి వ్యతిరేకంగా మేమందరం ఒక తాటిపైకి వచ్చామనుకుందాం, ప్రభుత్వ వ్యతిరేక ఓట్లన్నీ బీజేపీకే వెళతాయి. అలా కాకుండా బెంగాల్‌లో త్రిముఖ పోటీ జరిగినట్లైతే బీజేపీ పొందే లాభం తగ్గుతుంది. అందువల్ల అన్ని రాష్ట్రాలను వేటికవే భిన్నంగా చూడనున్నాం.

సంకీర్ణ భాగస్వాముల్లో కొన్నింటి మధ్య తీవ్ర విభేదాలు వున్నాయి. అటువంటపుడు అన్ని పార్టీలు కలిసి కట్టుగా పనిచేయగలరని మీరు భావిస్తున్నారా?

ప్రజలు మమ్మల్నందరినీ కలిసికట్టుగా వుంచుతారని నేను భావిస్తున్నాను. మమ్మల్ని ఇలా ఒక్క చోటకు తీసుకు వచ్చింది కూడా ప్రజల ఒత్తిడే. ప్రజల తోడ్పాటు కారణంగానే ఎమర్జన్సీ ఓడిపోయింది. అదే కారణంతోనే వాజ్‌పేయి ప్రభుత్వం కూడా ఓటమి పాలైంది. ఈ ప్రభుత్వానికి కూడా అదే గతి పడుతుంది. పైగా ప్రజల ఆకాంక్షలను మోసపుచ్చడమనేది ఏ ప్రతిపక్ష పార్టీకైనా చాలా కష్టం కాగలదు.



పార్లమెంట్‌లో సీపీఐ(ఎం) బలం గణనీయంగా తగ్గిపోయింది. అందుకు కారణం ఏమిటి? ఎంపీలను పెంచుకునేందుకు మీరేం చేయాలనుకుంటున్నారు?

ఇందుకు కారణాలు చాలా వున్నాయి. మాకు వ్యతిరేకంగా - అతివాదం నుంచి మితవాదం వరకు - పెద్ద ముఠానే వుంది. అయితే ఇదొక కారణమే. మా వైపు నుంచి కూడా కొన్ని పొరపాట్లు వున్నాయి. ఫలితంగా ఎన్నికల్లో మా పార్టీకి మద్దతు గణనీయంగా క్షీణించింది. అయితే అదే సమయంలో, దేశం ముందు ఒక ఎజెండాను నిర్దేశించగలిగే మా సామర్థ్యం ...ప్రజా ఉద్యమాల ద్వారా ఎజెండాను రూపొందించడం - వాస్తవానికి బలోపేతమైంది. మూడు వ్యవసాయ బిల్లులకు వ్యతిరేకంగా జరిగిన రైతాంగ పోరాటం ప్రధాని మోడీని వెనక్కి కొట్టింది. ఆ మూడు వివాదాస్పద బిల్లులు ఉపసంహరించుకున్నారు...కేవలం ఉద్యమాల వల్లనే ప్రధాని వాటిని ఉపసంహరిచుకోవాల్సి వచ్చింది. కేవలం మా ఉద్యమాల ద్వారా కార్మిక వర్గం చేస్తున్న పోరాటం కారణంగానే ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ క్రమంలో జాప్యం జరుగుతోంది. అందువల్ల, ప్రజా ఉద్యమాల ద్వారా జాతీయ ఎజెండాను రూపొందించడం వామపక్షాల పాత్రగా వుంది. అయితే, ఎన్నికల పరంగా చూసినట్లైతే మీరంటున్నది నిజమే. దాన్ని సరిదిద్దుకోవాల్సి వుంది. దానిపైనే మేం కృషి చేస్తున్నాం.

మీరు ఇటీవల మణిపూర్‌లో పర్యటించారు. ఒక వర్గం ప్రత్యేకంగా ఒక రాష్ట్రం కావాలని డిమాండ్ చేసే పరిస్థితి ఎలా వచ్చింది ?

అక్కడ పరిస్థితి భయంకరంగా వుంది. నా జీవితంలో దేశంలో మరెక్కడా కూడా ఇలాంటి పరిస్థితులను చూడలేదు. నిజానికి ఒక రాష్ట్రంలో రెండు దేశాలు వున్నాయి. మెయితీలు, కుకీలు నివసించే రెండు ప్రాంతాలకూ వెళ్లాం. మెయితీ పక్షం నుండి కుకీ ప్రాంతంలోకి మీరు వెళ్లాలనుకుంటే మెయితీలు ఎవరినీ మీతో అనుమతించరు. కుకీ ప్రాంతాల్లో పర్యటించేటపుడు మెయితీ అయిన మా పార్టీ కార్యదర్శినే మేం అక్కడ వదిలివేయాల్సి వచ్చింది. అలాగే మెయితీ ఏరియాలోకి వెళ్లాలన్నా కూడా ఇదే పరిస్థితి. రెండు వేర్వేరు ప్రాంతాలు అవి. నిజానికి అక్కడ యుద్ధం తరహా పరిస్థితి నెలకొంది. ఒక వైపు నుండి ఇంకో వైపునకు మీరు వెళ్లానుకుంటే మూడు స్థాయిల్లో అడ్డగించడాలు వుంటాయి. అవన్నీ చేసేది భద్రతా బలగాలు కాదు, స్థానికులే.

ప్రజలు, సమాజం పట్ల ఒక తరహాలో అమానుషంగా వ్యవహరించడం ఆ రాష్ట్రంలో జరుగుతోంది. ఈ జాతుల ఘర్షణలను సృష్టించడంలో 'డబుల్ ఇంజన్ సర్కార్' (కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ బీజేపీ ప్రభుత్వాలే వుండడం) ది చాలా పెద్ద పాత్ర. ఎన్నికల్లో కుకీ మిలిటెంట్ గ్రూపులకు మద్దతిచ్చింది. అసోం ముఖ్యమంత్రితో, ఈశాన్య ప్రాంత బీజేపీ ఇన్‌చార్జితో తమకు ఒప్పందం వున్నట్లు వారు (కుకీలు) చెబుతున్నారు. తాము బీజేపీకి మద్దతివ్వడం వల్లనే మణిపూర్ ముఖ్యమంత్రిగా బీరేన్ సింగ్ వున్నారని కుకీ మిలిటెంట్లు చెబుతున్నారు.

పది మంది కుకీ ఎంఎల్ఎల్లో ఏడుగురు బీజేపీకి చెందినవారే, వారిలో ఇద్దరు మంత్రులు. అయితే, కుకీలందరూ మయన్మార్ నుంచి అక్రమంగా వచ్చిన శరణార్థులేనని ముఖ్యమంత్రి చెబుతున్నారు. కేంద్ర హోం మంత్రి కూడా లోక్‌సభలో ఇదే విషయాన్ని చెప్పారు. దాంతో ఆనాడు ఎన్నికల్లో గెలుపొందడానికి మా మద్దతు కోరి ఇప్పుడు తమను అక్రమ శరణార్థులుగా, నార్కో తీవ్రవాదులుగా పిలుస్తున్నారని కుకీలు విమర్శిస్తున్నారు.

ఇప్పుడు నాగాలు కూడా రంగంలోకి వచ్చారు. నాగాల భూమిలో ఈ హింస జరుగుతోందని వారంటున్నారు. నాగా ఒప్పందానికి, మణిపూర్‌లో భూమికి చాలా సంబంధం వుంది. మంటలు ఆర్పకపోయినట్లైతే, పరిస్థితులు వారి (ప్రభుత్వం) నియంత్రణ నుంచి చేదాటి పోతాయి. మిజోరాం కూడా ప్రభావితమవుతుంది. ఈ సమస్యను ప్రభుత్వం త్వరగా పరిష్కరించని పక్షంలో, మొత్తంగా ఈశాన్య ప్రాంతమంతా ఇది విస్తరించే అవకాశం వుంది. సహాయ శిబిరాల్లో పరిస్థితులు - అది ఆహారం కానివ్వండి లేదా పారిశుధ్యం కానివ్వండి - చాలా భీతిగొలిపేలా వున్నాయి. అక్కడ పుట్టే పిల్లలకు ఎలాంటి వ్యాధి నిరోధక కార్యక్రమాలు వుండవూ, పోషకాహారమూ వుండదు.

ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం తక్షణమే తీసుకోవాల్సిన చర్యలు ఏంటి ?

అక్కడ 60వేల మంది కేంద్ర భద్రతా బలగాలు వున్నాయి. కానీ ఏం చర్యలు చేపట్టాల్సిన అవసరముంది అన్న విషయంలో వారికెలాంటి ఆదేశాలు లేవు. వారికి గనక ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లైతే, చాలా వరకు హింసను అదుపు చేయగలుగుతాం. మణిపూర్‌లోని ప్రతి ఒక్క వర్గానికి చెందిన వారిని కలుసుకునేందుకు కేంద్ర హోం మంత్రి నాయకత్వంలో ప్రభుత్వం అఖిల పక్ష ప్రతినిధి బృందాన్ని పంపాలి. వారి సాధకబాధలు వినాలి, వారి ఆకాంక్షలకు తగినట్లుగా పరిష్కారాన్ని రూపొందించేందుకు ప్రయత్నించాలి. మొదటి రోజు నుంచీ మేం ఇదే చెబుతూ వస్తున్నాం. మూడుసార్లు కాశ్మీర్‌కు వెళ్ళిన అటువంటి ప్రతినిధి బృందంలో శివరాజ్ పాటిల్, పి.చిదంబరం, రాజ్‌నాథ్ సింగ్‌లతో కలిసి నేను కూడా వెళ్ళాను. ఈ మూడు సందర్భాల్లోనూ, కొన్ని పరిష్కారాలు రూపొందించే దిశగా మేం ప్రయత్నించాం. ఇప్పుడు, ఇక్కడ అదే పనిని వారు (ప్రభుత్వం) ఎందుకు చేయడం లేదు ?

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.